# మూసీ

# MUSI


• Samputi : 28 • Sanchika : 06 • Pages : 64 • Rs. 20
• April 2025



- దివికేగిన “శ్రీ పెరుంబూదూరు లక్ష్మణమూర్తి”
- ప్రభాకరుల ప్రజ్ఞ : అక్షర లోచనం
- తెలుగులో అనువాద సంప్రదాయం
- తెలుగు భాషా సాహిత్యాలు-పరిశోధన పద్ధతులు
- సాంస్కృతిక శిలాఫలకం - ‘లోకపల్లి’ సంస్థానం
- నాటకం - రాజుల ప్రోత్సాహం
- నీతి శాస్త్రము - తాళపత్ర గ్రంథము
- భారతీయ యోగశాస్త్ర పరిచయం





Scanned with OKEN Scanner

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5  హైదరాబాద్ ఏప్రిల్ : 2025





వ్యవస్థాపకులు
శ్రీ బి.ఎన్.శాస్త్రి

# మూసీ

సాహిత్య
సాంస్కృతిక
చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

సంపుటి : 28 సంచిక : 6
ఏప్రిల్ - 2025
'విశ్వావసు' చైత్ర మాసం

సంపాదకులు (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA

సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM

Printed and Published by
B. MANOHARI

*Type Setting at :*
Kavyasree Graphics
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process
Ph. 27563075

విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక'
(MUSI Telugu Monthly Magazine)
పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్
- 500 013 .. ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com992

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796

## ఈ సంచికలో ...

### వ్యాసాలు

తెలుగు దినపత్రికల్లో పరీక్షణ, మూల్యాంకన పదవిభాగం : సంస్కృత భాషా ప్రభావం ... డా. రాంభట్ల పార్వతీశ్వర శర్మ 7
దివికేగిన "శ్రీపెరుంబూదూరు లక్ష్మణమూర్తి" ... డా. టంగుటూరి సైదులు 12
ప్రభాకరులు ప్రజ్ఞ : అక్షర లోచనం ... విశ్వర్షి వాసిలి వసంత కుమార్ 15
తెలుగులో అనువాద సంప్రదాయం ... డా. బాణాల భుజంగరెడ్డి 19
తెలుగు భాషా సాహిత్యాలు - పరిశోధన పద్ధతులు ... డా. వెంకటరామయ్య గంపా 27
తెలంగాణ కథ - స్థానికత ... భూక్యా ప్రమీల 33
సాంస్కృతిక శిలాఫలకం - 'లోకపల్లి' సంస్థానం ... మ్యాడం అభిలాష్ 38
నాటకం - రాజుల ప్రోత్సాహం ... జి. సురేష్ బాబు 41
నీతి శాస్త్రము - తాళపత్ర గ్రంథము... డా. గంద్ర లక్ష్మణరావు 43
భారతీయ యోగశాస్త్ర పరిచయం ... కె. సరితాదేవి 45
జానపద కళాసంపద - సామాజికత ... ఆచార్య ఎం. గోనానాయక్ 49
సాహిత్యంతో సామాజిక పరిశీలన ... డా. రమేష్ బుద్ధారం, క్రిష్ణమణి భాగవతి 52

### సమీక్షలు

'గ్రంథాంతరంగం' విమర్శనాత్మక వ్యాస సంపుటి ... డా. బడిగె ఉమేశ్ 56
తెలుగు సాహిత్యంలో త్రిమూర్తులు ... డా. వేల్పుల కుమారస్వామి 57
నేటి రాజకీయ వ్యవస్థకు నిలువటద్దం - ఏడు కోలలబాయి ... డా. తండు కృష్ణ కౌండిన్య 59

### కవితలు

వేదన ... డా. వొజ్జల శరత్ బాబు - 5; తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ - 6; అమ్మ ... విను - 40; శ్రీరామా యను దివ్య మంత్ర జపమై ... జి. లింగేశ్వర శర్మ - 47; విశ్వావసు ఉగాదికి ఆహ్వానం ... కుంతి - 48; సునీతా విలియమ్స్ ... డా. ఎన్. గోపి - 62..

❖ ❖ ❖ ❖ ❖

ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.

*Printed, Published and Owned by :*
**B. MANOHARI,** 2-2-1109/BK-LIG-10, Bathukamma Kunta, Bagh Amberpet, Hyderabad - 500 013. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad -13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5  హైదరాబాద్ ఏప్రిల్ : 2025

## సంపాదకీయం







వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి

స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
అమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**





# అయస్కాంతం

కామ్యత ఇతి కాంతం. కము కాంతౌ. కాంక్షింపబడునది. కస్య సుఖస్య అంతో నిశ్చయోఽత్రేతివా కాంతం – సుఖము యొక్క నిశ్చయము దీనియందు గలదు. అమరకోశంలోని పై వ్యుత్పత్తులను అనుసరించి కాంతం అంటే ఆకర్షించేది అనే అర్థంలో వినియోగిస్తున్నాం. అయః అనగా ఇనుము. ఇనుమును ఆకర్షించేది అయస్కాంతం కాగా, ఆకర్షక శక్తికే మారుపేరుగా 'అయస్కాంత' (మ్యాగ్నెట్) శబ్దం తరచుగా వినియోగించడం పరిపాటి.

ఈ సృష్టి మొత్తం కూడా ఈ అయస్కాంత శక్తితో కేంద్రీకృతం అయింది. ఆకర్షణ అనేది అనేక విధాలుగా ఉంటుంది. వ్యక్తుల మధ్యలో ఆకర్షణ వరకే మనం గమనిస్తున్నాం. స్త్రీ పురుషులు ఎవ్వరి మధ్యలోనైనా స్నేహ సంబంధాలు కొనసాగాలంటే ఒక ఆకర్షణ శక్తి బలీయంగా పని చేయాలి. కొందరికి ఈ అయస్కాంత శక్తి అధికంగా ఉంటుంది. కొందరికి చాలా తక్కువగా ఉంటుంది. కొందరు ఆధ్యాత్మికవేత్తలు, నాయకులు, వ్యాపారవేత్తలకు ఈ శక్తి అత్యధికంగా ఉండడం వల్లనే వారి భావాలకు, రాజకీయాలకు, వ్యాపారాలకు అత్యున్నత స్థితి ఏర్పడుతుంది. ఆ శక్తి తగ్గుతున్నా కొద్దీ ఈ విశ్వం కూడా ఆ వ్యక్తులకు బాధ్యతలను తగ్గిస్తూ ఉంటుంది.

విశ్వమే గొప్ప ఆకర్షణ శక్తితో కూడుకున్నది. కృష్ణ శబ్దంలోనూ ఆకర్షణశక్తి ఉంటుంది. సూర్యుడు మన దగ్గరలోని గొప్ప అయస్కాంత క్షేత్రాన్ని కలిగినవాడు. నవ గ్రహాలు కూడా సూర్యుని చుట్టూ ఒక పద్ధతి ప్రకారం సంచరించడం వల్ల ఆ గ్రహాలకు కూడా ఒక అయస్కాంత క్షేత్రం ఏర్పడుతుంది. అందుకే వాటి చుట్టూ ఉపగ్రహాలు ఒక పద్ధతి ప్రకారం సంచరిస్తాయి. ఒక ఇనుపముక్కను అయస్కాంతం చుట్టూ పద్ధతి ప్రకారం తిప్పుతూ ఉంటే దానిలోనూ అయస్కాంత శక్తి ఏర్పడి ఇతర ఇనుప ముక్కలను ఆకర్షించడం మొదలు పెడుతుంది. ఇనుప ముక్కలో ఉండే అణువులకు ఒక క్రమ పద్ధతి ఉండదు. అదే అయస్కాంతంలోని అణువులు ఒక పద్ధతి ప్రకారం ధ్రువాలను ఏర్పరచుకుంటాయి. అయస్కాంత క్షేత్రం కూడా ఏర్పడుతుంది.

వ్యక్తి కూడా తన మనస్సును, శరీరాన్ని ఒక క్రమ పద్ధతితో తమకన్నా గొప్ప శక్తుల చుట్టూ తిప్పుతూ ఉండడం వల్ల ఆ యా వ్యక్తులలో ఒక ప్రత్యేకమైన ఆకర్షణ శక్తి ఏర్పడుతుంది. వారే తమ మనస్సును శక్తి కేంద్రాల చుట్టూ కాకుండా సమస్యల చుట్టూ, సౌఖ్యాల చుట్టూ, వాటిని సముపార్జించుకునే కష్టాల చుట్టూ తిప్పుకుంటూ ఉండడం వల్ల సహజంగా ఉన్న ఆకర్షణ శక్తిని కోల్పోయి ఇంకా సమస్యలకు, బాధలకు, అనారోగ్యాలకు లోను అవుతూ ఉంటారు. సరియైన విజ్ఞానం ఉన్నవారు తమ కన్నా గొప్ప శక్తి చుట్టూ సంచరించాలనే జ్ఞానంతో జీవితాన్ని ఉద్ధరించుకుంటారు. అజ్ఞానంలో ఉన్నవారు ఈ పని చేయలేరని ఆధ్యాత్మిక వేత్తల భావన. దేవాలయంలో చేసే ప్రదక్షిణలు, అవగాహనతో చేసే స్తోత్ర, జపాలు కూడా ఇటువంటివే. అలా చేయడం ద్వారానే వ్యక్తి శక్తిగా, మానవుడు మహనీయుడుగా, మనిషి మనీషిగా మారే అవకాశం కలుగుతుంది.

ఈ సృష్టి మొత్తంలోనూ ఉన్న అయస్కాంత, ఆకర్షణ శక్తి... మనలోనూ ఉన్నట్టే. మనని మనం సంస్కరించుకోవడం అంటే నిరంతరం శుద్ధులం కావడమే. అనవసరాలను గుర్తించి, ప్రక్కకు పెట్టి అవసరమైన శక్తి చుట్టూ మనస్సును సంచరింపజేసే ప్రయత్నం చేస్తూ ఉంటే, లోక వ్యవహారాలన్నీ అత్యంత సులువుగా నిర్వహించగలిగే శక్తి వస్తూనే ఉంటుంది. అది మనలోనే ఏర్పడుతుంది. శారీరక, మానసిక శుద్ధత కోసం ప్రయత్నిస్తూ ... నిరంతరం భూమి సూర్యుని చుట్టూ తిరుగుతున్నట్లు మనస్సును మనకన్నా ఉన్నత శక్తి చుట్టూ కేంద్రీకరించడం ద్వారా జీవనం అత్యంత సులభం అవుతుంది. తక్కువ సమయంలో ఎక్కువ కార్యక్రమాలను సులువుగా చేసే అవకాశమూ కలుగుతుంది

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5  హైదరాబాద్ ఏప్రిల్ : 2025

# వేదన



ధర్మము దప్పగా నవని ధార్మికులెందరొ క్షోభనేడ్చిరే
ధర్మపు మర్మముల్ తెలిసి దైవిక భావము మాసునట్లుగన్
ధర్మము గిర్మముల్ వలదు దానము గీనము డొల్లలే ధరన్
ధర్మమనంగ మానవులు తల్చినదేయది ధర్మమౌననన్

జీవులు తల్లడిల్లె నిట జీవము నిల్వదు భూమిపై ననెన్
జీవులు చచ్చునట్లుగను చేయగ బూనెను మర్త్యుడెందుకో
జీవమనంగ నాదనుచు చిత్తపు రీతిన పాడుజేయుచున్
జీవుల తుల్యతల్ చెడిన జీతము లేదని బోరు బోరునన్

క్ష్మాజము కంటనీరొలుక కాటికె మాత్రబతు కిప్పు డిట్లనెన్
క్ష్మాజము లీభువిన్ మనుచు చాకిరి చేయగ మానవోత్తముల్
క్ష్మాజ ఘనత్వమున్ దెలిపి కావుము మానవ యన్నకానడే
క్ష్మాజము లేనినాడిలను కానరు జీవపు ఛాయనిండుగన్



సంద్రము లేచ్చె మానవుని జాడ్యము లన్నిటి జూచిబాధతోన్
సంద్రము నేమమున్ విడిచి సాగెడి రీతిన చేయుచుండెనే
సంద్రపు లాభముల్ తెలిసి జాగృతమవ్వడె యీనరుండెటుల్
సంద్రము నేలుకొమ్మనగ చావుకు ముందుకు వెళ్ళుచుండెనే

కొండలు గుట్టలున్ నరుని కోరికలన్నిటి గాంచియిట్లనెన్
కొండల నెక్కిరి తగెను కోనల జూసిరి చెల్లెనంతటిన్
కొండలు త్రవ్వి ప్రకృతిని కూల్చగ బూనుట నెట్లుచెల్లునే
కొండలు లేక జీవులకు గుండెలు నిల్వవు గాదె చూడగన్



గాలియు బాధతో ననెను కానడు మానడు పాడు వద్దనన్
గాలిని పాడుచేయ కన కాంక్షల సాగరమందు మున్గుచున్
గాలికి శ్వాసకు న్నెపుడు గాయము జేయుచు నీల్గుచుండెనే
గాలియె జీవితం బెరిగి కాంచుము స్వచ్ఛత రంపుగాలిగన్

జీవ నదీమతల్లులు సజీవులమై ధర నుండలేమనెన్
చేవలుడుంగచేయుటకు చేయదలంచిన దంత చేయుచున్
మా వనము న్వృథా సలిపి మానవు డెల్లరకున్వినాశమున్
కావలసిట్లు పూనుకొన గాయములే మిగు లెల్లవేళలన్

మానవు లిట్లు సాగుచు కుమార్గము లెన్నగ జీవులన్నియున్
కానల బోవునే? మతి వికారము బొందెనొ? యేమి జేతుమే
వే నియమాలు దప్పుటకు వేలకు వేల కుమార్గ గీతులన్
గానము జేయబూనుదురు కాటికి బో వని యంబరంబనెన్

డా. వొజ్జల శరత్ బాబు
ఫోన్ : 94941 83937

# మూసీ 'వ్యాస' రచయితలకు సూచనలు

మీ వ్యాసాన్ని వర్డ్ (యునికోడ్), పేజిమేకర్ (అను.7)లో టైప్ చేసి editormusi@gmail.com కు మెయిల్ చేయగలరు.

**వ్యాససంగ్రహం - (Abstract) : (200 పదాలకు మించకుండా)**

1. వ్యాససంగ్రహం : 1) రెండు-మూడు వాక్యాల పరిచయం, 2) వ్యాసరచన ముఖ్యోద్దేశం, 3) పరిశోధన ఊహా ప్రణాళిక, 4) అనుసరించిన పరిశోధన పద్ధతులు, 5) ఆశించే ఫలితాలతో కూడిన ముగింపు
2. Keywords : (కనీసం 5 పదాలు) (ఉదా: భాష, సాహిత్యం, ప్రక్రియలు, శతకం, నీతులు, విశ్లేషణ, అనువాదం, కవిపేరు, పాత్రచిత్రణ.)

**పూర్తి పరిశోధనవ్యాసం (పేజిమేకర్ ఎ4 సైజ్ లో 4-5 పేజీలకు తగ్గకుండా)**

1. **ఉపోద్ఘాతం :** ఒకటి లేదా రెండు పేరాలలో పరిశోధన వ్యాస ముఖ్య ఉద్దేశాన్ని ఉపోద్ఘాతంగా పేర్కొనాలి. కవి/రచయిత పరిచయం, పరిశోధనాంశానికి సంబంధించిన పరిచయవాక్యాలను వ్రాయవచ్చును. పూర్వపరిశోధనలకు సంబంధించిన అంశాలను సంక్షిప్తంగా చర్చించవచ్చును.
2. **విషయం :** పరిశోధనవిలువలుండాలి. సొంతంగా రాసినదై ఉండాలి. యథాతథంగా పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి గ్రహించకూడదు. కొన్ని విభాగాలుగా విభజించుకుని, ఆయా విభాగాలకు అనుగుణమైన ఉపశీర్షికలు (సైడ్ హెడ్డింగ్స్) పొందుపరచాలి. ఎంచుకున్న పరిశోధన సామగ్రి (పుస్తకాల) నుండి పద్యం, కవిత, గేయం, కీర్తన, కథ, నవల, నాటకభాగాలు మొదలైన ఉల్లేఖాలను (references) అనుకరణ చిహ్నాల (" ") తో తప్పక ఉటంకించాలి. ఈ ఉటంకింపుల ప్రక్కనే బ్రాకెట్లో తప్పకుండా వాటికి తగిన సూచికలను సంక్షిప్తాక్షరాలలో పొందుపరచాలి. (ఉదా. ఆం.మ. భార. ఆది, ఆశ్వా. 5ప. 235) పేర్కొన్న ప్రతి పద్యం, కవిత, గేయ, వచన భాగాలను చక్కగా, పరిశోధన ధ్యేయం దృష్ట్యా విశ్లేషించాలి.
3. **ముగింపు :** పరిశోధనలో వెలువడిన ఫలితాలను విశ్లేషణాత్మకంగా 'ముగింపు' అన్న శీర్షిక క్రింద పేర్కొనాలి. కవి ఆత్మీయత, శైలి, ఆకర్షణీయాంశాలు, వెలువడిన క్రొత్త విషయాలు, రచన సామాజిక ప్రయోజనం, భాషాసాహిత్యాలకు పరిపుష్టిని చేకూర్చే కావ్య, వ్యాకరణ, అలంకారాది అంశాలు, ప్రత్యేకతలు మొదలైనవి రెండు-మూడు పేరాలుగా ముగింపులో పేర్కొనవచ్చు.
4. **ఉపయుక్త గ్రంథసూచి :** ముగింపు తరువాత ఆధారగ్రంథాలన్నింటికీ ఉపయుక్తగ్రంథసూచిని తప్పక పొందుపరచాలి. (రచయితపేరు, ఇంటిపేరు. ప్రచురణ సంవత్సరం). గ్రంథం పేరు, ప్రచురణసంస్థ, ప్రచురణ స్థలం.) సంకలనగ్రంథాలకు సంపాదకుడి పేరు పేర్కొనాలి. పత్రికావ్యాసాలు, బ్లాగ్, వెబ్సైట్లకు పూర్తివివరాలు తెలపాలి. ఉదా :

1. కమలాకర శర్మ, సాగి. సంపా. **'కదంబం'** (తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు). 2014. హైదరాబాద్ : మూసీ ప్రచురణలు.
2. రఘునాథ శర్మ, శలాక. **'భారత ధ్వని దర్శనము'**. 2000. అనంతపురం : ఆనందవల్లీ గ్రంథమాల.

(సూచనలు పాటించని / పరిశోధనవిలువలు లేని/ పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి యథాతథంగా రాసే వ్యాసాలు తిరస్కరించబడతాయి)

# తుకారాం అభంగం

మట్టితల్లి మహిమను జూప
మన్ను తింటివోయి కన్నా
నైవేద్యము నోటినిండుగా
భూమాత జన్మము పండగ

మగువలు నోరెల్లబెట్టగా
నీ కిలకిల నవ్వులు పండగా
జనని గుండె మండగ బడితే
పూజ గొంటివేమి తియ్యగా

భువన భవన భాండాగారం
బొజ్జనిండా భక్తి ప్రసాదం
కోరుకున్న కోరినంతా
దొరికే కురచ స్వామి నోట

చెంగునెగురు దూడలేగల
వేణువూది వీనుల నిండా
సకల భావ సకల సంపద
నువ్వే నంటూ చాటిన స్వామి

తుకా భక్త కోటి చేరెను
నామ జపము నోట జేసెను
భక్తవరద వరద హస్తమా
కదలివచ్చు పరమానంద




అనువాదం

డా॥ మంత్రి శ్రీనివాస్

ఫోన్ : 83283 33720

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5  హైదరాబాద్ ఏప్రిల్ : 2025

# తెలుగు దినపత్రికల్లో పరీక్షణ, మూల్యాంకన పదజాలం : సంస్కృత భాషా ప్రభావం

## (Testing and Evaluation Terminology in Telugu Newspapers: Influence of the Sanskrit Language)

**డా. రాంభట్ల పార్వతీశ్వర శర్మ,** తెలుగు పోస్ట్- డాక్టోరల్ ఫెలో
(NTS-I, CIIL) ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.
ఫోన్ : +91 9247859580

**డా. జర్రా అప్పారావు,**
ఆచార్యులు మరియు తెలుగుశాఖాధ్యక్షులు, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

**వ్యాససంగ్రహం :**

వివిధశాస్త్రాలకు సంబంధించిన ఆంగ్లపదజాలానికి తెలుగు సమానార్థకపదాల సృష్టి కొన్నేళ్ళుగా కొనసాగుతోంది. పదకోశాలు, పాఠ్యపుస్తకాలు, ప్రశ్నపత్రాలలో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. ప్రత్యేకంగా విద్య/బోధనరంగాలకు చెందిన పరిభాష పాఠ్యగ్రంథాల్లోనే కాకుండా, దినపత్రికల్లో ప్రచురించే వార్తలు, ప్రత్యేకకథనాల్లో కూడా చోటుచేసుకోవడం గమనార్హం. ప్రస్తుత పరిశోధనపత్రం తెలుగు దినపత్రికల్లో కనబడే పరీక్షణ - మూల్యాంకన (టెస్టింగ్- ఎవాల్యుయేషన్) పదాలను శాస్త్రీయంగా అధ్యయనం చేసి, వీటిపై సంస్కృత భాషాప్రభావాన్ని పరిశీలిస్తుంది. ఈనాడు, సాక్షి, ఆంధ్రజ్యోతి, ప్రజాశక్తి దినపత్రికలు ఈ పరిశోధనకు ప్రాథమికాధారాలు. పదకోశాలు, పరిశోధనలు, విమర్శగ్రంథాలు ఈ పత్రరచనకు ద్వితీయాకరాలు. తెలుగు దినపత్రికల నుండి సేకరించిన పరీక్షణ, మూల్యాంకన పదజాలాన్ని భాషాశాస్త్రం - సంప్రదాయ వ్యాకరణాల దృష్ట్యా మథించడం, చర్చించడం, ఫలితాంశాలను ప్రకటించడం ఈ పరిశోధన పరమావధి.

**కీలకపదాలు :** పరీక్షణ, మూల్యాంకనం, తెలుగు, దినపత్రికలు, పదజాలం, పరిభాష, పదనిధి.

**Acknowledgement :**

నేషనల్ టెస్టింగ్ సర్వీస్-ఇండియా, సిఐఐఎల్ మైసూర్ వారి "పోస్ట్-డాక్టోరల్ ఫెలోషిప్" ద్వారా తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళా పరిషత్, విశాఖపట్నంలో నిర్వహిస్తున్న పోస్ట్-డాక్టోరల్ పరిశోధన (తెలుగులో కొత్తపదాల సృష్టి : ప్రాముఖ్యం, వివిధపద్ధతులు - మీడియా ప్రభావం) లో భాగంగా ఈ పత్రాన్ని సమర్పించడమైనది. ఈ పరిశోధనలో సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు.

**1. ప్రవేశిక :** ఒక పని చేశాక అది ఎంతవరకు ఫలవంతమైందో పరిశీలించుకోవడం అవసరం. పని ప్రారంభించడానికి ముందే కొన్ని లక్ష్యాలను నిర్ణయించుకుని వాటిని సాధించడానికి కృషి చేసి, వాటినెంత వరకు సాధించగలిగామో తెలుసుకోవడానికి చేసే ప్రయత్నమే మూల్యాంకనం. నికష, పరీక్ష, పరిగణన కంటే విశాలమైన అర్థం ఉన్న పదం మూల్యాంకనం. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధిని మాపనం చేసేది మూల్యాంకనం. పాఠ్యాత్మక




సముపార్జనం చేయడానికి తోడ్పడేది పరీక్షణ (ఈనాడు, 26-08-2023). బోధన, అభ్యసనం, మూల్యాంకనం పరస్పరాధారిత కార్యకలాపాలు. వీటిలో ఏ ఒక్కటి లేకపోయినా మిగతా రెండింటిపై ప్రతికూలప్రభావం పడుతుంది. బోధన-అభ్యసనాల నాణ్యతను నిర్ణయించడానికి మూల్యాంకనం ఒక శక్తివంతమైన సాధనం. భారతీయభాషాసంస్థ (CIIL) వివిధజాతీయస్థాయి సంస్థలను సందర్శించి, అనధికారికసర్వే చేసి 1980ల మధ్యకాలంలో మూల్యాంకనంలో R&D విభాగాన్ని ప్రారంభించి, భారతీయభాషలకు తక్కువ ప్రాధాన్యమివ్వడాన్ని గుర్తించి, ఈ భాషలలో మూల్యాంకనంపై కృషి చేయడానికి నడుం బిగించింది. భారతీయభాషల "మూల్యాంకనం" కోసం కృషి చేస్తున్న ఏకైక సంస్థ CIIL (ఏన్ ఇంట్రడక్షన్ టు ఎవాల్యుయేషన్ టెర్మినాలజి, పుట. vi).

**2. పూర్వ అధ్యయనాల సమీక్ష:**

తెలుగులో పరీక్షణ-మూల్యాంకనం (టెస్టింగ్ & ఎవాల్యుయేషన్) పరిభాషపై సమగ్రపరిశోధన జరగలేదు. తెలుగువిశ్వవిద్యాలయం పత్రికాభాషానిఘంటువు (1995) కూడా మూల్యాంకనం పరిభాషను స్పృశించలేదు. నరసింహారావు, కెవివిఎల్., పరంధామరెడ్డి, మునగాల (1996) సమష్టికృషితో "భాషాబోధన- పరీక్షణ- మూల్యాంకనం" అనే మౌలికరచన భారతీయభాషసంస్థ నుండి వెలువడింది. తరువాత సుబ్బయ్య, పోన్ (2008) "ఏన్ ఇంట్రడక్షన్ టు ఎవాల్యుయేషన్ టెర్మినాలజీ" అనే పరిచయగ్రంథం, బాలకుమార్, ఎం., పంకజ్, ద్వివేది (2016) సంయుక్తసంపాదకత్వంలో కొన్ని భారతీయభాషల్లో వేరువేరుగా "పారిభాషికపదకోశం-మూల్యాంకనం" గ్రంథం

ప్రచురితమయ్యాయి. పంకజ్, ద్వివేది (2017) సంపాదకత్వంలో "పారిభాషికపదకోశం-మూల్యాంకనం" తెలుగులోనూ అందుబాటులోకి వచ్చింది. CSTT - "సబ్జెక్ట్ వైజ్ గ్లోజరీస్"లో ఇంజనీరింగ్, సైన్స్, హ్యూమానిటీస్ విభాగాల ముఖ్యపరిభాషకు భారతీయభాషల్లో సమానార్థకాలను కూర్చింది. వీటిలో కొంత మూల్యాంకన పదజాలం ఉంది. తెలుగుపత్రికల్లో భాష గురించి కొన్ని పరిశోధలు వచ్చాయి. సీనియర్ జర్నలిస్ట్ జి. కృష్ణ ఒక సందర్భంలో- తెలుగుపత్రిక భాష అనువాదభాష అయిపోయిందని అభిప్రాయపడ్డారని గోవిందరాజు రామకృష్ణ (2007) తెలిపారు (అనువాదం, పుట. 18). నిత్యవ్యవహారంలోని పదాలు, అరువు తెచ్చుకున్నవి, ఉద్దేశపూర్వకంగా నిర్మించుకున్న పదాలు అని తెలుగులో పారిభాషికపదాలు మూడు విధాలుగా ఉండవచ్చని డా. జే. సదానందం (2009) సూచించారు (అనువాదకళ, పుట. 164). తెలుగు దినపత్రికల్లో వివిధకోణాల్లో పరిశోధనలు జరిగినప్పటికీ "పరీక్షణ - మూల్యాంకన పదజాలం"పై ప్రత్యేక అధ్యయనం జరగలేదు. ఈ అంశంపై ఇతోధికంగా కృషి చేయవలసి ఉంది.

**3. నేషనల్ టెస్టింగ్ సర్వీస్ - ఇండియా కృషి :**

2008 నుండి ఇప్పటివరకు మైసూర్ భారతీయభాషాసంస్థ, ఎన్.టి.ఎస్. ఇండియా., పరీక్షణ- మూల్యంకన విభాగంలో కృషి చేసింది. తెలుగు, కన్నడ, హిందీ, ఉర్దూ, ఒడియా, బెంగాలీ భాషల్లో మూల్యాంకన పారిభాషిక పదకోశాలను నిర్మించింది. ఇవన్నీ ద్విభాషా పదకోశాలు. ఇంగ్లీషు-భారతీయభాషల్లో ఇవి అందుబాటులో ఉన్నాయి. కన్నడ, హిందీ, ఉర్దూ భాషల్లో పరీక్షణ-మూల్యాంకన పదజాలానికి సంబంధించిన పరిచయగ్రంథాలను ఈ సంస్థ వెలువరించింది. టెస్టింగ్-ఎవాల్యుయేషన్‌కు చెందిన వివరణాత్మక ఆకర/సంప్రదింపు గ్రంథాల సూచికలను తయారుచెయ్యడం, నాలుగు విధాల భాషానైపుణ్యాలలో భాషవ్యవహర్తలకు ఉండే సామర్థ్యాలను పరీక్షించే సామగ్రిని అభివృద్ధి చెయ్యడం, భాషాపరీక్షణపై వ్యాసాలు, గ్రంథాలు ప్రచురించడం వంటి శాస్త్రీయమైన కృషిని NTS-I చేసింది. **1) ఎవాల్యుయేషన్ & టెస్టింగ్ :** జనరల్ రిఫరెన్సులు, 2) MILES కంటెంట్ / మెథడ్ / పర్పస్ రీసోర్సులు, 3) స్పెషల్ పర్పస్ ఎసెస్మెంట్ టూల్స్ అనే మూడు శాఖలుగా మూల్యాంకనం సంబంధ వనరులను సమకూర్చేందుకు CIIL ప్రయత్నించింది. భారతీయ భాషల్లో విషయనిపుణులను శిక్షణనిస్తూ తీర్చిదిద్దడం, పరిశోధనలను ప్రోత్సహిస్తూ ఉపకారవేతనాలు, ఫెలోషిప్పులతో ఈ విభాగ అభివృద్ధికి CIIL పాటుపడుతోంది.

**4. పరిశోధన ఉద్దేశం - పద్ధతి :**

తెలుగుపత్రికలు విద్యారంగం ఆధారంగా పరీక్షలు, మూల్యాంకన ప్రక్రియల గురించి విస్తృతంగా వార్తలు, ప్రత్యేకకథనాలు ప్రచురిస్తాయి. ఈనాడు పత్రిక "చదువు" పేరుతో, సాక్షి "భవిత" పేరుతో ప్రతిరోజు పోటీపరీక్షల సమాచారాన్ని అందిస్తున్నాయి. ఈ వార్తలు, కథనాలు, ప్రత్యేకసమాచారాలలో పత్రికలు ఉపయోగించే భాష, శైలి పాఠకులపై ప్రభావం చూపుతాయి. ఈనాడు, సాక్షి, ఆంధ్రజ్యోతి, ప్రజాశక్తి వంటి ప్రధానదినపత్రికల్లో చోటు చేసుకుంటున్న పరీక్షణ - మూల్యాంకనానికి సంబంధించిన పదాలను స్వరూపాన్నిబట్టి వివిధ విభాగాలుగా పరిగణించి ఈ అధ్యయనంలో విశ్లేషించడమైనది.

**5. తెలుగు పత్రికల్లో పరీక్షణ, మూల్యాంకన పదాల వినియోగ విధానం**

వివిధ పత్రికలలో ఈ తరహా పదాలు విభిన్నంగా ఉపయోగించబడ్డాయి. కొన్నిసార్లు సంస్కృతపదాలు ఉండగా, మరికొన్ని సందర్భాల్లో నేరుగా ఇంగ్లీషు పదాలు ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో భావస్ఫురణకు అనుగుణంగా రెండు, మూడు పదాలను కలిపి ఉపయోగించడం కూడా గమనించవచ్చు.

**5.1 తెలుగుదినపత్రికల నుండి సేకరించిన పదనిధి - మూలపదాలను (80) ఇక్కడ గమనించవచ్చు :**

అంతర్గతమూల్యాంకనం (Internal Evaluation/Assessment), పేపర్ (Paper), మార్కులు (Marks), ప్రశ్నల సంఖ్య (Number of Questions), బిట్పేపరు (Bit Paper), ఆబ్జెక్టివ్ (Objective), అతిలఘుసమాధాన ప్రశ్నలు (Very Short Answer Questions), లఘు సమాధానప్రశ్నలు (Short Answer Questions), వ్యాసరూప సమాధానప్రశ్నలు (Essay Type Questions), 10/10 సాధించడం (Scoring 10/10), పాఠ్యపుస్తకం (Textbook), సొంతంగా నోట్సు తయారుచేసుకొను (Self-prepared Notes), అర్థం కాని భావనలు (Unclear Concepts), గ్రహించిన విషయాలు (Understood Concepts), జవాబులు (Answers), కనీసం ఎనిమిది వాక్యాల్లో సమాధానం (Answer in at least eight sentences), అంతర్గతఎంపిక (Internal Choice), విషయం అవగాహన (Subject Understanding), ప్రయోగాలు (Experiments), విశ్లేషణ నైపుణ్యం (Analytical Skill), పట నైపుణ్యం (Map Skill), విద్యాప్రమాణాల్లోని ప్రశ్నలు (Standard-based Questions), ప్రయోగకృత్యం వివరణ అనే ప్రశ్నలు (Experiment-based Explanation Questions), తప్పనిసరి ప్రశ్నలు (Compulsory Questions), కనీసం నాలుగు

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5  హైదరాబాద్ ఏప్రిల్ : 2025

వాక్యాల్లో సమాధానం (Answer in at least four sentences), ఛాయిస్ (Choice), బొమ్మలుగీయడం (Drawing Diagrams), ప్రశ్నించడం (Questioning), పరికల్పన చేయడం ప్రశ్నలు (Designing Questions), నిజజీవితంలో ఎదురయ్యే సమస్యలపై ప్రశ్న (Real-life Problem Questions), భౌతికశాస్త్రసమస్య (Physics Problem), కనీసం ఒకటి లేదా రెండు వాక్యాల్లో జవాబులు (Answer in one or two sentences), పాఠ్యాంశాలు (Lessons), సూత్రాలు (Formulas), సమీకరణాలు (Equations), అనువర్తనాలు (Applications), స్వల్ప సమాధాన ప్రశ్నలు (Brief Answer Questions), ఒక పదంలో రాసే సమాధానం (One-word Answer), జతపరచడం (Matching), అంతర్గతపరీక్షల ఫలితాలు (Internal Exam Results), ఫెయిల్ (Fail), అధ్వాన ఫలితాలు (Poor Results), ఉత్తీర్ణులు (Passed Candidates), ఉత్తీర్ణత (Pass Percentage), రాష్ట్ర బోర్డుపరీక్షలు (State Board Exams), పరీక్షలు (Exams), జవాబుపత్రాలు (Answer Scripts), మూల్యాంకనం (Evaluation), మూల్యాంకనప్రక్రియ (Evaluation Process), పరిశీలన (Review), దిద్దిన జవాబుపత్రాలు (Corrected Answer Scripts), మూల్యాంకనం చేసిన పత్రాల పునఃపరిశీలన (Scrutiny), మార్కులు (Marks), జవాబు పత్రాల మూల్యాంకనం (Answer Scripts Evaluation), పరీక్షల్లో టాప్ స్కోర్ (Top Score in Exams), మంచి ప్రణాళిక (Good Strategy), సమయనియంత్రణ (Time Management), సమగ్రమైన చదువు (Comprehensive Study), సబ్జెక్టు (Subject), వెయిటేజీ (Weightage), మ్యాప్స్ (Maps), నూతనవిధానం (New Policy), పటాలు (Maps/Charts), పాఠ్యాంశాలు (Lessons), పటాల గుర్తింపు (Map Pointing), పట్టికలు (Tables), గ్రాఫ్‌లు (Graphs), విశ్లేషణాత్మక ప్రశ్నలు (Analytical Questions), అవుట్‌లైన్ మ్యాప్‌లు (Outline Maps), రీడింగ్ కాంప్రహెన్షన్ (Reading Comprehension), ఆబ్జెక్టివ్ ప్రశ్నలు (Objective Type Questions), సాధారణప్రశ్నలు (General Questions), మార్కులు స్కోర్ చేయడం (Scoring Marks), డబ్ల్యూహెచ్ వర్డ్ ప్రశ్నలు (WH-word Questions), పేరాగ్రాఫ్ రైటింగ్ ప్రశ్నలు (Paragraph Writing Questions), సబ్జెక్టులు (Subjects), మూల్యాంకనం (Evaluation), జవాబుపత్రాల మూల్యాంకనం (Evaluation of the Answer Sheets), పరీక్షల మూల్యాంకనం (Tests Evaluation), స్పాట్ వాల్యుయేషన్ (Spot Evaluation).

**6. పదనిర్మాణ పద్ధతులు–భేదాలు:**

సమానపదాలను రూపొందించే క్రమంలో అనుసరించే పద్ధతులను అనువర్తిత భాషాశాస్త్రం అభివర్ణించింది. భాషాశాస్త్ర




సూత్రాలను అన్వయించుకొని కొత్త పదాలను వివిధ మార్గాల్లో సృష్టించవచ్చు. **1. కొత్తగా తయారు చేసిన పదాలు** (Coined Words) : ఇవి పూర్తిగా కొత్తగా రూపొందించిన పదాలు. ఉదాహరణ : geek (కొంతకాలంగా ఉపయోగంలోకి వచ్చిన కంప్యూటర్ ప్రియుడికి చెందిన పదం). **2. సంక్షిప్తపదాలు** (Acronyms) : కొన్ని పదాల మొదటి అక్షరాలను కలిపి ఒక కొత్త పదంగా మార్చడం. ఉదాహరణ : LAN (Local Area Network). **3. అక్షర సంక్షిప్తీకరణలు** (Alphabetic Abbreviations) : పెద్దపదాల మొదటి అక్షరాలను తీసుకుని వాటిని ఒక పదంలా ఉపయోగించడం. ఉదాహరణ: HTML (Hyper Text Markup Language). **4. పదసంచలనాలు** (Clippings) : పదాన్ని చిన్నదిగా మార్చడం. ఉదాహరణ: Dr. (Doctor). **5. మిళితపదాలు** (Blends) : రెండు లేదా ఎక్కువ పదాలను కలిపి కొత్తపదంగా మార్చడం. ఉదాహరణ : infotainment (information + entertainment). **6. సాధారణీకరించిన బ్రాండ్ పేర్లు** (Generified Words) : ఒక బ్రాండ్ పేరు సాధారణ పదంగా మారిపోవడం. ఉదాహరణ : Xerox (జిరాక్స్ మిషన్ పేరుని అనుకరించి ప్రతి దస్త్రం నకలుగా అనడం). **7. వ్యక్తిగత నామాల నుండి వచ్చిన పదాలు** (Proper Nouns) : ప్రముఖ వ్యక్తుల పేరు నుంచి వచ్చిన పదాలు. ఉదాహరణ : Guillotine (ఫ్రెంచ్ విప్లవ సమయంలో వాడిన శిరచ్ఛేదయంత్రం). **8. నేరుగా ఇతర భాషల నుండి తీసుకున్న పదాలు** (Direct Borrowing) : ఇతరభాషల నుంచి మార్పులేకుండా తీసుకున్న పదాలు. ఉదాహరణ: Kindergarten (జర్మన్ నుండి తీసుకున్న పదం, చిన్నపిల్లల పాఠశాల). **9. పరోక్షంగా ఇతర భాషల నుండి వచ్చిన పదాలు** (Indirect Borrowing) : ఇతర భాషల పదాలను మార్గమధ్యంగా ఉపయోగించడం. ఉదాహరణలు : Firewater (మద్యం, అమెరికన్ స్థానిక జన సముదాయాల ఉపమానం). నూతనపదకల్పనంలో ఇలాంటి

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5  హైదరాబాద్ ఏప్రిల్ : 2025




భేదాలను భాషాశాస్త్రం సూచిస్తోంది. సమానపదరూపకల్పనలో సమాసపద్ధతి, పరప్రత్యయపద్ధతి, పూర్వప్రత్యయ పద్ధతి, వ్యాకరణ సాదృశ్యపద్ధతి, ఊహాత్మకపద్ధతి వంటి కొన్ని అనుసరణీయ పద్ధతులను జే. సదానందం పేర్కొన్నారు (అనువాదకళ, పుట. 173). తెలుగు పత్రికల్లో మూల్యాంకనం పరిభాష ఉపయోగంలో కనిపిస్తున్న నాలుగురకాల పదజాలాన్ని ఇప్పుడు పరిశీలిద్దాం.

**6.1 సంస్కృతీకరణ (Sanskritization)**

తత్సమపద సంవిధానంతో ఏర్పడిన పదాలు: మూల్యాంకనం, విశ్లేషణ, అంతర్గత మూల్యాంకనం, ఉత్తీర్ణత, విద్యా ప్రమాణాలు, ప్రణాళిక, సమయనియంత్రణ, నూతనవిధానం మొదలైనవి.

**6.2 తెలుగీకరణ/తర్జుమా (Translation & Indigenization)**

ఇవి తెలుగు వ్యాకరణం ఆధారంగా మార్పులకు లోనై ఏర్పడినవి: ప్రశ్నల సంఖ్య, సమగ్రమైన చదువు, గ్రహించిన విషయాలు, పటాల గుర్తింపు, పరీక్షల మూల్యాంకనం, దిద్దడం మొదలైనవి.

**6.3 ఉచ్చారణ ఆధారంగా రూపాంతరం/లిప్యంతీకరణ (Transliteration)**

ఇంగ్లీష్ పదాలను తెలుగులిపిలో యధాతథంగా మార్చి వాడినపదాలు : పేపర్, బిట్పేపరు, ఆబ్జెక్టివ్, మ్యాప్స్, డబ్ల్యూహెచ్ వర్డ్ ప్రశ్నలు, స్కోర్, వెయిటేజి మొదలైనవి.

**6.4 కొన్ని పదబంధాలుగా వాడడం (Compounding Words)**

రెండు లేదా అంతకంటే ఎక్కువ పదాలను కలిపి రూపుదిద్దుకున్న పదాలు : జవాబు పత్రాల మూల్యాంకనం, పరీక్షల్లో టాప్ స్కోర్, పరికల్పన చేయడం ప్రశ్నలు, నిజ జీవిత సమస్యలపై ప్రశ్న మొదలైనవి.

**7. వివిధపత్రికల భాషావిధానం – భేదసాదృశ్యాల విశ్లేషణ**

ప్రత్యేకంగా పరిశీలించిన నాలుగు తెలుగు దినపత్రికలు ఈనాడు, సాక్షి, ఆంధ్రజ్యోతి, ప్రజాశక్తి భిన్నభిన్న భాషా విధానాలను అనుసరిస్తున్నాయి. "ఈనాడు" పత్రిక సరళమైన, నేటితరానికి సులభంగా అర్థమయ్యే పదజాలానికి ప్రాధాన్యమిస్తోంది. మూల్యాంకన పదాలకు తెలుగు సమానార్థకపదాలను విరివిగా సృష్టిస్తోంది. వీటిపై సంస్కృతప్రభావం అధికం. "సాక్షి" తర్జుమా భేదసాదృశ్యాల విశ్లేషణ/ఉచ్చారణ ఆధారిత పదాలను నేరుగా వాడుతోంది. మూల్యాంకన పరిభాషకు తెలుగు సమానార్థకపదాలను సృజించడంలో ఈ పత్రిక పాత్ర తక్కువే. "ఆంధ్రజ్యోతి" కొంత శాస్త్రీయ నిఘంటు పదాలను ప్రోత్సహిస్తోంది. కొత్తగా రూపొందించినవి ఒకటి రెండు పదాలు తప్ప (సంస్కృత ప్రభావం ఉన్నవే), మరే పదాన్నైనా తెలుగు చెయ్యకుండా లిప్యంతీకరణ విధానాన్నే ఈ పత్రిక కూడా అనుసరిస్తోంది. "ప్రజాశక్తి" పత్రికలో ఒకటి – రెండు బహుళప్రచారంలో ఉన్న పదాలే వాడుకలో ఉన్నాయి. ఇవీ సంస్కృతపదాలే. ఏ కొత్తపదాన్నైనా వాడాల్సి వస్తే లింప్యతీకరణ చేసి ఉపయోగిస్తోంది.

**8. చర్చ – ఫలితాంశాల ప్రకటన**

ఈ అధ్యయనంలో పత్రికల్లో పదసంపత్తిని విశ్లేషించగా–

♦ పత్రికలు కొన్నిసార్లు ఇంగ్లీషు పదాలనే నేరుగా వాడుతున్నాయి.

♦ కొన్నిసందర్భాల్లో సంస్కృతపదాలను తెలుగు వ్యాకరణనియమాల ప్రకారం సృష్టించి వాడుతున్నాయి.

♦ విద్యావిధానంలో మార్పులు చోటుచేసుకోవడం వల్ల కొత్త పదాల ఆవిష్కరణ కూడా కనిపిస్తోంది.

♦ పత్రికల్లో కనిపిస్తున్న ఈ పరిభాషలో కొన్ని పదాలకు తెలుగు సమానార్థకాలు NTS-I తయారు చేసిన "మూల్యాంకన పారిభాషిక పదకోశం"లో ఉన్నాయి. ఉదా : Score/Scoring (ఫలితాంశం / అంకసాధన), Short Answer Question (సంక్షిప్త సమాధానప్రశ్న / లఘుసమాధానప్రశ్న), Essay Type Question (వ్యాసరూప ప్రశ్న), Spot Evaluation (స్పాట్ మూల్యాంకనం,) Weightage (ప్రాముఖ్యం), Self-Assessment (స్వీయమదింపు) వంటివి.

♦ తెలుగు దినపత్రికలు భాషావికాసంలో కీలకపాత్రను పోషిస్తున్నాయి. వాడుకభాషలో కొత్త పదాలను ప్రవేశపెట్టడంలో, పాఠకుల అవగాహనకు అనుగుణంగా పదాలను తీర్చిదిద్దడంలో వీటి ప్రభావం ఎక్కువే. భవిష్యత్తులో మరింత లోతైన పరిశోధనలు చేస్తే, తెలుగు పత్రికారంగంలో పరీక్షణ – మూల్యాంకన పరిభాషపై విపులమైన విశ్లేషణలు చేయవచ్చు.

**9. ఉపయుక్తగ్రంథసూచిక**

**గ్రంథాలు:**

1. అనిందిత సాహూ. (2024) అప్రిషియేటింగ్ లింగ్విస్టిక్స్, ఏ టైపోలాజికల్ అప్రోచ్. NPTEL, ఢిల్లీ.

2. కుమారదేవి, సుంకర. (1983) తెలుగు వార్తాపత్రికల్లో భాషా స్వరూపప్రయోగాలు (సి.గ్రం.), శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం.

3. నరసింహారావు, కెవివిఎల్., & మునగాల, పరంధామ రెడ్డి. (1996). భాషాబోధన పరీక్షణ మూల్యాంకనం. భారతీయ భాషా సంస్థ, మైసూరు.

4. పంకజ్, ద్వివేది (సం). (2017). పారిభాషిక పదకోశం– మూల్యాంకనం, NTS-I, CIIL, మైసూర్.

5. పత్రికాభాషా నిఘంటువు (2018). పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

6. రామకృష్ణారావు, గోవిందరాజు (2007). అనువాదం. ద్రావిడవిశ్వవిద్యాలయం, కుప్పం.

7. సదానందం, జే., & ప్రధాన గురుదత్త. (2009). అనువాదకళ. ద్రావిడవిశ్వవిద్యాలయం, కుప్పం.

8. సుబ్బయ్య, పోన్. (2008). ఏన్ ఇంట్రడక్షన్ టు ఎవాల్యుయేషన్ టెర్మినాలజీ. CIIL, మైసూర్.

**దినపత్రికలు:**

1. నౌషాద్. "నూతన పరీక్షా విధానం భౌతిక రసాయన శాస్త్రం". ఈనాడు దినపత్రిక (09–10–2020) ప్రత్యేకకథనం.

Url: https://pratibha.eenadu.net/tenth/article/andhra-pradesh/telugu-medium/education/2-2-4-218-608-20040011543

2. "ప్రారంభమైన టెన్త్ మూల్యాంకనం". ఆంధ్రజ్యోతి దినపత్రిక. (20–04–2023). Url: https://www.andhrajyothy.com/2023/andhra-pradesh/visakhapatnam/tenth-evaluation-started-1052894.html

3. "మూల్యాంకనంలో కచ్చితత్వం ఉండాలి". ఆంధ్రజ్యోతి దినపత్రిక.(19–03–2024). Url: https://www.andhrajyothy.com/2024/andhra-pradesh/kurnool/there-should-be-accuracy-in-evaluation-1227043.html

4. "సీబీఎస్ఈ విద్యార్థులకు ఈ ఏడాది రాష్ట్ర బోర్డు పరీక్షలే!" ఈనాడు దినపత్రిక (13.09.2024). Url: https://pratibha.eenadu.net/tenth/article/andhra-pradesh/telugu-medium/state-board-exams-for-cbse-students-this-year/2-2-4-218-608-23040006706

5. "పదో తరగతి పరీక్షల్లో టాప్ స్కోర్ చేయాలా? సబ్జెక్టుల వారీగా స్టడీ ప్లాన్..". సాక్షి దినపత్రిక. (19–02–2025). Url: https://education.sakshi.com/ap-10th/education-news/top-tips-score-high-ssc-exams-172095

6. "పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం.... కీలక ప్రకటన" సాక్షి దినపత్రిక. (29–03–2025) Url: https://education.sakshi.com/ap-10th/education-news/evaluation-answer-sheets-class-10-public-exams-key-announcement-174360

7. "3 నుంచి 'పది' మూల్యాంకనం". ప్రజాశక్తి దినపత్రిక. (31.03.2025) Url: https://prajasakti.com/district-news/3-to-ten-evaluation.

❖ ❖ ❖ ❖ ❖

**శిలాక్షరం**

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం – సమాలోచన)**

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.

సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి

సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య

వెల : 300/-




**సంప్రదించండి.**

**మూసీ మాసపత్రిక**

**ఫోన్ : 934 7971177**

**మూసీ**

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక

మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి

వెంటనే శాశ్వత చందాదారులు కండి.

సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక

పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక

యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక

శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-

**సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5 12 హైదరాబాద్ ఏప్రిల్ : 2025

నివాళి

# దివికేగిన 'శ్రీపెరంబూదూరు లక్ష్మణమూర్తి'

డా. టంగుటూరి సైదులు, ఫోన్ : 991 2676 267



ఉభయ భాషల యందు ప్రభ తోడ వెలుగొంది
వేత్తయై సభల తా వెలిగినాడు
వేద వేదాంగాల సాదరమ్మున నేర్చి
మంత్రముగ్ధుల జేసి మసలినాడు
సద్గ్రంథ పఠనమ్ము సాగించుచు సతమ్ము
ధర్మాభిలాషియై తనరినాడు
కావ్యముల రచించి కవి పండితాళిలో
విద్వన్మణియనగా వెలిగినాడు
సకల దిగ్భాసమాన యశమ్మునంది
భువిని యలరారినట్టి ప్రపూత చరితు
ప్రజ్ఞు బుధవంద్యు వినుత పెరంబుదూరు
వంశ్యు లక్ష్మణమూర్తిని ప్రాంజలింతు

-మద్దూరి రామమూర్తి

"కృషితో నాస్తి దుర్భిక్షం" అన్నట్లు కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు అని అంటారు పెద్దలు. ఒక చిన్న పల్లెలో సాధారణ బ్రాహ్మణ కుటుంబంలో పుట్టి తన విద్యాసుగంధంతో ఈ ప్రాంత మట్టి పరిమళాలను అంతర్జాతీయ స్థాయిలో నిలిపిన బహుభాషా కోవిదులు ఆచార్య శ్రీ పెరంబుదూరు లక్ష్మణమూర్తిగారు వారు ఇక లేరనే వార్త విని సాహితీ సాహితీ లోకమంతా దిగ్భ్రాంతికి గురైంది. కడసారిగా వారికి కన్నీటి వీడ్కోలు పలికారు. ఆచార్యులవారు కవిగా, విమర్శకులుగా, వ్యాసకర్తగా, అనేక భాషా పాండిత్యాలలో సాధికారత కలిగిన వ్యక్తి అద్భుతంగా ప్రౌఢ కవిత్వంలో పద్యాన్ని పరుగులు పెట్టించగలరు. అంతే స్థాయిలో సుమనోహరంగా గద్యాన్ని కూడా రాయగలరు. వేద శాస్త్ర తాత్త్విక విషయాలతో ముదులను సైతం భక్తితత్త్వం వైపు మరల్చి జీవిత పరమార్థాన్ని చాటగలరు. విద్యార్థులకు దారి దీపం. ప్రతిభతో ఈ ప్రాంత గౌరవాన్ని అంతర్జాతీయ స్థాయిలో తెలిపిన సమున్నత జ్ఞాన సంపన్నులు. వ్యక్తిత్వంలో సులక్షణ లక్ష్మణుడు.

కాకతీయ విశ్వవిద్యాలయంలో సుదీర్ఘకాలంగా పనిచేసిన ఆంగ్ల ఆచార్యులు ఆచార్య లక్ష్మణమూర్తి గారు 21-3-2025 శనివారం రోజున స్వర్గస్తులైనారు. లక్ష్మణ మూర్తిగారు 1940 జూలై 20న నల్లగొండ జిల్లా, నకిరేకల్ మండలం, చందుపట్ల గ్రామంలో శ్రీ పెరంబుదూరు రాఘవాచార్య, తాయమ్మ పుణ్య దంపతులకు జన్మించారు. వీరిది శ్రీ వైష్ణవ సంప్రదాయ కుటుంబం. తండ్రిగారు మంచి పండితులు రాఘవాచార్య గారికి 11మంది సంతానం 5గురు మగ పిల్లలు, ఏడుగురు ఆడపిల్లలు. లక్ష్మణమూర్తి గారు రెండవ సంతానం వీరి చిన్న తమ్ముడు ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ శ్రీరంగాచార్య గారు. వీరి ప్రాథమిక విద్యాభ్యాసం చందుపట్ల గ్రామంలో జరిగింది. తర్వాత సూర్యాపేటలో హైస్కూల్ విద్య పూర్తి చేసి ఉన్నత చదువులపై హైదరాబాద్ వెళ్లి నిజాం కళాశాలలోనూ ఉస్మానియా విశ్వవిద్యాయలంలోను ఉన్నత విద్యను అభ్యసించారు. ఆచార్యులవారు చిన్ననాటి నుండే చాలా చురుకైన వారు. తండ్రిగారి పాండిత్యం వీరికి అబ్బింది. ఎనిమిదో తరగతిలో ఉన్నప్పుడే కవిత్వంపై పట్టు సాధించి ప్రముఖుల మన్ననలను పొందారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎమ్.ఏ. సంస్కృతంలో ప్రథమ స్థానం పొంది కొంతకాలం సంస్కృత ఉపన్యాసకులుగా పనిచేస్తూ ఎం.ఏ ఇంగ్లీష్ పట్టా పొందారు. స్టైరన్ నవలల్లో అస్తిత్వవాదం అనే అంశంపై ఇంగ్లీష్‌లో పిహెచ్.డి చేశారు. తరువాత ఉస్మానియా యూనివర్సిటీ లో కొంతకాలం లెక్చరర్‌గా పని చేశారు. తర్వాత వరంగల్ పోస్ట్ గ్రాడ్యుయేట్ సెంటర్‌కు బదిలీ అయిన తర్వాత ప్రముఖ ప్రొఫెసర్‌గా గుర్తింపు పొందారు.

లక్షణమూర్తి గారు బహుభాషా కోవిదులు సంస్కృతాంధ్ర, ఆంగ్ల భాషలతో పాటు జర్మన్ భాషలలో నిష్ణాతులు. ఉర్దూ భాషలో కూడా వారికి ప్రవేశం ఉంది. కాకతీయ యూనివర్సిటీలో ఆంగ్ల శాఖాధిపతిగా, ఫ్యాకల్టీ ఆఫ్ డీన్‌గా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా, ఉన్నత పదవులను అంకితభావంతో పనిచేసి ఆ పదవులకే వన్నె తెచ్చారు. కొంతకాలం కాకతీయ జర్నల్ ఆఫ్ ఇంగ్లీష్ స్టడీస్‌కు ఎడిటర్‌గా వ్యవహరించారు. 1980లో అమెరికా యూనివర్సిటీలలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పని చేశారు. అమెరికాకు రెండు పర్యాయాలు ఫుల్ టైం స్కాలర్ (ఫెలోషిప్) గా అవకాశాలు అంది పుచ్చుకున్నారు. అమెరికాలోని డ్యూక్ యూనివర్సిటీ, మిసౌరీ విశ్వవిద్యాలయాన్ని సందర్శించి అద్భుతమైన ప్రసంగాలు చేసి అక్కడి విద్యార్థులని ముగ్ధులను చేసి ఎన్నో ప్రశంసలు పొంది దేశ గౌరవాన్ని అగ్రస్థాయిలో నిలిపారు. పాశ్చాత్య దేశాలలోని వారిని సైతం తన ప్రసంగాలతో ఆకట్టుకున్నారంటే వారి ప్రతిభా పాండిత్యాలు ఎలాంటివో మనం

తెలుసుకోవచ్చు. వారికి అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉన్నది.

వారి సహధర్మచారిణి డాక్టర్ జయశ్రీగారు రిటైర్డ్ డిగ్రీ కళాశాల లెక్చరర్, కుమారుడు శేషాద్రి గారు, కూతుళ్లు ప్రతిమ, ప్రతిభ. కుమారుడు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ అక్కడే స్థిరపడ్డారు ఉద్యోగ పర్వమంతా సుమారు మూడున్నర దశాబ్దాల పాటు కాకతీయ విశ్వవిద్యాలయంలో కొనసాగుతూ హనుమకొండలోని విద్యారణ్యపురిలో స్థిరనివాసం ఏర్పరచుకున్నారు.

**రచనలు :** స్టైరన్ నవలల్లో అస్తిత్వవాదం ఇంగ్లీషు పిహెచ్.డి సిద్ధాంత గ్రంథం. సారంగాచల రామ శతకం, దేహళి, గోపికా వల్లభ, సమర్పణం, భారత సాహిత్య నిర్మాతలు కావ్య కంఠ గణపతి శాస్త్రి, ది ఫ్యూచర్ పోయెట్రీ అనే అరవిందుని రచనకు అనువాదం, రవీంద్రనాథ్ ఠాగూర్ గీతాంజలి, ఉపనిషత్తులు, రేడియో ప్రసంగాలు వ్యాస సంపుటాలు.

దేహళి రచన డా.గన్నమరాజు గిరిజా మనోహర బాబు గారికి అంకితం ఇచ్చారు. 2013లో ప్రఖ్యాత తెలుగు కవి వానమామలై వరదాచార్యుల రచనలను ఆంగ్లంలోనికి అనువదించారు. భక్త పోతనపై వీరి రచనలను తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురించింది. శ్రీనివాస బాల భారతి గ్రంథమాలలో భాగంగా పిల్లల కోసం రూపొందించింది.

వేదాంత శాస్త్రాన్ని లోతుగా అధ్యయనం చేసి సంస్కృత సాహిత్యం పై అనేక ప్రసంగాలు చేశారు. రామాయణం, భగవద్గీత, ఉపనిషత్తు లపై తెలుగు రాష్ట్రాలలో సాధికారికంగా అనేక సభలలో పాల్గొనడం జరిగింది. వారు శ్రీవైష్ణవులు అయినప్పటికీ హరిహర తత్త్వంతో పరమశివునిపై కూడా కొన్ని పద్యాలు రచించారని వారి శిష్యులు బైరెడ్డి కృష్ణారెడ్డి గారు తెలియజేశారు.

**సత్కారాలు :** 1961లో నరసరావుపేటలో జరిగిన పొట్టి శ్రీరాములు స్మారక ఉపన్యాస పోటీలలో స్వర్ణ పథకాన్ని సాధించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉత్తమ ఆచార్యులుగా సత్కారం పొందారు. నల్లాన్ చక్రవర్తుల రఘునాథాచార్య స్వామితో స్వర్ణకంకణ సత్కారాన్ని పొందారు.

**ప్రముఖులతో పరిచయం:** జ్ఞానపీఠ అవార్డు గ్రహీత కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారి ఆత్మీయ శిష్యులు లక్ష్మణమూర్తి గారు. అప్పట్లో వైస్ ఛాన్సలర్‌గా ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ గారితో ఎంతో సాన్నిహిత్యంగా ఉండేవారట. జయశంకర్ సార్ ఏది రాసినా లక్ష్మణమూర్తి గారు అందుబాటులో ఉంటే పిలవండి వారికి ఒకసారి చూపిస్తాను. వారి భాషా ప్రామాణికమైనది అని అనేవారట. అంటే ఆచార్యులవారు ఎంత భాషా నైపుణ్యం కలవారో మనం అర్థం చేసుకోవచ్చు.

రవ్వా శ్రీహరిగారు లక్ష్మణమూర్తి గారు మంచి మిత్రులు. ఇద్దరూ కలిసి ఎం.ఏ., సంస్కృతం చేశారు. శ్రీహరి గారు కొంతకాలం గురుకులవాసం చేసినా వారు లక్ష్మణమూర్తి గారి సంస్కృత పాండిత్యం హద్దులు నాకు తెలియవు అని, ఎన్ని కావ్యాలు, నాటకాలు చదివారో, ఎన్ని శాస్త్రాలు అధ్యయనం చేసినారో చెప్పలేను. తెలుగులోనూ వారి పాండిత్యం నాకందనిదే ఎందుకంటే వారు బయటపడరు. సరస్వతి అంతర్వాహిని అని అనేవారట.

కాళోజీ నారాయణరావు, కాళోజీ రామేశ్వరరావు, కోవెల సుప్రసన్నాచార్య, వరవరరావు, అనుముల కృష్ణమూర్తి, అంపశయ్య నవీన్, బిరుదరాజు రామరాజుగార్ల వంటి సాహితీవేత్తలతో ఎంతో సాన్నిహిత్యం ఉండేది. సహృదయ సాహితీ సంస్థ సభ్యులతో ఆత్మీయంగా ఉంటూ అనేక సాహిత్య కార్యక్రమాలలో పాల్గొనేవారు.



**సులక్షణుడు :** చిరునవ్వు మోముతో ఎంతటి వారినైనా ఒప్పించడమే కానీ నొప్పించడం తెలియదు వారికి. మనుషుల మర్మాలను తెలిసిన మనోవైజ్ఞానికుడు. వారి మాటల్లో నిజాయితీ, సత్యము, ధర్మము, ప్రేమ తొణికిసలాడుతాయి. వారి ప్రసంగాలు కూడా ఆలోచనాత్మకంగా ప్రేరణాత్మకంగా ఉంటాయి. కోపతాపాలు వారి దరి చేరవు. విద్యార్థులే తన ఆస్తిగా భావించి విద్యార్థుల శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేసేవారు. సమాజంలో మంచి సంబంధాలు కలిగి ఉండాలని నిరంతరం చెప్పేవారట. వారి శిష్యులు తన స్థాయికి రావాలని ఆకాంక్షించేవారట. వివిధ విశ్వవిద్యాలయాల్లో వారి శిష్యులు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా ప్రొఫెసర్లుగా పనిచేస్తున్నారు.

**ధర్మపథం :** వారిది ఉన్నతమైన వ్యక్తిత్వం శ్రీవైష్ణవ సంప్రదాయం వైదిక ధర్మాసక్తి పండిత కుటుంబం నుండి వచ్చినవారు కావడంతో చాలా పద్ధతిగా ఉండేవారు. స్వామి వివేకానంద అంటే ఆయనకు అపారమైన భక్తి భావం తన శిష్యులందరికి వివేకానంద బోధనలు అనుసరించేలా నిరంతరం మార్గదర్శనం చేసేవారు. బలమే జీవము, బలహీనమ్మై మరణము. నీ జీవితానికి నీవే సృష్టికర్తవు. సర్వశక్తులు నీలోనే ఉన్నాయి. నీవు ఎలా అనుకుంటే అలా కాగలవు. లెండి! గమ్యం చేరేవరకు

విశ్రమించకండి. సాధనతో సర్వం సాధించవచ్చు. పరోపకారము అనే లక్షణం మానవుని గొప్పగా తీర్చిదిద్దుతుందని స్వామి వివేకానంద సూక్తులను ఉద్బోధించేవారు. రామాయణ, భారతాలను, ఉపనిషత్తులను, అధ్యయనం చేసి వాటి సారాన్ని ప్రసంగాల ద్వారా సమాజంలో మార్పు కోసం ధర్మస్థాపన కోసం నిరంతరం ప్రయత్నించేవారు. వ్యక్తిత్వంలో వారి అగ్రజులకు లక్ష్మణుడు అనుజులకు రాముడు.

శ్రీరంగాచార్య గారి పీఠికలు గ్రంథావిష్కరణ కార్యక్రమంలో నేను లక్ష్మణమూర్తి గారిని కలవడం జరిగింది. చాలా ఆప్యాయంగా నన్ను పలకరించారు. కొన్ని గ్రామ విషయాలు నాతో చర్చించారు. శ్రీరంగాచార్య గారు పీఠికలు గ్రంథాన్ని లక్ష్మణమూర్తిగారికి అంకితం చేసి వారి పాదాలకు నమస్కరించారు. ఆ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక విషయాలను గుర్తు చేసుకుంటూ తన బాల్య విషయాలు తాము ఏ విధంగా వృత్తిలోకి వచ్చిన విషయాలు తన సోదరులు చేస్తున్న సాహిత్య సేవను ప్రశంసిస్తూ కళ్ళలో నీళ్లు తిరిగి భావోద్వేగానికి గురయ్యారు. వారి ప్రసంగంలో ఎన్నో జీవన సత్యాలు, జీవిత పరమార్థాలు ఎన్నో ఉంటాయి. వారి ప్రసంగానికి సభలోని వారంతా ముగ్దులయ్యారు. వేదిక పైన డా.కె.వి రమణాచారి గారు, ఆచార్య వెల్దండ నిత్యానందరావు గారు, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి గారు, ఎల్లూరి శివారెడ్డి గారు, డా. గన్నమరాజు గిరిజా మనోహర బాబు గారు, ఆచార్య కమలాకర శర్మ గారు, నరసింహాచార్యులు గారు పాల్గొన్నారు.

**ఆలోకనం**

**(తెలంగాణ 31 జిల్లాల చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.

తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.

330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.

అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.

**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

చందుపట్ల గ్రామంలో ఇప్పటికీ వారి ఇల్లు ఉన్నది. వారి వదినగారు గోదాదేవి గారు అక్కడే ఉంటారు. మూడు సంవత్సరాల క్రితం లక్ష్మణమూర్తిగారు జయశ్రీ మేడం గారు రావడం జరిగింది. వారి ఇంట్లో కాసేపు ఉన్న తర్వాత వారి కులదైవం శ్రీ సీతా రామచంద్ర స్వామి దేవాలయాన్ని సందర్శించారు. అర్చకులు రఘునందనాచార్య గారు అర్చన చేశారు. వారు ఆ గుడిలో ఉన్నంతసేపు ఎంతో తరించి పోయారు. ఈస్వామి వాల్లనే మేము బ్రతికాము ఆయన ఆశీర్వచనంతోనే ఈ స్థాయికి చేరాము అని భావోద్వేగాన్ని గురైనారు. ఆ సమయంలో నేను వారితో ఉన్నాను. అక్కడ నుండి సారంగాచలం బండపాలెం గ్రామంలో శ్రీ సీతారామచంద్రస్వామి స్వయంభువు అక్కడ దర్శనం చేసుకుని వరంగల్‌కు వెళ్లారు. నేను ఒకసారి వారి వదిన గారిని తీసుకొని వరంగల్‌కు వెళ్ళినప్పుడు వారు ఎంతో ఆత్మీయంగా నాతో మాట్లాడారు. రకరకాల వంటలతో మంచి భోజనం పెట్టారు. బాగా కష్టపడి చదివి వృద్ధిలోకి రావాలని అంటూ నేను మా ఊరి గురించి రాసిన వ్యాసం గురించి గుర్తు చేస్తూ నన్ను ప్రశంసించారు. కొన్ని సందర్భాల్లో అప్పుడప్పుడు ఫోన్ చేసి మాట్లాడేవారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఆచార్యులు మా గ్రామానికి చెందినవారు కావడం మాకు ఎంతో గర్వకారణం. వారు లేరన్న విషయం తెలుసుకొని తీవ్ర దిగ్భ్రాంతికి గురైనారు, ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

బహుభాషలలో పాండిత్యం కలిగిన లక్ష్మణమూర్తి గారు ప్రచారం కోరుకొని వ్యక్తి. వారి రచనలపై ఎక్కడ వారి ఫోటో గానీ వారి వివరాలు కానీ ఉండవు. లోపల ఎక్కడో చిన్న పేరు కనిపిస్తుంది. కొన్ని కవితలు మాత్రమే రాసి ఉద్దండ పండితులమని చెప్పుకునే ఈ రోజుల్లో వారు ఇంత ప్రతిభ ఉండి కూడా ప్రచారానికి దూరంగా ఉండడం వారి ఉన్నత వ్యక్తిత్వానికి నిదర్శనం. వారు ఎక్కడ ఉన్నా ఉన్నత స్థాయిలో ఉండడం వారి ప్రతిభా పాండిత్యాలకు నిదర్శనం. ఇలాంటి పండితులు మన ప్రాంతం వారు కావడం ఎంతో గర్వ కారణం. కానీ వారి రచనలపై జరగాల్సిన పరిశోధన జరగలేదు. ఇంకా ఎన్నో అముద్రితాలు వెలుగు చూడాల్సిన అవసరం ఉన్నది. సహృదయ సాహితీ సంస్థ పెద్దలు వారి రచనలను ప్రచురించి పాఠకులకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. వీరి రచనలపై సదస్సులు సైతం జరగాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. వీరి ప్రతిభకు ఇప్పటికే పద్మశ్రీ లాంటి పురస్కారాలు రావాల్సి ఉండే. ఏది ఏమైనా ఒక సాహిత్య శిఖరాన్ని కోల్పోవడం సాహితీ లోకానికి తీరనిలోటు. సాహితీలోకంలో వారి కీర్తి చిరస్థాయిగా నిలుస్తుంది.

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5 (15) హైదరాబాద్ ఏప్రిల్ : 2025

# ప్రభాకరుల ప్రజ్ఞ : అక్షర లోచనం

**విశ్వర్షి వాసిలి వసంత కుమార్,** యోగాలయ, సికింద్రాబాద్. ఫోన్ : 939393 3946

(ఫిబ్రవరి 7 మానవతామూర్తి, సారస్వతమూర్తి, యోగమూర్తి అయిన వేటూరి ప్రభాకరశాస్త్రి గారి 137 వ జయంతి. హైదరాబాద్ లోని ఈశ్వరమ్మ హాల్ లో వేటూరి కుటుంబసభ్యులు, యోగమిత్రులు, సాహితీవేత్తలు నాడు మాస్టర్ యోగ సమావేశాలను, సారస్వత ఉపన్యాస లహరిని జరిపారు. ఉపన్యాస పరంపరలో సాహితీమూర్తులైన డా. ఏల్చూరి మురళీధర రావు, డా. వాసిలి వసంతకుమార్ ప్రసంగించారు. ఆచార్య వేటూరి ఆనందమూర్తి గారి నేతృత్వంలో ఈ జయంతి ఉత్సవం జరిగింది. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వేదవిశ్వవిద్యాలయం సభా ప్రాంగణంలో కులపతి ఆచార్య రాణి సదాశివమూర్తిగారి అధ్యక్షతన వేటూరి ప్రభాకర శాస్త్రి రచించిన “తెలుగు సాహిత్య జ్ఞానసంపద”, “ప్రాచీన తెలుగు సాహిత్య సౌరభం” అనే రెండు వ్యాస సంపుటాలను ఆవిష్కరించింది.

సరిగ్గా ముప్పై ఏడేళ్ల క్రితం అంటే ఫిబ్రవరి 1988లో భాగ్యనగరం శ్రీ త్యాగరాజ గాన సభ వేదికగా రెండు రోజులపాటు జరిగిన శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రి శతజయంత్యుత్సవ సంబరాలు కళ్ల ముందు తిరుగాడుతున్నాయి. నాటి ప్రధానమంత్రి పి.వి. నరసింహారావు, ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు, మాజీ సాంస్కృతిక శాఖామంత్రి శ్రీ భాట్టం శ్రీరామమూర్తి, సాహితీ ప్రముఖులు శ్రీ దేవులపల్లి రామానుజ రావు, విశ్వవిద్యాలయ కులపతులు ఆచార్య తూమాటి దొణప్ప, ఆచార్య సి.నారాయణ రెడ్డి, లోకాయుక్త ఆవుల సాంబశివరావు, ఆంధ్రప్రభ సంపాదకులు పొత్తూరి వెంకటేశ్వర రావు, శ్రీ కొత్త రామకోటయ్య, శ్రీ శార్వరి వంటి మరికొందరు మాస్టర్ యోగమూర్తులు మదిలో మెదలుతున్నారు. ఈ జయంత్యుత్సవ కమిటీకి నా పరిశోధక గురువుగారు ఆచార్య వేటూరి ఆనందమూర్తి గారు ప్రధాన కార్యదర్శి అయితే నేను సంయుక్త కార్యదర్శిని కావటం ప్రభాకరుల దివ్యాశీస్సుల ఫలితమే. ఈ సంబరాలు జరిగి 37 సంవత్సరాలు అవుతున్నా నాటి దృశ్యాలు ఎప్పటికీ నవనవోన్మేషాలే.

137 ఏళ్ల క్రితం భౌతికానికి వచ్చి 74 ఏళ్ల క్రితం అభౌతికమైన గురుమూర్తి ప్రభాకరుల యౌగిక ప్రజ్ఞ నాకెంతో ఇష్టమైన కోణం.

**‘మనసు శుచిగా ఉంటే తలపులూ శుచిగానే ఉంటాయి’** అని స్వానుభవంతో జీర్ణం చేసుకుని, సదా వ్యక్తిమత్వంతో మాస్టర్ సి.వి.వి. గారి ప్రత్యక్ష శిష్యులుగా ప్రకాశించిన యోగిపుంగవులు వేటూరి ప్రభాకర శాస్త్రి గారు.







స్వ-పర దృష్టి లేకుండా అందరినీ ప్రేమతో, దయతో ఆదరించటం ప్రభాకరుల యౌగిక తత్వం. ఆర్ద్రతతో, సానుభూతితో ఆదుకోవటం వేటూరివారి చికిత్సా తత్వం.

ఆర్ద్రత, సానుభూతి అన్న వెంటనే 24 సెప్టెంబర్ 1924వ తేదీన మహాత్మా గాంధీ ఉపవాసముండగా ప్రభాకరులు కలం సిరా అయి –

**“పాపము శాంతమయ్యెడను పాపము గాంధిమహాత్ము డట్లుకు**
**ట్టూపిరివాడు పస్తుపడి యుండగ దుండగముల్ పొనర్చుదు**
**ష్కోపులయేపు చెల్లెడునొకో, పరమాత్ముడు లేడొకో జగం**
**బాపదలందికుంది యడగారుట కాతడు కాతరిల్లడో”**

అక్షరమై కరిగి కన్నీరు పెడతారు.

అందుకే కాబోలు ఆంధ్రప్రభ సంపాదకులు నార్లవారు 31 ఆగస్టు 1950 నాటి దినపత్రిక సంపాదకీయాన్ని ‘ఆర్ద్రహృదయుడు’గా మలుస్తూ **“అందరినీ ఉడుకెత్తించి వెయ్యగల ఏ కొద్ది సన్నివేశాలలోనో కాక, శాస్త్రిగారు ఈ స్నిగ్ధ హృదయాన్నే – ఈ ఆర్ద్రహృదయాన్నే – అనుదిన జీవితంలో, నిత్యా వ్యవహారంలో ప్రదర్శించేవారు. ఆయన ప్రతి పలుకు నిజానికి తేనె లొలుకుతుండేది. ‘నాయనా!’ ‘బాబూ!’ తప్ప మరొక సంబోధన ఆయనకు తెలిసేది కాదు.”** వేటూరివారి ఆర్ద్రత లోనిది తప్ప ఇహానిది కాదు.

**‘యోగా టీచ్ – ప్రాణా ట్రీట్’** అన్న మాస్టర్ సి.వి.వి.గారి యోగ తత్వానికి నిండైన నిగ్రహం, మెండైన విగ్రహం ప్రజ్ఞా ప్రభాకరులు.

**“వేటూరివారి వ్యాఖ్యలును పీఠికలున్ దెనుగుం బొలంతికిన్ బేటులురేగు గందవొడి వెట్టినపూతలు”** అని తొలి తెలుగు జ్ఞానపీఠ

కవి విశ్వనాథ సత్యనారాయణగారిచే వేటూరి సారస్వత వరివస్యకు పట్టంకట్టబడిన పరిశోధక వతంసులు ప్రభాకరశాస్త్రి.

**"బసవపురాణ ప్రబంధంబు పుణ్య మెం**
**తదియొ మీచేతి సొం పొదవి కొనియె**
**క్రీడాభిరామంబు వేడుక యెంతదో**
**మించు పీఠికను వ్రాయించు కొనియె**
**సోమన గ్రంథ మే నోము నోచెనొ వ్యాఖ్య**
**వెలయించుకొనియె సంప్రీతి యెసఁగఁ**
**మల్లనగణితంబు మహిమ యేలాటిదో**
**సమకూర్చుకొనె నొక్క సాధురూప**
**మాంధ్రపత్రిక, భారతి, యాంధ్ర వార**
**పత్రిక, కృష్ణ మొదలగు పత్రిక లవి**
**యేమి నోములు నోచెనో యెఱుగ మేము**
**నీదు రచనల జీవాలు నించుకొనియె!"**

అని మధురై కామరాజ్ విశ్వవిద్యాలయ ఆచార్యులు తిమ్మావఝ్ఝల కోదండరామయ్య గారి చేత ప్రస్తుతింపబడిన పరిశోధక పరమేశ్వరులు ప్రభాకరశాస్త్రి. పిండితార్థంలో – ఉత్పల సత్యనారాయణాచార్య వారి మాటలలో – **"పరమగురుడు వేటూరి ప్రభాకరుండు ఆంధ్ర సాహిత్య జగతి మహాతపస్వి".**

**"వర్తింతున్ మత దేశ జాతి కృతముల్ వైవిధ్యముల్ వీడి,**
**నిర్వర్తింతున్ బరిచర్య నార్తులకు యావత్ప్రజ్ఞ నర్పించి,**
**యావర్తింతున్ గురుదేవ సూక్తములు భావస్ఫూర్తి నట్లయ్యు"**

అని తమకు తాముగా ప్రతిన బూని, జీవితాంతం అట్లే చరించిన గురుమూర్తి మన యోగ ప్రభాకరులు.

**"లావు గాక పొట్టి గాక, సన్నమూ గాక మరీ పొడుగు గాక నిమ్మపంటి ఛాయతో అరుణోదయ కాంతులు కదల్కొల్పుచున్న శ్రీవారిని జూడగానే నా యొడలు పులకరించెను. కేలుదోయి మోడ్చి నమస్కరించిం"**ది మనలో నిత్యం యోగచైతన్యాన్ని నింపుతున్న మాస్టర్ సి.వి.వి. గారి ప్రత్యక్ష రూపానికి.

పాతికేళ్ల ప్రాయంలో తీవ్ర అనారోగ్యంతో మాస్టర్ గారి యోగ ప్రాంగణాన్ని చేరుకొని, వారి ఇనీషియేషన్, ట్రీట్మెంట్‌లతో ఆరోగ్యం పుంజుకొని, జీవితాంతం మాస్టర్ యోగసాధనతో తమకు తాము సంపూర్ణ ప్రజ్ఞాన్వితులు కావటం, వందల వేల ఆర్తులకు యోగచికిత్స చేసి స్వస్థుల్ని కావించటం, మరికొన్ని వందలమందికి యోగోపదేశం చేయటం మన అందరికీ తెలిసిన ప్రజ్ఞా ప్రభాకరీయం.

**"శరీరమనే పుస్తకాన్ని చదివే తీరును నేను మాస్టర్ గారి నుండే ఉపదేశం పొందాను. అంతర్ముఖులమై ఈ శరీర పుస్తకాన్ని అధ్యయనం చేస్తే మన ప్రజ్ఞ ఒకచోటను కూడుకొంటుంది."** అని ప్రభాకర శాస్త్రిగారు ఒకానొక సందర్భంలో సెలవిచ్చింది అక్షరసత్యమని నా స్వానుభవం ద్వారా చెప్పగలను. 1916 లో అంటే 108 ఏళ్ల యోగిక ప్రజ్ఞ వారిది.

యోగికత్వ ప్రజ్ఞకు భౌతికం, అభౌతికం అంటూ ఉండదు. అది నిత్యం, నిర్మలం, నిర్వికారం. ఆ ప్రజ్ఞ అరూపమే కాదు అమానసికం అంటే మానసాతీతం, దేహాతీతం కూడా. సామాన్యంగా మన యోగానుభవాన్ని మనసుతో అనుభూతించి దేహపరంగా అనుభవంగా చెప్పుకుంటుంటాం. నిజానికి ఆ ప్రజ్ఞ ఆత్మ సంబంధి. ఆత్మ దేహంలోనిది అనుకుంటాం కానీ అది దేహంలో ఎక్కడ ఉంటుందో తెలీదు. అలాగే అనుభవం కూడా దేహానిదే అని అనిపిస్తుంటుంది కానీ ఆ అనుభవం దేహంలోని ఏ స్థితిదో తెలీదు. కాబట్టి, వ్యక్తీకరణకు అందనిది యోగ ప్రజ్ఞ.

ఇటువంటి యోగ ప్రజ్ఞను గురించి మనం ఎంతలా చెప్పుకున్నా, ఎంతలా పుస్తకాలకు ఎక్కించినా ప్రజ్ఞావిష్కరణకు పూర్తిగా లొంగనటువంటిదే. అయినా ఈ మిడి మిడి ఆవిష్కరణలకు మనం అహంకారులం అవుతుంటాం, మిడిసి పడుతుంటాం, అసూయ చెందుతుంటాం. కానీ ఇటువంటివాటికి ఎక్కడా అవకాశమివ్వకుండా మాట్లాడటం, ప్రసంగించటం వేటూరి ప్రభాకరశాస్త్రి గారి ప్రజ్ఞ.

ప్రభాకరశాస్త్రి గారు మాస్టర్ యోగసాధన ముగిసిన తర్వాత తోటి సాధకులతో యోగ విషయాలను ప్రస్తావిస్తుండేవారు. ఈ సీన్ సూత మహర్షి శౌనకాది మునులకు పురాణాలను చెప్పిన సీన్‌ను తలపింపచేస్తుంటుంది. దీన్నే తాతగారుగా ప్రఖ్యాతమైన కొత్త రామకోటయ్యగారు – ప్రభాకరశాస్త్రి గారు మాట్లాడుతుంటే – మీడియమ్స్ స్థితి గ్రీష్మ ఋతువులో ఎండిన పూలతోటపైన వానజల్లు పడినట్లుగా ఉండేదంటారు. అలాగే ఆలకిస్తున్న సాధకులను చూస్తుంటే ఎంతో ఆప్యాయంగా తలలు వంచి తూగుతుండే పూలమొక్కలు జ్ఞాపకానికి వస్తుంటాయి అంటారు. అలా చూపును మరల్చకుండా, ఆలోచనలను పక్కదారి పట్టనీకుండా ఏకాగ్రచిత్తంతో వినేలా చేయటం ప్రభాకరుల యోగికప్రజ్ఞ. అసలు, వారు చమత్కరించినా, ఛలోక్తులు విసిరినా, వర్ణించినా – ఇలా ఎలా మాట్లాడినా వారి మాటలలో అంతర్లీనంగా దివ్యబోధ ఉండేదంటారు తాతగారు.

**"తలంటి నీళ్లు పోసిన పిదప ఆ చిరాకు వల్ల ఏడ్చే బిడ్డను తల్లి ఒడిలో పరుండ బెట్టుకొని పాలిస్తూ, జోలపాట పాడుతూ, తల చిక్కు దువ్వుతూంటే పిల్ల ఎంతో హాయిగా కళ్లు మూస్తుంది. అట్టి స్థితి గుర్తుకొచ్చేది ఆ స్థితి"** అని అంటారు ఆ సీన్ ను కళ్ల ముందుకు తెచ్చుకున్న తాతగారు.

అసలు, వేటూరివారి యౌగిక అతర్వీక్షణం అసామాన్యం. ఆ అంతర్వీక్షణ ప్రభాకరుల పదాలలో వర్ణనలా అనిపిస్తుంది కానీ నిజానికి ఆ వర్ణన వెలార్చే సౌందర్యం సాధనకు అందేది మాత్రమే. చూడండి –

**"ఆకుచిల్కలు తెక్కలల్లార్చి యాడుచో**
**బువ్వుల్ గుభాళించి నవ్వుచోట**
**పక్షులతో వృక్షపటలి వెల్విరియుచో**
**జంపతుల్ వాహ్యాళి సల్పుచోట**
**జలజల సెలయేళ్ళ జాల్వారి దొరలుచో**
**నదులు సంద్రములతో గదియుచోట**
**ఏకాగ్రవృత్తి యోగీశ్వరుల్ వెలయుచో**
**నద్రి శృంగములు మిన్నందుచోట**
**పుడమికి గుదారుగా మిన్ను పొలుచు చోట**
**నాకసము భూమి యంటిసల లాడుచోట**
**నీ మహత్వంబు దిలకించి నామనస్సు**
**చూచు లోలోని కెచ్చటో చొక్కుదక్కు"**

ఈ పద్యంలోని వర్ణనలు ప్రభాకరుల సాధనా దర్శనాలు తప్ప భావ వీచికలు కావు.

మానసిక చంచలత్వం లేని యోగీశ్వరులు తపస్సు చేసుకునే పర్వతాలు మరింత ఉన్నతంగా అగుపిస్తాయన్న ధ్వని ఈ పద్యపాదంలో ఉంది. అంటే యోగసాధన ఫలితాలు ప్రకృతిపై ప్రభావం చూపుతాయన్నమాట. అలాగే, నదులు సముద్రాలు కలిసే స్థితులలో, ఆకాశం భూమి కలిసే స్థితులలో ప్రభాకరులు మహత్వాన్ని అందుకోగలిగారు. ఈ కలియటం అనే ప్రక్రియ మన మాస్టర్ యోగ పరంగా మెరిడియన్ వర్కింగ్. దీనికి కావలసింది సాధనా పరమైన **'బోరింగ్'**. దీన్నే ప్రభాకరులు **'లోలోని కెచ్చటో చొక్కు దక్కు'** అంటారు.

ప్రభాకరుల మాటతీరు లయాన్వితంగా, సుస్వరభరితంగా ఉండేది అని స్పష్టమవుతుంది తాతగారు ప్రస్తావించిన కొన్ని సందర్భాలను పరికిస్తుంటే. శిశువులైనా, పశువులైనా సంగీతాన్ని ఆస్వాదిస్తాయన్నట్టుగా తరతమ భేదం లేకుండా ప్రతిఒక్కరూ ప్రభాకరుల ప్రసంగాలను, సంభాషణలను చెవులప్పగించి మరీ ఆనందించేవారట. ప్రభాకరుల ముందు కూర్చుని తదేక్ష దృష్టితో వింటున్న మీడియమ్స్ ను చూస్తుంటే ఎండిన పూలతోటపైన వానజల్లు పడుతూ ఉంటే తలలువంచి తూగే పూలమొక్కలు జ్ఞప్తికొస్తాయి అన్నది తాతగారి మాట. వరిపొలాలను, నిమ్మతోటలను, కొబ్బరితోపులను వేటూరివారు వర్ణిస్తుంటే తాతగారికి తమ గ్రామాలలో తిరుగాడు తున్నట్టు ఉండేదట. కృష్ణా, గోదావరీ నదుల ప్రవాహ తీరును వర్ణిస్తుంటే ఆ నదీమతల్లుల చల్లదనం వింటున్నవారిని మరింత చల్లగా తాకేదట. ఇదొక ప్రసంగ తీరు అయితే, వారి ఛలోక్తులు కొరడా దెబ్బలను తలపించేవట. కొన్ని సంభాషణలు దివ్యబోధలుగా తలకెక్కేవి.

మాస్టర్ యోగ సాధనా పరంగా **"...ఇదంతా మాస్టరుగారి అనుగ్రహం. ఏమయినా నాలో ఉచ్ఛ్వాస నిశ్వాసలుంటే అది అంతా మాస్టరుదే"** అన్న నిరహంకార అంకితతత్త్వం వేటూరివారిది. తాము చేసే యోగచికిత్సల గురించి **"ఈ నిర్వాకమంతా మనది కాదు... మాస్టరుది"** అని నిక్కచ్చిగా చెబుతుండేవారు. అసలు, ప్రభాకర శాస్త్రి గారికి మాస్టర్ గారు ఇనీషియేషన్ ఇచ్చింది జులై 22, 1916 న. అంటే ఇప్పటికి 108 ఏళ్ల క్రితం అన్నమాట. నాటినుండి వారు సాహిత్యజిజ్ఞాస పైకంటే బ్రహ్మజిజ్ఞాసపైననే మరింతగా మరలారు. పాండిత్య అభినివేశం, కవన కుతూహలం, ధన సంపాదన అనే ఐహిక ఆర్తుల నుండి మనసు మరలింది వారికి. **'వెసమోము మొత్తిం'**దని, **'నాచే జెల్లవీ కల్లబొల్లి వినోదంబులు'** అనీ, జరా మరణాలకు ఇవే హేతువులనీ అంటూ – ఈ చీడలను హతమార్చి పుట్టువు చెట్టున్ సఫలీకరించుకొని, తోటమాలినై అంటు కడతానంటారు. ఒకవిధంగా ఇది వారి చికిత్సా విధాన తత్వమే అని చెప్పుకోవచ్చు. మాస్టర్ తత్వం తమలో సంపూర్ణంగా నెలకొని ఉంది అని, కాబట్టి ప్రతి ఆరోగ్య, మానసిక సమస్యకు రిలీఫ్ సాధ్యమవుతుంది అన్న సంపూర్ణ విశ్వాసం వేటూరివారిది. **'దేనినయినా నమ్ముకుంటే దానిలోని సత్యాన్ని గుర్తించే వరకు గండుచీమ పట్టుకున్నట్లుగా దానినే ఆరాధించాలి'** అనే పట్టు ప్రభాకరుల వారిది. అందుకే **"క్షణ క్షణము సత్యజ్ఞాన సంతోష సంపత్సంగతి"** లో మునకలవుతూ **"అణువణువున నాలో నైక్యముం జెందు తండ్రీ"** అంటూ మాస్టర్ గారి యోగచైతన్యంతో నిత్యం ఉంటుండేవారు.

**"నేను అధికుడను అనేవాడు తన్ను తానే దిద్దుకోలేడు, ఇక – ఇతరులను ఏం చక్కదిద్దుతాడు?"** అన్నది ప్రభాకర శాస్త్రిగారు ఒంటబట్టించుకున్న యోగజీవన తత్త్వం. ఈ తత్త్వం నెలకొనాలంటే – మన చుట్టూ ఉన్నవారిని ప్రేమించటం, వారి ప్రేమను పుచ్చుకోగలగటం సాధ్యం కావాలన్నది వారి సాధనా సిద్ధాంతం. అసలు మనం ఒకరిని ప్రేమించలేకపోతున్నామంటే – మనలో నేను అధికుడను అనే దురహంకారం పేరుకుని ఉండటం వల్ల – ఆ వ్యక్తిలో కంటే మనమే ఆ తక్కువతనంతో, అల్పత్వంతో సంకుచితమై పోతున్నాం – అని అనేవారు.

ఒక సందర్భంలో ఒక వ్యక్తికి యోగ చికిత్స చేయగా – ఆ వ్యక్తి వేటూరివారికి నమస్కరించగా – ప్రభాకరుల అప్పటి నాలుగు మాటలు మనం ఇక్కడ గమనించదగ్గవి –

**"కృతజ్ఞతగా నమస్కరిస్తానంటున్నావు. సంతోషం. అసలు నీకు ఉపకారం చేయగల శక్తి నాకెక్కడ నుండి వచ్చింది? నాలో ఏదో ఒక అసాధారణమైన శక్తి పనిచేయుచున్నదనియే కదా? అట్టి అసాధారణమయిన యోగ్యతని మినహాయిస్తే నీవూ, నేనూ, చుట్టూ ఉన్నవారు ఒకటే కదా? అందువల్ల ఇక్కడ ఉన్నా మనం కానిదేదో ఒక దివ్యశక్తి ఉంది. అదియే నీకు ఉపకారం చేసింది. అంతేకాని నేను కాదు. నేను ఆ శక్తి వాహకుడను మాత్రమే."**

సాధారణంగా, యోగ చికిత్సలు చేసేవారిలో ఒకవిధమైన మిడిసిపాటును మనం చూస్తుంటాం. కానీ, ప్రభాకరుల వంటి గురుమూర్తులలో ఆ మిడిసిపాటు కనిపించదు. నిజానికి అది వారి ఆత్మవిశ్వాసం. ఇంకా చెప్పుకోవాలంటే అది వారి ధిషణ. యోగ చికిత్స చేసేవారిలో ఈ ధిషణ ఉండాల్సిందే. అది అహంకారంగా పరిగణించకూడదు.

అందుకే ఒక పద్యంలో వారంటారు – అంతరంగం అనే అరణ్య అంధకారంలోకి అంతర్యామిని అన్వేషిస్తూ దాసోహం అంటూ చొచ్చుకుపోయాను. అప్పుడు చిరు వెలుగు నాలో భాసిల్లింది. ఆ అగ్నిలో నేను సోహం అయి నిలిచాను. ఇక అక్కడ నాతనం అనేది ఏదీ లేకుండా పోయింది. ఇక్కడ చొచ్చుకుపోవటమే మాస్టారుగారి పరిభాషలో బోరింగ్ స్థితి. నాతనం లేకపోవటమే నిల్ స్థితి. అంటే, నిత్యసాధనతో మనల్ని మనం బోర్ చేసుకుంటూ శూన్యస్థితిని చేరుకోవటం యోగసాధకులుగా మన కర్తవ్యం.

కానీ ఈ ప్రజ్ఞలో, పోనీ ఈ స్థితిలో మనం ఇరవైనాలుగు గంటలూ ఉండలేకపోతున్నాం అన్న అవగాహన ప్రజ్ఞామూర్తులైన ప్రభాకరులకు ఎప్పుడూ ఉండేది. అందుకే – **"సృష్టిలో ఇంతవరకెవరూ ఈశ్వరతత్త్వాన్ని ప్రత్యక్షంగా చూచి ఎరుగరు. ఏదో యోగసమాధిలో ఎవరో కొందరు మహర్షులు చూచి యుందురేమో? అయినా ఆ సమాధి నుండి వెలువడి మామూలు ప్రజ్ఞ లోనికి రాగానే ఆ ఈశ్వరానుభూతి కంటిన్యూ కావడం లేదు కదా! అందువల్ల ఆ అనుభూతి సత్యమూ కావొచ్చు, లేక భ్రాంతీ కావొచ్చు."** అంటూ అసలు ఆ దివ్యానుభూతి, ఆ ప్రజ్ఞ స్థిరంగా నెలకొని ఉన్నట్లయితే ప్రేమమయులం, ఆనందమయులం, జ్ఞానస్వరూపులం అయ్యేవాళ్లం అని మన ప్రాపంచిక వ్యవహారసరళిని స్పష్టపరుస్తారు.

కాబట్టి ఈ ప్రాపంచిక జీవనంలో, ఈ శరీరంలో ఈ ప్రజ్ఞ పనిచేస్తుండగానే ఆ ఈశ్వరానుభూతిని పొందగలగాలంటారు. అలా పొందటానికే మనం రెండుపూటలా చేస్తున్న మాస్టర్ ప్రేయర్. మాస్టర్ యోగసాధనతో మన ప్రతి అనుభవం మనల్ని ఆ ప్రజ్ఞ సామీప్యానికి తీసుకుపోతుందనేవారు వారు. అయితే ఇలా సాధనాసమయంలో మన లోలోతులకి బోర్ చేసుకుంటూ పోతుండటం వల్ల మన కణ వ్యవస్థలో అనేక డిస్టర్బన్సెస్ చోటుచేసుకుంటాయి. మన ప్రజ్ఞ అంతర్ముఖమై ఇంకా ఇంకా సూక్ష్మంగా డీప్‌గా బోర్ అవుతున్నకొద్దీ మనలోని కల్మషాలు, కశ్మలాలు బయటపడుతుంటాయి అనేవారు వారు. నిరంతర సాధన వల్లనే ఈ విజృంభణ తగ్గి, ఎంకరేజ్మెంట్ చోటు చేసుకుంటుందనేవారు. లోలోతులకు పోతున్నకొద్దీ ఈర్ష్య అసూయలు మనలో పొడచూపుతూనే ఉంటాయి. వాటివల్ల మనం జారిపోయే ప్రమాదం ఉంది. అయినా, ప్రేమ అనేదాన్ని పట్టుకొమ్మను చేసుకుని సాధనామగ్నమయితే చాలు – బోరింగ్ ఫలితంగా మనం ఆ దివ్య యోగశక్తిని అందుకోగలుగుతాము అన్నది ప్రభాకరుల అచంచల విశ్వాసం.

వేటూరి ప్రభాకర శాస్త్రి యోగ తత్త్వమంతా **'ఓషన్ ఆఫ్ లవ్'** నుండి రూపుదిద్దుకున్నదే! సంధ్యావందనాదులు, భగవద్గీత – ఇత్యాదులకు అందిన మెట్టుకు – పై మెట్టుపై నుండి మన యోగం ఆరంభమైంది అన్నది ప్రభాకరుల ఉవాచ. మాస్టర్ గారిచ్చిన కోర్సులలో LEVEL అనే పదానికి ప్రభాకరుల నిర్వచనం – అంతా లెవెల్ అయినప్పుడు ప్రాక్పశ్చిమములు, ఆద్యంతములు, ప్రకృతి పురుషులు, ఆధ్యాత్మిక భౌతికములు ఐక్యం పొందగలవు అన్నది వేటూరి వారి ఆశంస. **"హెచ్చు తగ్గులు తొలగి పోవును / చచ్చు బుద్ధులు తొలగి పోవును / పెచ్చు పెరుగును జ్ఞాన సత్య / ప్రేమ సుఖము లిలన్"** అన్నది వారి ఎదురుచూపు.

**కొన్ని ప్రజ్ఞాప్రభాకరీయాలు**

* మనం సృష్టి – స్థితి – లయ అనే మూడు డైమెన్షన్స్ గురించి చెప్పుకుంటుంటాం. మాస్టర్ గారు సాధించ తలపెట్టిన 'ఎటర్నిటీ' అనేది ఫోర్త్ డైమెన్షన్ వర్క్ అనీ, ఎటర్నిటీ వర్కవుట్ అయిన తర్వాత లయ ఉండదనేవారు.

* ఇడ, పింగళ నాడుల గురించి మనకు కొంత అవగాహన ఉంది. ఈ మానవ జన్మలో ఇడ వర్కింగ్ సంపూర్ణంగా సాగుతోంది. అయితే పింగళ వర్కింగ్ సంపూర్ణంగా జరగటానికి యోగసాధన ఒక్కటే మార్గం. యోగ సాధన ద్వారా పింగళ వర్కింగ్ కూడా సాధ్యమయి ఇడ, పింగళ వర్కింగ్స్ సంయోగిస్తే తప్ప డెత్ అనే స్థితిని దాటలేము. ఆ డెత్‌ను దాటటమే ఎటర్నిటీ.

* స్థూల దృష్టికి స్త్రీ పురుషులు వేరు వేరుగా కనిపిస్తున్నప్పటికీ, వారి ప్రాపంచిక జీవన విధానం వేరువేరుగా ఉన్నప్పటికీ, యోగసాధన పరంగా వీరి వర్కింగ్ ఒకే బాటన సాగాలి. అందుకే మాస్టర్ గారు భార్యాభర్తలిద్దరూ కలిసి యోగసాధన చేయాలని చెప్పారు. ఇద్దరూ కలిసి సాధన చేయటం వల్లనే రియలైజేషన్ సాధ్యపడుతుంది అని అంటూ – రియలైజేషన్ కు 'సెంటర్' తప్పనిసరి అనీ, ఆ సెంటర్ చుట్టూ 'సర్కంఫెరెన్సు' ఉండాలనీ – కాబట్టి సాధనద్వారా తొలుతగా 'సెంటర్' ఏర్పడి, తదుపరి 'సర్కంఫెరెన్సు' ఏర్పడాలని సెలవిచ్చారు.

* భుక్త రహిత తారక రాజయోగం అనేది 'క్రియేటివ్ క్వాలిటీ'గా మాత్రమే పనిచేస్తుంది తప్ప 'డెస్ట్రక్టివ్ క్వాలిటీ'కి ఏమాత్రం అవకాశం ఇవ్వదు అంటారు ప్రభాకరులు.

* మనలోని ప్రజ్ఞ పరిపూర్ణమయ్యేంతవరకు సృష్టి రహస్యాలు మన ఎరుకలోకి రావు. కొంతవరకు సృష్టి పరమార్థం జన్మ సంస్కారాన్నిబట్టి, అర్హతనుబట్టి, డివైన్ గ్రేస్‌ను బట్టి తెలుస్తుంటుంది. కాబట్టి సృష్టి రహస్యాలు ఆవిష్కరింపబడాలంటే యోగసాధనతో ప్రజ్ఞ పరిపూర్ణం కావటమే తప్ప మరో మార్గం లేదు.

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5 (19) హైదరాబాద్ ఏప్రిల్ : 2025

# తెలుగులో అనువాద సంప్రదాయం

**డా. బాణాల భుజంగ రెడ్డి,** అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, హైదరాబాద్ విశ్వవిద్యాలయం. ఫోన్ : 9493976813

సుమారు వెయ్యి సంవత్సరాల నుంచి ఇతర భాషా గ్రంథాలను అనేకమంది కవులూ, రచయితలూ తెలుగులోకి అనువదిస్తున్నారు. ప్రాచీనకాలంలో సంస్కృత, ప్రాకృత గ్రంథాలూ, ఆధునికయుగంలో అనేక ఇంగ్లీషు, హిందీతోపాటు ఇతర భారతీయ భాషా గ్రంథాలు తెలుగులోకి అనువదించబడుతున్నాయి. మరి అనువాద సిద్ధాంతాలనుగానీ, పద్ధతులనుగానీ, సూత్రాలనుగానీ తెలుగు అనువాదకులు ఏమైనా తెలిపారా? తెలుగు అనువాదకులు ఎలాంటి అనువాద పద్ధతులను అనుసరించారు? అనే ప్రశ్నలకు జవాబులు వెతకడమే ఈ వ్యాసం లక్ష్యం. తెలుగులోకి అనువదించబడిన అన్ని గ్రంథాలనూ పరిశీలించి ఆ యా గ్రంథాల అనువాదకులు తమ అనువాద విధానాలను గురించి ఏమైనా తెలిపారా? అనే విషయాన్ని తేల్చాల్సివుంది. అయితే ఈ చిన్న వ్యాసంలో వందలకొద్దీ అనువాద గ్రంథాలను పరిశీలించడం సాధ్యంకాదు. అందువల్ల ప్రస్తుత వ్యాసాన్ని ప్రాచీన సాహిత్యానికి పరిమితం చేసుకోవడం జరిగింది. ప్రాచీన కవులు అనుసరించిన భాషాంతరీకరణ పద్ధతులను తెలుసుకునే ముందు, అసలు 'భాషాంతరీకరణ' అనే భావనను వారు ఏవిధంగా వ్యక్తం చేశారో తెలుసుకుందాం.

ప్రాచీన కవులెవరూ 'అనువాదం' అనే మాటను translation అనే అర్థంలో వాడలేదు. అనువాదం అనే మాటకు ఆ రోజుల్లో 'భాషాంతరీకరణం', లేదా 'తర్జుమా' అనే అర్థం లేదు. పూర్వకాలంలో 'గురువు ఉచ్చరించిన మాటలను అనుసరించి శిష్యులు పునః ఉచ్చరించటం' అనే అర్థమున్న అనువాదం అనే మాటను ఆధునికులు translation / భాషాంతరీకరణం / తర్జుమా అనే అర్థంలో వాడుతున్నారు. మన ప్రాచీన తెలుగు కవులు సంస్కృత పురాణ, ఇతిహాస, కావ్య, నాటకాలను తెలుగులోకి భాషాంతరీకరణం చేయడాన్ని తెనుగుచేయు, తెనిగించు/ తెలిగించు, తెనుగున రచియించు, తెనుగుగ నొనరించు, తెనుంగుగ నిర్వహించు, తెనుగున ప్రకటించు, తెనుగున చెప్పు అని అన్నారు. ఈ మాటలకు కేవలం ఇతర భాషలనుంచి తెలుగులోకి అనువదించడం అని మాత్రమే అర్థం. తెలుగు నుంచి ఇతర భాషల్లోకి అనువదించడాన్ని ఇవి సూచించవు. అందువల్ల నేడు మనం ఈ మాటలను వాడడం మానేశాం. ఏ భాషనుంచి ఏ భాషలోకైనా తర్జుమా చేయడాన్ని తెలుపడానికి 'అనువాదం' అనే పదాన్ని 'భాషాంతరీకరణం' అనే నూతనార్థంలో వాడుతున్నాం. మౌఖిక భాషాంతరీకరణనూ, లిఖిత భాషాంతరీకరణనూ తెలుగులో 'అనువాదం' అనే అంటున్నాం. ఈ సౌలభ్యంవల్ల ఈ పదం నేడు ఎక్కువ వ్యాప్తిలోకి వచ్చింది. సంస్కృతంలోని పురాణ, ఇతిహాస, కావ్య, నాటకాలను మన ప్రాచీన




కవులు తెలుగులోకి తర్జుమా చేసిన సందర్భంలో ఆ విషయాన్ని ఏ పదాలతో చెప్పారో పరిశీలించి తద్వారా వారి అనువాద విధానాలను తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

**జననుత కృష్ణద్వైపా**
**యన మునివృషభాభిహిత మహాభారత బ**
**ద్ధ నిరూపితార్థమేర్పడ౦**
**దెనుగున రచియింపు మధికధీయుక్తి మెయిన్**
**(ఆంధ్ర మహాభారతం. 1-1-16)**

అన్నాడు రాజరాజనరేంద్రుడు నన్నయతో. పై పంక్తులవల్ల, వ్యాస భారతంలో నిరూపించబడిన అర్థం / భావం తెలియునట్లుగా తెలుగులో రచించమని రాజరాజు నన్నయను కోరినట్లు వెల్లడవుతున్నది. ఇక్కడ 'రచించు' అంటే సంస్కృతంలో ఉన్నదాన్ని తెలుగులో పునః రచించు అనే అర్థం చెప్పుకోవచ్చు.

**.. నా నేర్చు విధంబున నిక్కావ్యంబు రచియించెదనని...(ఆంధ్ర మహాభారతం. 1-1-20)**

**....నానారుచిరార్థ సూక్తినిధి నన్నయభట్టు తెనుంగునన్ మహాభారత సంహితా రచన బంధురుడయ్యె జగద్ధితంబుగన్. (ఆంధ్ర మహాభారతం. 1-1-25)**

**పారాశర్యుని కృతి యయి**
**భారతమను పేర౦ బరగు పంచమవేదం**
**బారాధ్యము జనులకుబీ ద**
**ద్గౌరవ మూహించి నీవఖండిత భక్తిన్**
**(ఆంధ్రమహాభారతం. 4-1-17)**

**తెనుగు బాస వినిర్మింపఁ దివురటరయ**
**భవ్యపురుషార్థ తరుపక్వ ఫలముగాదె...**
**(ఆంధ్రమహాభారతం. 4-1-18)**

అన్నారు తిక్కన పై పంక్తుల్లో, వ్యాసుడు రచించిన భారతమనే పేరు గల పంచమవేదాన్ని తెలుగులో విశిష్టంగా నిర్మించమని హరిహరనాథుడు తిక్కనను కోరాడు. ఇక్కడ 'తెనుగుబాస వినిర్మించు' అనే వాక్యానికి సంస్కృతంలోని భారతాన్ని "తెలుగులో పునర్నిర్మించు" అనే అర్థమే చెప్పుకోవాలి.

**...విరాటపర్వమట యుద్యోగాదులుం గూడగా**
**బదియేనింటి దెనుంగుబాస జనసంప్రార్థ్యంబులై పెంపునన్**
**దుదిముట్టన్ రచియించుటొప్పు బుధసంతోషంబు నిండారగన్**
**(ఆంధ్రమహాభారతం. 4-1-7)**

అనికూడా అన్నారు తిక్కన నిర్వచనోత్తర రామాయణంలో

**అమ్మను నృపతి కభ్యుద**
**యమ్ముగ నేఁ జెప్పఁ బూనినట్టి కథకు నా**
**ద్యమ్మయి యయోధ్యయను నా**
**నామమ్మున నెగడిన పురోత్తమము వర్ణింతున్.**
**(నిర్వచనోత్తర రామాయణం. 1-45)**

మహాభారతరచనా సమయంలో తాను వ్యాసుడి భారతాన్ని తెలుగులో రచిస్తున్నానని చెప్పిన తిక్కన, ఇక్కడ వాల్మీకి రచించిన రామాయణాన్ని గానీ, మరొకరు రచించిన రామాయణాన్నిగానీ (ఉత్తర రామాయణం) తాను తెలుగులో రాస్తున్నానని అనలేదు. మనుమసిద్ధికి అభ్యుదయంగా నేను (చెప్పబూనిన (రచించబూనిన) కథకు మొదట ఆయోధ్య పురాన్ని వర్ణిస్తాను అన్నాడు తిక్కన. ఈ కావ్యం దేనికీ అనువాదం కాదు. నేను నా సొంతంగానే చెబుతున్నాను (రచిస్తున్నాను) అన్నట్లుగా ఉంది. తిక్కన నిర్వచనోత్తర రామాయణాన్ని రచించిన విధానాన్ని గురించి పాటిబండ మాధవశర్మగారు ఈ విధంగా అంటున్నారు.

"నిర్వచనోత్తర రామాయణ పీఠికలో "అది కవీంద్రులను, నూత్న సత్కవీశ్వరులను" భక్తితో గొల్చినారే కాని వాల్మీకి పేరెత్తి నమస్కరింపలేదు. వాల్మీకి రచించిన ఉత్తరరామాయణమును తాను ఆంధ్రమున కావ్యముగ సంతరింపబూనినట్లు చెప్పలేదు. ఉత్తర కాండ వాల్మీకి కృతము కాదన్న ప్రథ యున్నది. తిక్కనగారి అభిప్రాయము కూడా అదియే కాబోలును. ఉత్తరకాండ నుండి తిక్కనగారు స్వీకరించినది కొంత వస్తువు మాత్రమే. సుమారు సగము వస్తువును పరిహరించిరి. వారు పరిహరించిన యంశములలో పెక్కు ప్రక్షిప్తములని నిర్ణయింపబడినవి. ఇతివృత్తమున చిక్కదనము, ఐక్యము సాధించుట ఆయన తాత్పర్యము. కనుక కావ్యనాయకుడైన శ్రీరామచంద్రుని యుద్ధ, త్యాగ, ధర్మవీరములు, సంభోగ విప్రలంభ శృంగారములు ప్రస్ఫుటములగుటకు అవసరమైన వస్తువును మాత్రమే ఆయన స్వీకరించెను. కౌసల్యాదుల కాలధర్మమును, శ్రీరామాదుల నిర్యాణమును పరిహరించి విజయోత్సవ మంగళముతో ఉపక్రమించిన కావ్యమును పుత్రసమాగమోత్సవ మంగళముతో ఉపసంహరించెను." (మాధవశర్మ, పాటిబండ, 1968 పుట, XIV)

**"కొమ్మయ శౌరిసుమన కకుంఠిత కీర్తి విలాసమొంద గ**
**ద్యమ్మున దండిచెప్పిన కథాక్రమమొప్పఁ దెనుంగుబాస గ**
**ద్యమ్మును బద్యముంబెరయ సంచితభావ రసోదయాభిరా**
**మమ్ముగనట్లుగా దశకుమార చరిత్రము సెప్పఁ బూనితిన్"**
**(దశకుమార చరిత్ర 1-25)**

పై పద్యంలో కేతన సంస్కృతంలో దండి రచించిన గద్యకావ్యమైన దశకుమార చరిత్రను తెలుగులో గద్యపద్యాల్లో చంపూకావ్యంగా చెప్తున్నాడు. గద్యాన్ని పద్యంగా అనువదిస్తే అది హృద్యంగా ఉంటుందన్న రహస్యం తెలిసినవాడు కేతన. గద్యంలో ఉండని ఛందస్సు, లయ, యతి ప్రాసలు పద్యానికి అదనపు రమణీయతను చేకూరుస్తాయి. కాబట్టి గద్యాన్ని పద్యంగా అనువదిస్తే అది తప్పకుండా మనసుకు హత్తుకుంటుంది. పద్యాన్ని గద్యంగా అనువదిస్తే అది నిర్జీవంగా మారుతుంది. మనిషి శరీరమంతటా రక్తం వ్యాపించి వున్నట్లుగా పద్యమంతటా లయ వ్యాపించి వుంటుంది. దాన్ని తీసేస్తే Yvor Winters. (Quoted by Nowottny, Winifred. 1968: 114). 16 2 గురించి బెల్లంకొండ చంద్రమౌళి శాస్త్రిగారు ఈ విధంగా తెలుపుతున్నారు:

"ఇందలి కథా, ఎక్కువగా భావాలూ మూలానుసారులే. అయినా, ఇతడిందు తన చేయి చూపించకపోలేదు. కథా భాగాలను తాను రసోచితమనుకున్న తావులలో ఇంచుక పెంచుకుంటూ, కుదించుకొంటూనూ, ముందు వెనుకలుగా మార్చుకుంటూ పోయినాడు. ఉదాహరణకు అపహారవర్మ కథలోని వేశ్యకథ తెలుగులో చాలా తగ్గించాడు. విక్రుతుడి కథలోని రాజనీతులు మాత్రం కొంత హెచ్చించాడు... మూలంలోని నవమోచ్ఛ్వాసం దండ్యాచార్యకృతం కాదని ఉన్న పండిత జన శ్రుతిని బట్టియేమో. ఇతడది వదిలేశాడు." (చంద్రమౌళి శాస్త్రి, బెల్లంకొండ 1967: 18,19).

తన అనువాదంలో ఇన్ని మార్పులు చేసినా, "దండి చెప్పిన కథా క్రమ మొప్పునట్లుగానే" తెనుగుచేస్తున్నాని అన్నాడు కేతన.

**మును సకలశాస్త్ర ధర్మము**
**విని విజ్ఞానేశ్వరుండు వివిధ ప్రౌఢిన్**
**జనులకు దెలిపిన దానిం**
**దెనుగున జెప్పెద సమస్త దేశీయులకున్**
**(విజ్ఞానేశ్వరీయం, కేతన 1250)**

పై పద్యంలో, సంస్కృతంలో విజ్ఞానేశ్వరుడు రచించిన విజ్ఞానేశ్వరీయాన్ని తెలుగులో చెప్తానని అన్నాడు కేతన.

కేయూరబాహు చరిత్ర కృతిభర్త అయిన నందూరి గుండన మంత్రి తనతో–

**స్థాయిరసము శృంగారం**
**బైయలవడఁ గథలు నీతులై యెడనెడరాఁ**
**గేయూరబాహు చరితము**
**సేయుము' నీ వట్టి కావ్యశిల్పము మెరయన్**
**(కేయూర బాహుచరిత్ర. 1-11)**

మంచన రచించిన కేయూరబాహు చరిత్ర రచనా విధానాన్ని గురించి గడియారం రామకృష్ణ శర్మగారు ఈ విధంగా తెలుపుతున్నారు – మంచన తన కేయూరబాహు చరిత్రము నందలి ఇతివృత్తమును రాజశేఖర కవి సంస్కృతమున రచించిన "విద్ధసాల భంజిక" యను నాటిక నుండి గ్రహించెను. అయినను తానందుండి కథను గైకొన్నట్లు ఎందుకో మంచన తెలుపలేదు. మంచన ఈ నాటిక యందలి కథకు సందర్భోచితముగ మార్పులు చేసి నీతి కథలను చేర్చి కేయూరబాహు చరిత్రమును రచించినాడు. ఇతడు కొన్ని పాత్రల పేరులను, దేశ–రాజధానుల నామములను మార్చెను. సంస్కృత రూపకమును అనువదించిన తెలుగు కవులలో మంచనయే ప్రథముడు. (రామకృష్ణ శర్మ, గడియారం. 1966: 10,12,24) ఇలాంటి అనువాదాన్ని adoptation అంటారు.

తెలుగు మార్కండేయ పురాణ కృతిపతి నాగయగన్న విభుడు తనతో– "పరమ విజ్ఞానాశ్రయంబైన మార్కండేయాఖ్యమహా పురాణము విన గౌతూహలంబయ్యెడిన్"

**"కావునఁ దత్పురాణము ప్రకాశితసార కథామృతంబొగిం**
**ద్రావి జగజ్జనంబు లలర స్వచియింపు తెనుంగున స్వచః**
**శ్రీవిభవంబు పెంపు విలసిల్లఁగఁ గోవిదు లిచ్చమెచ్చి సం**
**భావన సేయఁ జారుగుణభాస్వర మారయ సత్కవీశ్వరా!"**
**(మార్కండేయపురాణము. 1-17)**

అని అన్నట్లు మారన తెలిపాడు. మార్కండేయపురాణ తెలుగు అనువాద విధానాన్ని గురించి జి.వి. సుబ్రహ్మణ్యంగారు ఈ విధంగా తెలిపారు – "మారన మహాకవి మార్కండేయ పురాణాన్ని భావానుపద్ధతిననుసరించి తెలుగుచేశాడు. మారనకు నన్నయ, తిక్కనలు పూర్వులు, గురుతుల్యులు వారిది కథానువాద పద్ధతి. వారి ప్రభావం మారన మీద బలంగా కనపడుతుంది. కాని, వారి అనువాద పద్ధతిని మారన స్వీకరించలేదు. దానికి కారణం వారిది ఇతిహాస రచన, మారనది పురాణ రచన. అయినా వారి అనువాద కళలోని పెక్కు మెళకువలను మాత్రం మారన గ్రహించాడు.....



మారన అనువాద పద్ధతిలో గమనింపదగిన మరికొన్ని విశేషాలు:

1. ఉపాఖ్యానాలను అనువదించే సందర్భంలో కథార్థాలకు ఉపబలకంగా లేని సన్నివేశాలను, వివరణలను వదిలివేశాడు.

2. కథాగమన వేగానికి అడ్డువచ్చే వివిధ శాస్త్ర విషయాలను వదిలాడు. దేవతా స్తుతులను కొన్నింటిని వదిలాడు. కొన్నింటిని సంగ్రహంగా కుదించాడు, కొన్నింటిని మూలాన్ని ఛాయామాత్రంగా ఉంచుకొని స్వీయ కల్పనలతో పెంచి స్వాతంత్ర్యాన్ని ప్రదర్శించాడు.

3. మారన సహజంగా రసలుబ్ధుడు. శాస్త్రాది విషయాలను తెలుగుచేసేటప్పుడు వాటిని సంగ్రహించినా, రసభావపోషణకు ఉపస్కారకాలకాలైన అంశాలను స్వీయ ప్రతిభా పాటవంతో విస్తరించి రచించిన ఘట్టాలెన్నో ఉన్నాయి....

4. మారన ఔచిత్యమెరిగి అమూలకాలైన అంశాలను పెక్కింటిని కల్పించి పురాణానికి కావ్యకళా గౌరవాన్ని కలిగించాడు. (సుబ్రహ్మణ్యం,జి.వి. 1984)

సంస్కృతంలోని మార్కండేయపురాణాన్ని తెలుగులో చెప్తున్నానని అంటూనే మారన "రచిస్తున్నాన"నే మాట వాడాడు ఈ కింది పద్యంలో– అంటే ఇక్కడ తెలుగులో పునః రచిస్తున్నాని అన్నట్లు అర్థం చేసుకోవాలి.

**ఇమ్మార్కండేయ పురా**
**ణమ్మఖిలహితమ్ము గాగ నానేర్చు గతిన్**
**నెమ్మి విరచించెదం బ**
**ద్యమ్ముల గద్యముల భవదుదాత్తానుమతిన్**
**(మార్కండేయపురాణము. 1-23)**

ఎర్రన రచించిన 'హరివంశము' కృతిభర్త ప్రోలయవేమారెడ్డి ఎర్రనతో–

**భారత పరాంశమని యిం**
**పారగఁ జెప్పుదురు బుధులు హరివంశము నీ**
**వా రమ్యకథ తెనుంగుగ**
**ధీరోత్తమ! నిర్వహించి తెలుపుము మాకున్**
**(హరివంశం –పూర్వభాగం1-11)**

అని అన్నట్లు తెలిపాడు. 'తెనుంగుగ నిర్వహించు' అనే వాక్యానికి సంస్కృతంలోని హరివంశాన్ని తెలుగులో పునః రచించు అనే అర్థాన్ని చెప్పుకోవాలి.

హరివంశ అనువాద విధానాన్ని గురించి పురిపండా అప్పలస్వామిగారు ఈ విధంగా తెలిపారు - హరివంశం అనువాదంలో అతడు మూలంలోంచి కొంత కొంత విడిచిపెట్టాడు. లేనిది కొంత చేర్చాడు. చిన్న చిన్న మార్పులున్నూ చేసి కావ్యానికి తెలుగుతనం తీర్చిదిద్దాడు...కొన్ని సంక్షేపించాడు. కొన్ని పెంచిన ఘట్టాలున్నూ ఉన్నాయి... నిజం చెప్పాలంటే ఇది అనువాదం కాదు అనుసరణ. 'తెనుంగుగ నిర్వహించడం' అంటే ఇదే కవి అభిప్రాయం. (అప్పలస్వామి, పురిపండా. 1969:42)

నృసింహపురాణంలో ఎర్రన "...బ్రహ్మాండాది పురాణోక్తంబయిన శ్రీనరసింహావతారంబను పురాణంబుఁ దెనుంగుభాష ప్రకటింప వలయును. (నృసింహపురాణము. 1-27) అని అన్నారు. 'తెనుంగు భాషఁ బ్రకటించవలయును' అంటే తెలుగులో పునర్మించాలనే అర్థం.

**భట్టహర్షుండు ప్రౌఢ వాక్పాటవమున**
**నెద్ది రచియించె బుధలోక హితము పొంటె**
**నట్టి నైషధ సత్కావ్య మాంధ్రభాష**
**ననఘ యొనరింపు నా పేర సంకితముగ.**
**(శృంగారనైషధం 1-16)**

**"సంతరించితి నిండు జవ్వనంబునయందు హర్షనైషధకావ్య మాంధ్రభాష (కాశీఖండం 1-07)**

**"వీరభద్రేశ్వరుఁ బ్రబంధ విభునిఁ జేసి కాశికాఖండము దెనుగుగా నొనర్తు (కాశీఖండం 1-16)**

పై పద్యపాదాల్లో శ్రీనాథుడు, ఆంధ్రభాషన్ యొనరించు, ఆంధ్రభాషన్ సంతరించితి, తెనుగుగా నొనర్తు అనే వాటిని తెలుగులోకి అనువదించు అనే అర్థంలోనే వాడాడు. అయితే తాను సంస్కృత పురాణాలను, కావ్యాలను అనువాదం చేశానని చెప్పడమే కాకుండా తాను అనువదించిన పద్ధతిని కూడా చెప్పిన మొదటి కవి శ్రీనాథుడే. ఇంతకు పూర్వపు కావ్యాల్లో ఎక్కడా లేని విధంగా శృంగార నైషధకావ్యం చివర కావ్యోపసంహారం అనే విభాగంలో తన అనువాద పద్ధతిని వివరించాడు శ్రీనాథుడు.

కావ్యోపసంహారం ...భట్టహర్ష మహాకవీశ్వరుండు (గవి కులాదృష్టాధ్వ పాంథుడొనర్చిన నైషధశృంగార కావ్యప్రబంధ విశేషణం బున, నశేష మనీష హృదయంగమంబుగా, శబ్దంబనుసరించియు, నభిప్రాయంబు గుర్తించియు, భావంబు పలక్షించియు, రసంబు పోషించియు, నలంకారంబు భూషించియు, నౌచిత్యాంబాదరించియు, ననౌచిత్యంబు పరిహరించియు, మాతృకానుసారంబునఁ జెప్పబడిన యీ భాషానైషధ కావ్యంబు...(శృంగారనైషధం, 8-202)

పై వచనంలో తాను మూల గ్రంథంలోని శబ్దాన్ని అనుసరించి, మూలభాషా గ్రంథకర్త అభిప్రాయాన్ని గుర్తించి, భావాన్ని లక్ష్యంగా చేసుకొని, రసాన్నిపోషించి, అలంకారాలతో అలంకరించి, ఔచిత్యాన్ని పాటించి, అనౌచిత్యాన్ని తొలగించి అనువాదం చేశానన్నాడు. ఇన్ని మార్పులుచేసినా తాను మాతృకానుసారంగానే తెలుగు చేశానన్నాడు. ఇది గమనించాల్సిన విషయం. అంటే మూల గ్రంథంలోని ప్రధాన కథను మార్చకుండా మిగతా మార్పులుచేసి అనువదించాడని అర్థం. ఇలాంటి అనువాదన్నే అనువాద సిద్ధాంతకర్తలు 'అనుసృజన' (Transcreation) అంటారు. నన్నయ దగ్గరనుంచి శ్రీనాథునిదాకా అందరు కవులూ ఇదే పద్ధతిని అనుసరించినట్లు పైన చెప్పిన వివరాల వల్ల తెలుస్తుంది. కాకపోతే, నన్నయాది కవులు చెప్పని అనువాద విధానాన్ని శ్రీనాథుడు స్పష్టంగా చెప్పాడు.

**"స్కందపురాణ నీరధికి ఖండము లేబది వానిలోన నా**
**నందవనానుభావ కథనంబున వక్తకు శ్రోతకున్ శుభా**
**నంద పరంపరావహము వైజగుణంబునఁ గాశిఖండ మా**
**కందువ నేనెఱింగి సమకట్టితిఁ గావ్యముగా నొనర్పగన్"**
**(కాశీఖండం 1-8)**

శ్రీనాథుని అనువాద విధానాన్ని గురించి మల్లంపల్లి శరభేశ్వర శర్మగారు ఈ విధంగా తెలుపుతున్నారు -

కాశీఖండ పీఠికలో శ్రీనాథుడు

1. "కాశీకాఖండమను మహాగ్రంథమేను దెనుగు చేసెదను" అని

2. "ఆ కందువ నేనెఱింగి సమకట్టితి గావ్యముగా నొనర్పగన్" అనియును తన రచనా స్వరూపమును రెండు విధములుగా నిర్దేశించియున్నాడు.

"మొదటిది- కాశికాఖండము సంస్కృత భాషలో మహాగ్రంథము, దానిని నేను 'తెనుగు చేసెదను' అన్నాడు.

ఇచ్చట ఒకటి గమనింపవలయును. 'తెనుగు చేయుట' అనగా అనువాదము చేయుట కాదు. నన్నయాదులైన పూర్వాంధ్రకవులు కూడా భారతాదులను అనువాదము చేయలేదు. తెనుగు చేసినారు. ఈ శతాబ్దిలోని కొందఱు భారతాది గ్రంథములకు అనువాదములు చేసిరి. నన్నయాదులవలె తెనుగు చేయలేదు.

రెండింటికి భేదము - మూల గ్రంథ గత పరమార్థమును లెస్సగా భావించి దానిని తమదిగా చేసికొని, ఆ పరమార్థమును తెనుగు భాష స్వరూప స్వభావ మర్యాదలకు పొంది పొసగియుండునట్లు తమ కవితారీతిలో స్వతంత్ర కావ్యమనిపించినట్లు తిరిగి నిర్మించుట- తెనుగుచేయుట. మూల శ్లోకార్థమును యథాతథముగా- తెనుగు పద్యములో వ్రాసికొనిపోవుట అనువాదము చేయుట.

తెనుగు చేసెడు కవి స్వతంత్రుడు. అనువాదకుడు పరతంత్రుడు.

రెండవది : 'సమకట్టితిఁ కావ్యముగా నొనర్పగన్' తాను పురాణమును పురాణముగ రచించుటలేదు. కావ్యముగ నొనర్చుటకు సమకట్టినాడు. కావున దానిని కావ్యముగానే చూడవలసియుండును. ఇట్టి తెలుగు చేసిన కావ్యములను అవి రచింపబడిన ప్రయోజనమును దృష్టియందుంచుకొని చూడవలెను. ఇవి స్వతంత్ర కావ్యములన్న దృష్టితోఁ జూచినప్పుడే వాని నిజస్వరూపము వెల్లడియగును. అనువాద ఉద్దేశాన్నిబట్టి, ప్రయోజనాన్నిబట్టి అనువాద విధానం ఉంటుందని పై మాటలు తెలుపుతున్నాయి.

ప్రబోధ చంద్రోదయం సంస్కృతంలో కృష్ణమిశ్రునిచేత రచించబడిన ఆరంకాల నాటకం. తెలుగులో దీనిని నందిమల్లయ, ఘంట సింగయలు ఐదంకాల ప్రబంధం (కావ్యంగా)గా అనువదించారు. 1470 ప్రాంతంలో దీనిని రచించి పూసపాటి బసవభూపాలుని మంత్రి ఆనంతామాత్యుని గంగమంత్రికి అంకితమిచ్చారు. ఇతను నందిమల్లయ, ఘంట సింగనలను ఉద్దేశించి–

**అనవుడు ననంతవిభు గం**
**గన వారలఁజూచి యిట్టి ఘన నాటకముం**
**దెనుగునఁ బ్రబంధశయ్యకు**
**నొనగూర్పగ నేర్చు సుకవులుర్విం గలరే?**
**(ప్రబోధ చంద్రోదయము. 1-22)**

**నేరుపరి పోహణించిన**
**హారము వెల యొక్క లీల నతిశయముగ నా**
**పేరఁ దెలిగింపవలయును**
**సారపుఫణితులఁ బ్రబోధచంద్రోదయమున్**
**(ప్రబోధ చంద్రోదయము. 1-27)**

**అభ్యదయ పరపరాభివృద్ధిగా మా రచియింపంబూనిన ప్రబోధ చంద్రోదయంబను మహాకావ్యంబుకుం గథాసూత్రమెట్టిదనిన.**
(ప్రబోధ చంద్రోదయము. 1-38)

భారతుల మార్కండేయశర్మ ఈ అనువాదాన్ని గురించి ఈ విధంగా అంటున్నారు. దృశ్యకావ్యమును శ్రవ్యకావ్యముగా చేయుట చేత అనువాదమున ప్రారంభముననే గాక కథాప్రణాళికలో కొన్ని మార్పులు ప్రవేశ పెట్టవలసి వచ్చినది.

**"అనువాదమనగా నొక పుస్తకమును వేషము మార్చి వరొక వేషమువేసి చూపుటే కదా! ఇక లోపలనుండు నంగ ప్రత్యంగ రూపురేఖలు యథాస్థితములే కదా? అందును వాక్యమునకు వాక్యమును శబ్దమునకు శబ్దమును వ్రాసియుంచినచో శాబ్దికానువాదమందురు. అప్పుడు వాగ్ధారలందు మచ్చునకైన నుండవు. అనువాదకుడు గనుక నధిక స్వాతంత్ర్యము (దీసికొన్నచో నది**



**ఛాయానువాద మనబడును. కథా విచారములున్న వున్నట్లు వచ్చినచో భావానువాదమగును. భాషాంతరీకరణమున వట్టి మూల కథా సారాంశమే వచ్చినచో మర్మానువాద మందురు. శాబ్దికానునాదములో మౌలికత యుండుటకే వీలులేదు."** (భారతుల మార్కండేయశర్మ. 1969 : 11)

**అమర హుళక్కి భాస్కర మహాకవి చెప్పగనున్న యుద్ధకాం**
**డము తరువాయి చెప్పెఁ బ్రకట ప్రతిభాషణు దప్పలార్య స**
**త్తమ సుతు దయ్యలార్యుడు కృతస్థితి నార్యులు మెచ్చునట్లుగా...**
(భాస్కర రామాయణం. యుద్ధకాండ. 1618)

అయ్యలార్య విరచితంబయిన శ్రీరామాయణ కావ్యంబునందు యుద్ధకాండ శేషంబు సర్వంబు నేకాశ్వాసము. (భా.రా. యుద్ధకాండ ఆశ్వాసాంత గద్య)

**"తన వచోవిశేష మెనయక పూర్వక**
**థామితోక్తిఁ జెప్పుటేమి కడిది**
**యొకడు కోలవట్టి యొయ్యనఁ గొనిపోవ**
**సంధుడెవటికైన నరుగు టరుదె"**
**(సింహాసన ద్వాత్రింశిక 1-34)**

శబ్దానువాదం చెయ్యడం అనేది అంధుడు ఒకరు ఇచ్చిన కర్రను ఊతగా చేసుకొని నడవడం లాగా సులువైనది. తన సొంత కవితా విశేషాలు లేకుండా అనువాదం చెయ్యడం పెద్దవిశేషం కాదు అన్నది కొరవి గోపరాజు అభిప్రాయం.

Ezrapound translations were affen accused of being inaccurate. But Pound was unrepentent, for he felt that any fool with a bilingual dictionary could be accurate (Asha s Kanwar 1995)

I am persuaded that the translator must recast the original into his own likeness- better a live sparrow than a stuffed eagle (తివారీ, బోలానాథ్ : 180) Letaal transbrion is a lazymang translation అంటాడు ఒక అనువాదవేత్త

**"ఈ సరసోక్తి కావ్యమొక డిమ్ముల సంస్కృత భాషనచ్చుగాఁ**
**జేసిన నట్ల వీడు మతి చేయుట యేటిది యంచుఁ జెప్పగాఁ**
**జేపి యనాధరం బురక చేయకుఁడీ విలుకాడు తూటుగా**
**నేసిన నందె పాఱ మతి యేసిన వానిధ సూటిగావునన్"**
**(సింహాసన ద్వాత్రింశిక 1-35)**

మూలభాషా గ్రంథ రచయితకన్న అనువాదకుడు చేసే పనే కష్టమైనదని కొరవి గోపరాజు అభిప్రాయం. ఒక విలుకాడు ఏదో ఒకచోట బాణం వేయడం కష్టం కాదు. ఆ విలుకాడు వేసిన స్థానంలోనే మరో విలుకాడు బాణం వేయడం కష్టం అని గోపరాజు పోలిక చెప్పాడు. కానీ, ఈ పోలికలోనే ఏదో లోపం ఉన్నట్లు కొంత సూక్ష్మంగా ఆలోచిస్తే తెలుస్తుంది. మొదటి విలుకాడు ఏదో ఒకచోట బాణం వేయడం కాకుండా ఒక నిర్ణీత లక్ష్యంపై బాణం వేయడం కష్టం. మొదటి విలుకాన్ని అనుసరించి రెండో విలుకాడు అదే లక్ష్యంపై బాణం వేయడం సులభం. ఒకరు చేసిన పనిని అనుసరించడం ఎప్పుడూ సులువే. అనువాదంలో కథ, పాత్రలు, సంఘటనలు అన్నీ మూల భాషా రచయిత సృష్టించినవే. అనువాదకుడు ఇవేవీ మళ్ళీ సృష్టించనవసరంలేదు. కాబట్టి అనువాదకుడిపై ఈ భారం పడదు.

**"చిత్రఖ్యాతి వితీర్ణ విక్రమనిధి శ్రీవిక్రమాదిత్య దా**
**రిత్రఖ్యాపన శాసనంబులకు భూరి స్తంభ సంభారమై**
**ధాత్రీపాలురుఁ గావ్యవేదులును మోదంబంద సింహాసన**
**ద్వాత్రింశత్కకథల స్థణంబులుగఁ గావ్యం బొప్పుగాఁ జెప్పెదన్"**
**(సింహాసన ద్వాత్రింశిక 1-59)**

గద్య పద్యాత్మకమైన ఒక సంస్కృత విక్రమార్క చరిత్రమును వావిళ్ళవారు 1936లో ప్రకటించిరి. అదియే గోపరాజు అనువదించిన మూల గ్రంథము. ఆ సంస్కృత మూలమును పూర్తిగా గ్రహించి గోపరాజు మతికొన్ని కథలను సమకాలిక జవజీవన విశేషములను చేర్చి "సింహాసన ద్వాత్రింశిక" అను పేర ఈ కథాకావ్యమును రచించెను. (రామకృష్ణశర్మ, గడియారం, 1982 పరిష్కర్త. 1982 సింహాసన ద్వాత్రింశిక).

**"మును రామాయణము న్నిరోష్ఠ్యముగ నింపుల్మేర శాకల్లె మ**
**ల్లన తా సంస్కృత భాషఁ జేసెనన నాలాగున్ జెవుల్ నిండగా**
**వినుటేగాని ధరిత్రిలో విజముగా వీక్షింపలేదట్టిదే**
**దెనుగుం జేసెద నెల్లెడన్ గవులకున్ దృష్టాంతమై ఏర్పడన్"**
**(దశరథరాజ నందన చరిత్ర 1-32)**

సింగరాచార్యుల అనువాద విధానాన్ని గురించి శ్రీరంగాచార్య ఈ విధంగా అంటున్నారు. **"సంస్కృత రామాయణమును తెనుగున పరివర్తన గావించినవారిలో నొకరిద్దరు తప్ప వందరును విపులము గనో, కొంత సంక్షిప్తముగనో, మరి కొన్ని కొన్ని యుపాఖ్యానములను చేర్చియో రచన సాగించినవారే, సింగరాచార్యులు నిరోష్ఠ్య నియమము వలననేమో ఈ రచనను మిక్కిలి సంక్షిప్తము చేసినాడు. మూలములోగల రసవంతమైన కొన్ని కథలను వదలి పెట్టినాడు. ఎంత సంక్షిప్తమనగా సుమారు 68 వర్గలుగల సుందరకాండను 10 పద్యములలో చెప్పినాడు."** (శ్రీరంగాచార్య, 1979: 65) దశరథరాజు నందన చరిత్ర.

**"విను కాళహస్తి మహిమం**
**బనుపమమై వెలయ, మును షడధ్యాయికథన్**
**దెనుగునఁ గావ్యముగ నొన**
**ర్చెను బెద ధూర్జటి కవీంద్ర శేఖరుడనగా!"** (స్కాందాంతర్గతమైన వైష్ణవఖండమందలిది)

**బహుపురాణ మథిత భవ్యార్థ శివతత్త్వ**
**సారమెల్ల నైక్యపరణి బొదలి**
**జగతి శివరహస్య సంగ్రహమను నితి**
**హాస మొనరు విబుధు లభినుతింప**

**ఆ యితిహాసమందలి యుత్తర భాగంబునందు భాస్వన్నిరూఢి**
**గాళహస్తి మహత్త్వకథ మాట యిర్వది యధ్యాయముల చెలువమరుచుండు**
**తత్కథఁ దెనుగున ద్రాక్షారసోర్మి కా పరిపాక విస్ఫూర్తి పరిఢవిల్ల**
**గృతి యొనర్పుము మదంకితముగ శబ్ద చమత్కృతి పండితుల్మది గణింప (ధూర్జటి లింగరాజకవి)**

కావున మార్కండేయ పురాణోక్త ప్రకారంబునం జెప్పుమని కర్పూర తాంబూలంబు వెట్టినం బట్టి మహా ప్రసాదంబని మోదంబున నమ్మహాప్రబంధ నిబంధనంబునకు ప్రారంభించితి. (మనుచరిత్ర)

కోన విఠ్ఠలరాజు తన కుమారుడైన కోన బుద్ధరాజుతో

**"భూమిఁ గవీంద్రులు బుధులును మెచ్చ**
**రామాయణంబు పురాణమార్గంబు**
**తప్పక నా పేర దగ సంద్రభాష**
**జెప్పి ప్రఖ్యాతంబు సేయిం పు ముర్వి**
**యని యానతిచ్చిన..**(రంగనాథ రామాయణము బాలకాండ 93,94,95)1949.

**"ఆది కవీశ్వరుడైన వాల్మీకి**
**యాదరంబునఁ బుణ్యులందఱు మెచ్చ**
**జెప్పిన తెఱగున శ్రీరామచరిత**
**మొప్పఁ జెప్పెద గథాభ్యుదయమెట్టిదనిన"**
**(రంగనాథ రామాయణము -బాలకాండ 102,103)**

కవి యిందు శ్రీమద్రామాయణమున లేని జంబుమాలి వృత్తాంతము, కాలనేమి కథ, సులోచనా చరిత్రము చదువ బాఠకులకు, శ్రోతలకుఁ బరవశత్వము కలిగించుననుటలో వింతలేదు. (వెంకట సుబ్రహ్మణ్యశర్మ, జనమంచి, పీఠిక, రంగనాథరామాయణం)

**"సరస (నష్ట)పువ్వులుగ మాలకరి పెక్కు తెఱఁగుల విరుల నెత్తులుగఁ గావించినట్లు**

**కర్పూర కస్తూరికావస్తు వితతిచే శ్రీఖండ చర్చ వాసించినట్టు**

**లొడికంబుగా గంధవొడికి నానాసూన పరిమళంబులు గూడ బఱచినట్లు**

**సరఘులు వివిధ పుష్ప మరంద లవములు గొనివచ్చి తేనియ గూర్చినట్లు**

**"భారతప్రోక్త కథ మూలకారణముగ**

**కాళిదాసుని నాటక క్రమము కొంత**

**తావకోక్తికి నభినవశ్రీ వహింప**

**గూర్మిఁ గృతి సేయు నాకు శాకుంతలంబు" (శృంగార శాకుంతలము 1-27) కృష్ణకుమారి, నాయని.**

పాండురంగ మాహాత్మ్యం కృతిభర్త విరూరి వేదాద్రి తెనాలి రామకృష్ణకవిని **"తగ సంస్కృతము దెనుంగుగఁ జేయఁ దెనుగు సంస్కృతముగఁ జేయంగఁ జతురమతివి"** (పాండురంగ మహాత్మ్యము 1-23) ప్రశంసించాడు. అనంతకృష్ణశర్మ, రాళ్ళపల్లి, గౌరు పెద్ది రామసుబ్బశర్మ. పరిష్కర్తలు, 1967.

**"వీరరాజ విరచిత భారత వచనము వ్యాసభారతమునకు సరయైన భాషాంతరీకరణము ఒక్క విశేషాంశమైనను వెలివోనీక యీతడు సమగ్రముగా వ్యాసుని యర్థముం గొని తెచ్చినాడు. గద్య వ్రాయుటకు ఆశ్వాసములను విభాగములు వేసినట్లుగా తోచుచున్నదే కాని ఆదిపర్వము మొదలు వ్యాస భారతాధ్యాయములు అధ్యాయములుగానే కానవచ్చుచున్నవి. భాషాంతరీకరణమే యని రచన చప్పిడి కాలేదు. ఆంధ్రముయొక్క జాతీయఫక్కి కొరవడలేదు. గాంభీర్యమవసరమగు చోట రేచన గంభీరముగా నడచి వర్ణనాదికి ఘట్టముల యందు తత్తద్విషయమును కండ్లకు గట్టినట్లు గోచరింపజేసినది. సంభాషణ సంబంధమగు ఘట్టములయందా తిక్కన చిన్న వాక్యములు ప్రత్యక్షమయి హృదయమును తస్కరించుచున్నవి. జిగి, బిగి, లాలిత్యము, మాధుర్యము అన్నియు నీ వచన రచన యందు కానంగ నగును."** (వెంకటేశం పంతులు, ఎన్.కే. 1928 : ఆంధ్ర వచన శ్రీమహాభారతం.

**ఉపయుక్త గ్రంథ సూచి**

అప్పలస్వామి, పురిపండా 1968. హరివంశము పూర్వభాగము. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి






ఆంధ్ర మహాభారతం. ప్రథమ సంపుటము. హైదరాబాదు: తెలుగు విశ్వవిద్యాలయం, ప్రథమ ముద్రణము. శుక్ల ఉగాది.

చంద్రమౌళిశాస్త్రి, బెల్లంకొండ. సంపాదకుడు. 1967. దశకుమార చరిత్ర. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి

చెన్నారెడ్డి, జీరెడ్డి. పరిష్కర్త. 1971. ఆంధ్రమహాభారతము (విరాటపర్వము). హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి

దుర్గయ్య, పల్లా. సంపాదకుడు. జనవరి 1968. విక్రమార్క చరిత్రము. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ

మాధవశర్మ, పాటిబండ. (పరిష్కర్త). 1968. నిర్వచనోత్తర రామాయణము. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి

రామకృష్ణ శర్మ, గడియారము. పరిష్కర్త. 1966, కేయూరబాహు చరిత్రము. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి

వెంకటరాయశాస్త్రి, వేదం. సంపా. 1985. హైదరాబాదు: తెలుగు విజ్ఞానపీఠం. ప్రథమ ముద్రణ. 1967

వెంకటరావు, నిడుదవోలు. పరిష్కర్త. 1976. ప్రబోధ చంద్రోదయం. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి

వెంకటావధాని, దివాకర్ల (పరిష్కర్త). 1967. నృసింహపురాణము. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ

శరభేశ్వరశర్మ, మల్లంపల్లి. వ్యాఖ్యాత. 1992. శ్రీకాశీఖండము. హైదరాబాదు: తెలుగు విశ్వవిద్యాలయం

సుబ్రహ్మణ్యం, జి.వి. సంపాదకుడు. 1984. మార్కండేయ పురాణము. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ

Nowottny, Winifred. 1968 edition. The Language Poets Use. London: University of London. (1st edition. 1962)



ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5 (26) హైదరాబాద్ ఏప్రిల్ : 2025

## ఆదిత్య హృదయ మహిమ

**"ఆదిత్యః సవితా సూర్యః ఖగః పూషా గభస్తిమాన్**
**సువర్ణ సదృశో భాను ర్హిరణ్యరేతా దివాకరః"**

ఇందులో ఆదిత్యుడు, సవిత, సూర్యుడు, ఖగుడు, పూష, గభస్తిమంతుడు, సువర్ణసదృశుడు, భానువు, హిరణ్య రేతసుడు, దివాకరుడు అని పది నామాలు ఉన్నాయి.

(గత సంచిక తరువాయి)

**10. దివాకరః :** దివాకరుడు. పగలు జీవులను చేష్టావంతులనుగా చేయువాడు దివాకరుడు. ఆదిత్యకాంతి ప్రసారం సోకకపోతే ప్రాణులు జడత్వంతో అలమటించి పోతారని తాత్పర్యం.

**హరిదశ్వః సహస్రార్చిః సప్తసప్తి ర్మరీచిమాన్**
**తిమిరోన్మథనః శమ్భుః త్వష్టా మార్తాణ్డకోంశుమాన్**

**11. హరిదశ్వః :** హరిదశ్వుడు – పచ్చనికాంతిగల గుఱ్ఱములు గలవాడు. పసుపు మంగళద్రవ్యం. పసుపులో రోగనిరోధక శక్తి అధికంగా ఉన్నది. అటువంటి పసుపువన్నెతో అలరారే అశ్వాలు కలవాడు హరిదశ్వుడు. ఇక్కడ గుఱ్ఱాలు అంటే గుఱ్ఱాలవంటివి అని చెప్పుకోవాలి. గొప్పబలము, దమ్ము పట్టగల శక్తి, వేగము మొదలైనవి గుఱ్ఱాల గొప్పగుణాలు. అటువంటి ఏడు గుఱ్ఱాలు సూర్యరథానికి ఉన్నాయని ఆలంకారికంగా చెబుతారు. ఆ గుఱ్ఱాల మేనికాంతి పసిమి వన్నెతో ఉంటుంది. కనుక ఆ వన్నె సోకిన ప్రాణి గొప్పశక్తిని తన దేహం లోనికి తీసుకుంటుంది. దుష్కరమైన కార్యాన్ని కూడా సుకరం చేస్తుంది ఆ వన్నె.

'హరిత్' హరిత్తులు అంటే దిక్కులు అని కూడా ఒక అర్థం. దిక్కులే గుఱ్ఱాలయినవాడు. దిక్కులకు అభిముఖంగా ప్రసరించే లక్షణం కలవాడు – అనే అర్థాన్ని కూడా గ్రహించవచ్చు.

**12. సహస్రార్చిః :** వేలకొలదిగా వెలుగుదీపాలున్నవాడు. సూర్యుని నుండి వచ్చే వెలుగులు, అగ్నిదేవుడు సూర్యకిరణాలు తనలో నిక్షేపించుకున్న దీప్తులు, ఓషధులలో రాత్రి సమయాలలో కాంతులను విరజిమ్మే ప్రకాశ శక్తులూ .. ఇవన్నీ ఆదిత్యునికి సంబంధించినవే. ఆదిత్యుడు ఆ అన్నింటినీ అవసరమైన అన్ని చోటులందూ నిక్షేపించి వానితో ప్రాణికోటిని ప్రాణవంతాలు చేస్తున్నాడు.

**13. సప్తసప్తిః :** సప్తి అంటే గుఱ్ఱం. సేవాది ధర్మములతో కూడియుండునది అని వ్యుత్పత్తి. జగత్తును సేవించటమే ధర్మంగా గల గుఱ్ఱాలు ఏడు ఉన్నవాడు అని శబ్దార్థం. సేవించటం అంటే వానివానికి కలగవలసిన ప్రయోజనాలు కలిగిస్తూ ఉండడం. ఆదిత్యుని అశ్వాలు అటువంటి శీలం కలవి అన్నమాట. ఈ పదంలో కూడ ఆదిత్యుని వలన లోకాలకు కలిగే ప్రయోజనం తెలియ వస్తుంది. దీనివలన ఆదిత్య పర్యాయవాచక శబ్దాలన్నీ లోకోపకారైక లక్ష్యం కలవాడు అనే తాత్పర్యాన్ని తెలుపుతున్నాయి. అటువంటి ప్రయోజనాల నెన్నింటినో మనకు అయాచితంగా కలిగిస్తున్న ఆదిత్యుడు సర్వజనారాధ్యుడు అని ఆదిత్యహృదయం ధ్వని మార్గంలో బోధిస్తున్నది. ఈ సందర్భంలో ఆదిత్యుని అవిశ్రాంత స్థితిగతులను మహాకవి కాళిదాసు గొప్పగా, కవితాత్మకంగా చెప్పిన దానిని మనం స్మరించాలి. (సశేషం)(ఆచార్య శలాక రఘునాథ శర్మగారి 'ఆదిత్య హృదయం' నుండి)

## సత్సంగం





### అలజడి లేని జీవితం

వాంఛలని తీర్చుకోవడంలోగాని, పెంచుకోవటంలో గాని ఆనందం లేదు. ప్రతివాంఛా అలజడికి కారణమే అవుతుంది. ఇతరుల సంతోషంలో పాలుపంచుకొని ఆనందించవచ్చు. ప్రతిఫలాపేక్ష లేకుండా సహాయ పడినప్పుడు కలిగే సంతృప్తి మన కోర్కెలను తీర్చుకొన్నప్పుడు కలిగే దాని కంటే ఎక్కువగా ఉంటుంది. మనతో ఎక్కువ సంబంధం లేని వారిని ప్రేమించటం తేలికే, కాని పొరుగువాని లోపాలను ఎప్పుడూ చూస్తూ వానినే ప్రేమించటం కష్టం. అతఃనిని ప్రేమించట మంటే నీ దురభిప్రాయాలను ప్రక్కకు పెట్టి అతనిని అతనుగానే ప్రేమించటమన్న మాట. వాస్తవాన్ని అంగీకరించలేకపోవటం ఎంతో అలజడికి దారితీస్తుంది. ఎట్లాగున్న వారిని అట్లాగే మనస్ఫూర్తిగా, ఏ ఆర్భాటమూ లేకుండా ప్రేమించగలగాలి. నిజమైన ప్రేమ సదవగాహనని కలిగిస్తుంది. వాస్తవాన్ని అంగీకరించడం వల్ల అలజడి పోతుంది.

అన్ని మతాలూ అహంభావ రహితంగా ఉండటానికి పద్ధతులు చెప్తాయి. అహంకార యుతంగా ఉ ండడం గురించి కాదు. మనస్సులో ఆలోచనలు ఎక్కువైన కొద్దీ శక్తి తగ్గిపోతుంది. పూజ, జపం వంటివి ఏకాగ్రతను పెంచుకోవటానికి సాధనాలు. అవి సాధనాలే గాని సాధ్యాలు కావు. ఈ విషయం మరచి పోకూడదు. అసలు లక్ష్యం ప్రశాంతత, నిశ్చలత. ప్రతి మతంలోనూ కొన్ని కర్మలు నిర్దేశింపబడియున్నాయి. ప్రారంభదశలో అవి అవసరమే. ఒక వృక్షం ఎదిగినట్లే యిదీను. ముందర విత్తుని నాటుతాం. అది మొలక లెత్తుతుంది. అది చిన్న మొక్కగా ఉన్నప్పుడే గొడ్లు తినవేయకుండా దాని చుట్టూ కంచవేస్తాం. అది పెద్ద చెట్టయిన తర్వాత దానికి ఒక ఏనుగుని కూడా కట్టవచ్చు. మన మానసిక ఆధ్యాత్మిక ప్రగతి విషయంలోనూ ఇంతే. ప్రారంభదశలో మతాచారాలు కంచెవంటివి. ఆధ్యాత్మిక పురోగతి కలిగిం తర్వాత ఆ కంచెని తీసేయొచ్చు

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5 (27) హైదరాబాద్ ఏప్రిల్ : 2025

# తెలుగు భాషా సాహిత్యాలు – పరిశోధన పద్ధతులు

**ఆచార్య వెంకటరామయ్య గంపా,** భారతీయ భాషలు మరియు అధ్యయన శాఖ, ఢిల్లీవిశ్వవిద్యాలయం.
ఫోన్ : 9958607789

తెలుగు సాహిత్యంలో పరిశోధనల సంఖ్య ఎంత విస్తృతంగా పెరుగుతుందో, ప్రామాణికత అంతే స్థాయిలో తగ్గుతుంది. ఇందుకు కారణాలు చాలా ఉన్నాయి. అన్ని విశ్వవిద్యాలయాల వారికి అంగీకారయోగ్యమైన, కాలానుగుణమైన మార్పులతో కూడిన ఆమోద యోగ్యమైన 'తెలుగు పరిశోధన పద్ధతులు' పై పుస్తకాలు కొన్ని ఉన్నప్పటికీ, వాటిని విశ్వవిద్యాలయాల వారు పూర్తిస్థాయిలో అనుసరించడం లేదు. దానితో తెలుగు పరిశోధనల మధ్య అనేక వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. ఇతర భాషలలో మాత్రం ఎప్పటికప్పుడు పరిశోధన పద్ధతులలో మార్పులు జరుగుతున్నాయి. కొన్ని సంస్థల వారు చేస్తున్న చేర్పులను చాలావరకు ఇతర భాషలవారు అంగీకరిస్తున్నారు కాని తెలుగులో అది జరగడం లేదు. ఇదివరకు తెలుగులో వచ్చిన పుస్తకాలలో ఉన్న సమాచారంతో పాటు ఆంగ్లంలో వస్తున్న మార్పులను గమనిస్తూ మనం ఇప్పుడు కొత్తగా పరిశోధన పద్ధతులను నిర్మించుకోవాల్సిన అవసరం ఉన్నది. దానికోసం మూసీ మాసపత్రిక తనవంతు బాధ్యతగా ఒక ప్రయత్నాన్ని మొదలుపెట్టింది. ప్రతి వ్యాసాన్ని పాఠకులు చదివిన వెంటనే ఇంకేమైనా మార్పులు, చేర్పులు అవసరం అనుకుంటే మాకు తెలియజేయ మనవి. **చర్చను కూడా స్వాగతిస్తున్నాం.** **– సంపాదకులు.**

## తెలుగులో పరిశోధన అంశం ఎంపికలో సంక్లిష్టతలు, గుర్తించని ఖాళీలు

తెలుగులో పరిశోధన ప్రారంభమై దాదాపు 100 సంవత్సరాలు కావస్తోంది. గత 40 సంవత్సరాల కాలంలో పరిశోధనలతో పాటు పరిశోధన పద్ధతికి సంబంధించిన గ్రంథాలు తెలుగులో విరివిగానే లభ్యమవుతున్నాయి.

గంధం అప్పారావు – కాళిదాసు సూర్యనారాయణ – పరిశోధన పద్ధతులు (1985), డాక్టర్ జయప్రకాష్ – పరిశోధనా విధానం (1990), డాక్టర్ ఆర్.వి.ఎస్ సుందరం – పరిశోధనా పద్ధతులు (1990), ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి, హెచ్. ఎస్. బ్రహ్మానంద – సాహిత్య పరిశోధన సూత్రాలు (1997), కుసుమాబాయి, ఎం. కులశేఖర రావు – పరిశోధన సూత్రాలు (2000), బూదరాజు రాధాకృష్ణ: తెలుగు భాషా స్వరూపం (2001), ఆచార్య పులికొండ సుబ్బాచారి – పరిశోధన విధానం (2014), పి. సత్యనారాయణ – సామాజిక శాస్త్రాల్లో పరిశోధన విధానం (2015), ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ– సాహిత్య పరిశోధన కళ: విధానం (2017).. మరికొన్ని పుస్తకాలు తెలుగులో పరిశోధనా పద్ధతికి సంబంధించిన విషయాలను చర్చించిన గ్రంథాలు.

పరిశోధనా పద్ధతికి సంబంధించి విస్తృతమైన సమాచారం లభిస్తున్నప్పటికీ తెలుగు పరిశోధనల్లో నాణ్యత లోపిస్తుందని అధికశాతం మంది విమర్శకులు వెలిబుచ్చిన అభిప్రాయం. విస్తృతమైన వనరులు, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్న సమాజంలో పరిశోధన వయస్సు వంద సంవత్సరాలు అంటే.. చాలా ఎక్కువనే చెప్పాలి. 30 సంవత్సరాల క్రితంతో పోల్చుకున్నప్పుడు తెలుగు ప్రాంతాలలో ఉన్న విశ్వవిద్యాలయాల సంఖ్య తక్కువ. వెలువడిన పరిశోధనలూ పరిమితంగానే ఉండేవి. గతంలో పరిశోధకులు వివిధ సమస్యలు ఎదుర్కొన్నారు. గతంలో పరిశోధకులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఎస్. జయప్రకాష్ పరిశోధన విధానం అనే గ్రంథంలో కొన్ని అంశాలను చెప్పారు. 'పరిశోధకులకు పరిశోధన విధానంలో శాస్త్రీయ శిక్షణ లేకపోవడం, విశ్వవిద్యాలయాల మధ్య పరస్పర సమాచార వినియోగం లేకపోవడం, గ్రంథాలయాల సహకారం లేకపోవడం, వివిధ లిఖిత ముద్రిత సమాచారం పరిశోధకుడికి అందుబాటులో లేకపోవడం, ఆర్థిక సహాయం లేకపోవడం వలన పరిశోధకుడు పరిశోధనలు కాలేకపోతున్నారని' 1990లలో ఉన్న సమస్యలను చెప్పారు. అయినప్పటికీ ఆ కాలంలో కొన్ని ఉత్తమ పరిశోధన గ్రంథాలు వెలువడ్డాయి. గత 30 సంవత్సరాల కాలంతో పోలిస్తే ప్రస్తుతం కావల్సినంత సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉంది. గ్రంథాలయాల సమాచారం అంతర్జాలంలో విస్తృతంగా ఉంది. పరిశోధకులకు వివిధ రకాలైన ఆర్థికపరమైన సహాయం లభిస్తూ వుంది. ముఖ్యంగా యు. జి. సి. వారి ఫెలోషిప్ ల సంఖ్య ఎక్కువగానే ఉంది. తెలుగు ప్రాంతాలతో పాటు ఇతర ప్రాంతాలలోనూ విశ్వవిద్యాలయాలలో తెలుగు పరిశోధనకు అవకాశం ఉంది. కానీ పరిశోధనలో నాణ్యత అనే విషయానికి వచ్చినప్పుడు తెలుగు అధ్యాపకులు, పరిశోధకులు తెలుగు పరిశోధకుల పరిశోధనను తక్కువ చేసి మాట్లాడుతున్నారు. అందుకు పలు కారణాలు ఉన్నాయి. ఆ విషయాలను వివరంగా చర్చించడానికి వ్యాస పుటల పరిమితి అడ్డుపడుతుంది.

ప్రస్తుతం ఈ వ్యాసంలో పరిశోధన అంశం ఎంపికలో సమస్యలు– పరిశోధన ఖాళీలు గురించి చర్చించే ప్రయత్నం జరిగింది. ఈనాటి తెలుగు పరిశోధనలో పరిశోధనాంశం ఎంపికే ఒక సమస్య మారింది. పరిశోధన విధానంలో పరిశోధనాంశం ఎంపిక అనేది అత్యంత

ముఖ్యమైన విషయం. ఈ అంశంపై తెలుగులో వెలువడిన పరిశోధన విధానం/ పద్ధతులకు సంబంధించిన రచనల్లో రచయితలు వివరంగా చర్చించే ప్రయత్నం చేశారు. **“పరిశోధన క్రమంలో తొలి అంశం శోధితం కావలసిన సమస్యను ఎన్నుకోడం. పరిశోధనకు తగిన విషయాన్ని ఎన్నుకోవడంలో ఉపజ్ఞ (intuition)తో పాటు తీవ్రమైన ఆలోచన కూడా ఉండాలి. అంతకుముందు జరిగిన పరిశోధనల్లో అస్పష్టంగా వుండే విషయాన్నో లేక విషయంలోని భాగాన్నో నూత్న పరిశోధనకు పాత్రం చేయడం సాధారణంగా జరుగుతున్నది. ఇటువంటప్పుడు ఆయా విషయాల మీద పూర్వులు చేసిన వ్యాసంగం అంతా సరిచూచి, లబ్ధ గ్రంథ సామగ్రిని బాగా తిరగవేసి తాను గ్రహించబోయే అంశం ఇతరులు పరిశోధన చేయనిదనీ, చేసివుండినదైనా సంపూర్ణంగా పరిశీలింపబడనిదనీ నిర్ధారించు కోవాలి. అలా చేస్తే చర్వితచర్వణం చేసే పొరపాటు రాదు. శ్రమ వ్యర్థంగా పోదు.”** (అప్పారావు, గంధం. పరిశోధన పద్ధతులు. పుట-16). ముఖ్యంగా ఈ అంశంపై రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి, పులికొండ సుబ్బాచారి మొదలైన పరిశోధకులు తమ రచనలలో చాలా వివరంగా పేర్కొన్నారు.

అయితే కాలానుగుణంగా నూతన అంశాలు, సమస్యలు ఉత్పన్నం అవుతూనే ఉన్నాయి. అందుకు అనుకూలంగా పరిశోధన అంశం ఎంపిక చేసుకోవాల్సిన అవసరం ఉంది. తెలుగులో వెలువడిన పరిశోధనా విధానం లేదా పద్ధతులకు సంబంధించిన పుస్తకాలు కొన్ని ఆంగ్లంలో ఉన్న సామాజిక శాస్త్రాలకు సంబంధించిన అంశాలను ప్రాతిపదికగా చేసుకొని రచించినవి. కొన్ని పుస్తకాలు మాత్రం సామాజిక శాస్త్రాలలో ఉన్న విషయాలను సాహిత్యానికి అన్వయం చేసి ముఖ్యంగా తెలుగులో ఉన్న పరిశోధన సమస్యలను వివరించే ప్రయత్నం చేశారు పరిశోధకులు. పులికొండ సుబ్బాచారి తన పరిశోధన విధానం గ్రంథంలో సాహిత్యంలో పరిశోధన చేస్తున్నప్పుడు వచ్చే వివిధ సమస్యలను ఉదాహరణలతో వివరించారు.

పరిశోధకులు కాలంలో వచ్చే మార్పులకు అనుగుణంగా నూతన అంశాలు, నూతన సమస్యలు ఎదుర్కొంటున్నారు. నూతన జాతీయ విద్యా విధానం (2020)ప్రకారం నాలుగు సంవత్సరాల డిగ్రీలోనూ పరిశోధన అంశాన్ని ఎంపిక చేసుకుని సౌలభ్యం ఉంది. కొన్ని విశ్వవిద్యాలయాలలో ఎం.ఏ. చదువుతున్నప్పుడే సిద్ధాంత వ్యాసం ఎలా రాయాలో నేర్పిస్తున్నారు. ఎం.ఫిల్. డిగ్రీ తీసివేసిన తర్వాత విద్యార్థులు ఎం.ఏ. పూర్తయిన తర్వాత వెంటనే పిహెచ్.డి. చేరే సౌలభ్యం ఉంది. అంతర్జాలం లభిస్తున్న సమాచారంతోపాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంబంధించిన అనేక పరికరాలు సులభంగా లభ్యమవుతున్నాయి. ఇటువంటి సందర్భంలో విద్యార్థులకు సరైన శిక్షణ లేకపోవడం వలన పరిశోధన ఎంపికలో ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు. వాటిని చర్చించడం ఈ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశం.

**పరిశోధకుడి ఆసక్తి, సామర్థ్యాల మధ్య సమతుల్యత అవసరం:**

పరిశోధకుడి ఆసక్తి, కుతూహలం పైన ఆధారపడి పరిశోధన అంశాల ఎంపిక జరుగుతూ ఉంది. చాలా సందర్భాలలో పరిశోధకుడి ఆసక్తి కంటే సామర్థ్యం చాలా ముఖ్యం. పరిశోధకుడు తన శక్తి సామర్థ్యాలను అంచనా వేయకుండా సీనియర్లు, లేదా ఇతర అధ్యాపకులు సూచించిన కొన్ని అంశాలలో తనకు నచ్చిన ఒక అంశాన్ని పరిశోధనకు ఎంపిక చేసుకొని కొంతకాలం పరిశోధించిన తర్వాత అందులో కష్టంగా ఉందని మధ్యలోనే పిహెచ్.డి. పరిశోధనను వదలిపెట్టి వెళ్ళినవారు చాలామంది ఉన్నారు. మరి కొంతమంది పరిశోధకులు కొంతకాలం తర్వాత పూర్తిగా భిన్నమైన అంశాన్ని పరిశోధనకు ఎంపిక చేసుకొని డిగ్రీ కోసం పరిశోధన పూర్తి చేసిన వారు ఉన్నారు. ఫలితంగా పరిశోధనా అంశంలో నాణ్యత కొరవడుతుంది. ఇందుకు ప్రధాన కారణం పరిశోధక అభ్యర్థికి పరిశోధన అంశంపైన సరియైన అవగాహన లేకపోవడం. ఉదాహరణకు ఇటీవల కాలంలో చాలా విశ్వవిద్యాలయాలను అధ్యాపకుల కొరత ఉంది. దీని కారణంగా వ్యాకరణం, విమర్శ, భాషా శాస్త్రాన్ని శాస్త్రీయ పద్ధతులో బోధించే అధ్యాపకులు లేరు. ఫలితంగా విద్యార్థులకు ఆయా అంశాలపై సరియైన అవగాహన లేదు. కొంతమంది విద్యార్థులు ఓరియంటల్ కళాశాలలో చదివిన వారికి ప్రాథమిక పరిజ్ఞానం ఉన్నప్పటికీ పరిశోధనకు కావల్సినంత శిక్షణ లేదు. వ్యక్తిగత అభిరుచి మేరకు ఆయా అంశాలను పరిశోధనకు ఎంపిక చేసుకొని సరియైన మార్గదర్శకం లేకపోవడం వలన ఇబ్బందులు పడిన పరిశోధక విద్యార్థులు చాలామంది ఉన్నారు. ఇక్కడ పరిశోధన అంశం ఎంపికలో వ్యక్తిగత అభిరుచి, ఆసక్తి ఉన్నప్పటికీ ఆలోచన లేకపోవడం వలన పరిశోధనలో నాణ్యత కనిపించదు. వ్యక్తిగత అభిరుచి, ఆసక్తుల కంటే వాస్తవమైన పరిస్థితులను అర్థం చేసుకొని అభ్యర్థి పరిశోధన అంశాన్ని ఎంపిక చేసుకోవాలి.

విశ్వవిద్యాలయాలలో అధ్యాపకులు కొన్ని రంగాలలో నిష్ణాతులుగా ప్రసిద్ధి చెందారు. వారు తమ రంగాలకు సంబంధించిన అంశాలపై పరిశోధన చేసే విద్యార్థులను మాత్రమే పిహెచ్.డి. ప్రవేశాలలో ఎంపికకు ప్రాధాన్యత ఇస్తున్నారు. గతంలో ఈ అంశం ఉత్తమ మైనది. గతంలో చాలామంది అధ్యాపకులు విశ్వవిద్యాలయాలలో ఉండేవారు. అన్ని అంశాలలో నిష్ణాతులైన ఆచార్యులు ఉండటం వలన విద్యార్థులకు వారి అభిరుచులకు అనుకూలంగా ఆయా రంగాలలో నిష్ణాతులైన ఆచార్యుల దగ్గర పరిశోధన చేశారు. ఫలితంగా కొంతమంది చాలా ఉత్తమమైన పరిశోధన గ్రంథాలను వెలువరించే అవకాశం కలిగింది. కానీ ప్రస్తుతం అధిక శాతం విశ్వవిద్యాలయాలలోని తెలుగు శాఖలలో చాలా తక్కువ సంఖ్యలో అధ్యాపకులు ఉన్నారు. ఇటువంటి పరిస్థితులలో పరిశోధన అంశం ఎంపికే పెద్ద సమస్యగా మారింది. గత్యంతరం లేక పర్యవేక్షకుల

అభిప్రాయాల మేరకు పరిశోధన అంశాలను మార్చుకున్న పరిశోధకులు చాలామంది ఉన్నారు.

**స్వతంత్ర ఆలోచన సామర్థ్యం :**

పరిశోధన అంశం ఎంపికలో ఇతరుల అభిప్రాయంతో పాటు స్వతంత్ర ఆలోచన సామర్థ్యం అనేది అత్యంత కీలకమైన లక్షణాలలో ఒకటి. మార్గదర్శకుల నుండి మరియు పండితుల నుండి మార్గనిర్దేశం పొందడం విలువైనదే అయితే, పరిశోధకులు ముఖ్యంగా ఎం.ఏ., తర్వాత ఇతరుల సహాయంపై ఆధారపడటంతో పాటు స్వతంత్రంగా ఆలోచించే సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలి. దురదృష్టవశాత్తు, ప్రస్తుత విద్యావ్యవస్థ తరచుగా విద్యార్థుల స్వతంత్ర ఆలోచన ప్రోత్సహించడంలో విఫలమవుతుంది, దీని వల్ల విద్యార్థులు స్వంత ఆలోచనలకు బదులుగా ఇతరుల మార్గదర్శకంపైన ఆధార పడుతున్నారు. చాలా సందర్భాలలో భావజాలం పేరుతో, కులం, మతం, ప్రాంతం జెండర్ మొదలైన అంశాలకు ప్రభావితులై సొంత ఆలోచనలు వదిలిపెట్టి పరిశోధన అంశాలను ఎంపిక చేసుకుంటున్నారు. ఒక దశ తర్వాత పరిశోధనలు ముందుకు పోలేని సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఈ కారణంగా పరిశోధనను వదిలి వెళ్లిన విద్యార్థుల సంఖ్య చెప్పుకోదగిన స్థాయిలోనే ఉంది. పరిశోధన అంశం ఎంపికలో స్వతంత్ర ఆలోచన సామర్థ్యం పరిశోధకులకు ప్రత్యేకమైన దృక్కోణాలను అన్వేషించడానికి, స్వంత పరికల్పనలను రూపొందించడానికి మరియు సాహిత్యం, భాషాశాస్త్రం లేదా సాంస్కృతిక అధ్యయనాల రంగంలో అసలైన పరిశోధన సామర్థ్యాలను అందిపుచ్చుకోవడానికి అవకాశం కల్పిస్తుంది.

**పరిశోధన అంశం ఎంపికలో పర్యవేక్షకులు, అకడమిక్ సలహాదారులు, ఇతర సభ్యుల పాత్ర :**

విద్యార్థులు ఎం.ఏ. పూర్తి అయిన వెంటనే తక్కువ సమయంలో ఏదో ఒక అంశాన్ని పిహెచ్.డి. ఇంటర్వ్యూ కోసం ఎంపిక చేసుకుంటున్నారు. కేవలం తాత్కాలికంగా ఒక అంశంతో ఇంటర్వ్యూకు హాజరు కావడం ముఖ్యం అనే ఉద్దేశంతో విద్యార్థులు పరిశోధన అంశాన్ని తయారు చేసుకుంటున్నారు. కొంతమంది అధ్యాపకులు విద్యార్థులకు ఏదో ఒక అంశంతో ఇంటర్వ్యూకు వెళ్ళమని, ఎంపికైన తర్వాత పరిశోధనా అంశాన్ని మార్చుకునే సౌలభ్యం ఉందని చెబుతున్నారు. (పులికొండ సుబ్బాచారి పరిశోధన అంశం ఎంపికలో పర్యవేక్షకులు, వివిధ శాఖల పాత్రను గురించి వారి రచనలో వివరంగా పేర్కొన్నారు. ఆ విషయాలను పునరావృతం చేయదల్చుకోలేదు.) వాస్తవానికి పర్యవేక్షకులతో పాటు సలహాదారులు ప్రతి ఆరు నెలలకు ఒకసారి పరిశోధక విద్యార్థుల పరిశోధనను సమీక్షించి తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని యూజీసీ నియమాలు చెబుతున్నాయి. కానీ వాస్తవంగా విశ్వవిద్యాలయాలలో ఈ నియమాలను ఎంతమంది అనుసరిస్తున్నారు అనేది ప్రశ్నార్థకం. ప్రస్తుత నియమావళి ప్రకారం పరిశోధకుడు తన పరిశోధన అంశాన్ని ఎప్పుడైనా మార్చుకునే సౌలభ్యం ఉంది. వాస్తవంగా అధిక శాతం మంది పరిశోధకులు ప్రారంభ కాలంలో సరియైన శ్రద్ధ చూపకపోవడం, పరిశోధన సమయం ముగిస్తున్న సందర్భంలో కేవలం డిగ్రీ కోసం సిద్ధాంత గ్రంథాన్ని పూర్తి చేయడం జరుగు తున్నటువంటి వాస్తవం. ఇటువంటి పరిస్థితులలో పర్యవేక్షకులు, సలహాదారుల పాత్ర కాగితాలకే పరిమితమైపోతుంది. ఫలితంగా పరిశోధన అంశం ఎంపికే సమస్యగా మారుతుంది. చివరికి పిహెచ్.డి. డిగ్రీ పూర్తయిన తర్వాత పరిశోధనా అంశంలోని లోపాల గురించి ఆలోచించిన పరిశోధకులు చాలామంది ఉన్నారు.

**స్వీయ తప్పిదాలను గుర్తించడం :**

పరిశోధకుడికి అవసరమైన మరొక ముఖ్యమైన లక్షణం స్వీయ తప్పిదాలను గుర్తించడం, ఆ తప్పులను సరిదిద్దుకోవడానికి సిద్ధంగా ఉండటం. పరిశోధన ప్రక్రియ స్వభావతః క్లిష్టమైంది. ఇందులో శాస్త్రీయ పద్ధతి, విశ్లేషణ, వివరణ.. మొదలైన అంశాలలో తప్పులు ఉండవచ్చు. కొన్ని సందర్భాలలో పరిశోధన అంశం ఎంపిక చేసుకున్నప్పుడు అందులో అతివ్యాప్తి లేదా అవ్యాప్తి ఉండే అవకాశాలు ఉన్నాయి. కొన్ని సందర్భాలలో పరిశోధన ప్రారంభించిన తరువాత పరిశోధన అంశంలో ఉన్న సమస్యలు వెలుగులోకి వస్తాయి. ఒక నిజమైన పరిశోధకుడు తన పనిని సవరించడానికి, నిర్మాణాత్మక విమర్శలను అంగీకరించడానికి, మరింత పరిశోధన ప్రాథమిక లోపాలను బహిర్గతం చేస్తే తన పరిశోధన విషయాన్ని పునఃపరిశీలించ డానికి సిద్ధంగా ఉండాలి. యుజిసి వారు ఆరు నెలలకు ఒకసారి పరిశోధకుల పరిశోధనలను సమీక్షించమని సూచించడానికి ముఖ్య కారణం పరిశోధకుల పరిశోధన సమస్యలను సరిదిద్దడం. ఇటువంటి విధానం వలన పరిశోధన సమస్యను సరైన పద్ధతులు గుర్తించడంతో పాటు తర్వాత కాలంలో పరిశోధనా ఫలితాలు ఉత్తమంగా ఉండేలా చూస్తుంది. తప్పులను వైఫల్యాలుగా కాకుండా, పరిశోధకులు వాటిని లోతైన అవగాహనకు అవకాశాలుగా పరిగణించాలి.

**పరిశోధన ఖాళీలను గుర్తించడం :**

భాషా సాహిత్యాలలో పరిశోధనా అంశాన్ని ఎంపిక చేసుకున్నప్పుడు పరిశోధన ఖాళీలను గుర్తించడం అనేది అత్యంత ముఖ్యమైన విషయం. పరిశోధన తెంచుకున్న అంశంపై సూక్ష్మమైన అవగాహన అవసరం. తెలుగులో ఇప్పటివరకు వందల సంఖ్యలో పరిశోధన గ్రంథాలు వెలువడ్డాయి. అయినప్పటికీ తెలుగు పరిశోధకులు స్పృశించాల్సిన అంశాలు ఎన్నో ఉన్నాయి. ఉ దాహరణకు తెలుగేతర ప్రాంతాలకు చెందిన రచయితల రచనలపై పెద్దగా పరిశోధన జరగలేదు. దాసరి అమరేంద్ర, వాకాటి పాండురంగా రావు, ఎన్. కామేశ్వరరావు, రేవూరి అనంత పద్మ రావు, టి.సంపత్ కుమార్ మొదలైన వారు దాదాపు 40

సంవత్సరాలకు పైగా ఢిల్లీలో ఉంటూ తెలుగులో రచనలు చేశారు. వారు ఢిల్లీ నుంచి రచనలు చేశారు కానీ వారి రచనలకు సంబంధించిన పరిశోధన ఎక్కడ కనిపించదు. తెలుగు సాహిత్యానికి ఢిల్లీ ప్రాంత వాసులు చేసిన సేవ గురించి ఒక ఉత్తమమైన పరిశోధన గ్రంథాన్ని వెలువరించవచ్చు. అలాగే ముంబాయి, బరంపురం, కర్ణాటక, ఆస్ట్రేలియా, సింగపూర్.. మొదలైన ప్రాంతాల నుంచి వెలువడుతున్న సాహిత్యాన్ని పరిశోధనకు స్వీకరించవచ్చు.

**అన్వేషించని సాహిత్య ప్రక్రియలు :**

తక్కువగా అధ్యయనం చేయబడిన లేదా ప్రాచుర్యం లేని సాహిత్య ప్రక్రియల పైన పరిశోధన చేయవచ్చు. ఉదాహరణకు యాత్ర సాహిత్యం. యాత్రా సాహిత్యం పైన సమాచార సేకరణకు సంబంధించిన పరిశోధన గ్రంథాలు మాత్రమే వెలువడ్డాయి. యాత్ర ప్రక్రియకు సంబంధించిన సిద్ధాంతాలను అన్వయం చేసి పరిశీలించి నట్లయితే ఉత్తమమైన పరిశోధనా గ్రంథాలు వెలువడే అవకాశం ఉంది. అలాగే జీవిత చరిత్రలు ఆత్మ చరిత్రల ప్రక్రియలకు ప్రత్యేకమైన అధ్యయన సిద్ధాంతాలు ఆంగ్లంలో ఉన్నాయి. ఆయా సిద్ధాంతాలను తెలుగు భాషలో ఉన్న ఆత్మ చరిత్రలు/ జీవిత చరిత్రలకు అన్వాయం చేస్తూ పరిశోధన గ్రంథాలను వెలువరించవచ్చు. **'కదంబం తెలుగు సాహిత్య ప్రక్రియలు రూపాలు'** అనే గ్రంథంలో 82 ప్రక్రియలకు సంబంధించిన అంశాలపై వ్యాసాలు ఉన్నాయి. తెలుగులో కవిత్వం, కథ, నవల, జానపదం.. ఇలా కేవలం అది కొద్ది ప్రక్రియల పైన మాత్రమే ఎక్కువగా పరిశోధన గ్రంథాలు వెలువడ్డాయి. దాదాపు 50 కి పైగా ప్రక్రియలను భిన్న సిద్ధాంతాలతో అధ్యయన పద్ధతుల్లో పరిశోధన చేస్తే కావల్సినంత సమాచారం పరిశోధనకు మిగిలే ఉంది.

**కాలపరిమితి మార్పులు :** సమాజంలో కొత్త సందర్భాలు వచ్చిన ప్రతి సందర్భంలో వివిధ రకాలైన సాహిత్యం వెలువడింది. అందుకు అనుగుణంగా సాహిత్యాన్ని కొలిచే పరికరాలు మారుతూ ఉన్నాయి. ఉదాహరణకు కరోనా కాలంలో తెలుగులో వివిధ ప్రక్రియల్లో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ కరోనా చెప్పిన ప్రభావాన్ని వివరిస్తూ విస్తృతంగా సాహిత్యం వచ్చింది.. ఆ సాహిత్యాన్ని భిన్న కోణాల నుంచి విశ్లేషించే అవకాశం ఉంది. అలాగే అంతర్జాలంలో విస్తృతంగా సాహిత్యం లభిస్తుంది. ఆంగ్లంలో అంతర్జాల సాహిత్యాన్ని విశ్లేషించే పద్ధతులు సిద్ధాంతాలు చాలా వచ్చాయి. కానీ తెలుగులో ఇప్పటివరకు నాలుగు సిద్ధాంత గ్రంథాలు (నా అవగాహన మేరకు) కనిపిస్తే, ఆ సిద్ధాంత గ్రంథాల్లో కేవలం సమాచార సేకరణకు పరిచయానికి మాత్రమే పరిమితమయ్యాయి.

**సాహిత్య సాంస్కృతిక సిద్ధాంతాలను అన్వయం :**

సాహిత్య సాంస్కృతిక సిద్ధాంతాలను అన్వయం చేస్తూ పలు పరిశోధన గ్రంథాలు వెలువడ్డాయి. కానీ ప్రస్తుత సమాజానికి సిద్ధాంతాలను అన్వయం చేయడంతో పాటు వాస్తవం ప్రపంచంతో తులనాత్మకంగా పరిశీలించి పరిశోధన చేయడం ద్వారా మెరుగైన ఫలితాలను పొందవచ్చు. ఈ రకమైన పరిశోధన సామాజిక, రాజకీయ మరియు సాంస్కృతిక సందర్భాలలో మానవ అనుభవాలను అర్థం చేసుకోవడానికి ఒక సాధనంగా మారుస్తుంది.

ఫెమినిస్ట్ సిద్ధాంతాన్ని రచనలకు అనుభవించడంతోపాటు పని స్థలాల్లో జెండర్ సమానత్వాన్ని అర్థం చేసుకోవడానికి ఏ రకమైన పద్ధతుల అవలంబిస్తున్నారు కార్పొరేట్ విధానాలలో జెండర్ దృక్పథం ఏమిటి మొదలైన విషయాలు తెలుసుకోవడానికి ఈ రకమైన పరిశోధన పద్ధతి ఎంతో సహాయపడుతుంది. మార్క్సిస్ట్ సిద్ధాంతాన్ని ఉపయోగించి ఇక్కడ నేపథ్యంలో కార్పొరేట్ శక్తుల విధానాలను విమర్శనాత్మకంగా పరిశీలించడానికి సహాయపడుతుంది. ఉత్తర వలసవాద సిద్ధాంతం (Postcolonial Theory) వలసవాదం యొక్క సామాజిక, సాంస్కృతిక మరియు మానసిక ప్రభావాలను అధ్యయనం చేస్తుంది. ఈ సిద్ధాంతాన్ని ఉపయోగించే పరిశోధన చేయడం ద్వారా ప్రవాస సంస్కృతి, సాహిత్యంలో వచ్చిన మార్పులను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. అస్తిత్వవాద సిద్ధాంతం (Existentialism) మానవుడి స్వేచ్ఛ, బాధ్యత మరియు జీవితం యొక్క అర్థాన్ని అన్వేషిస్తుంది. ఈ సిద్ధాంతం అన్వయం చేయడం ద్వారా వ్యాపార యుగంలో, ఆధునిక జీవితంలో ఒంటరితనం, మానసిక ఆందోళన వంటి సమస్యలను అర్థం చేసుకోవడానికి సిద్ధాంతం ఎంతగానో ఉపయోగపడుతుంది. ముఖ్యంగా యువత ఉద్దేశ్యం, వారి లక్ష్యాలు, జీవన విధానం మొదలైన వాటిని అర్థం చేసుకోవడంలో ఈ సిద్ధాంతం ఎంతగానో ఉపయోగపడుతుంది. తెలుగులో నిర్మాణవాదం, ఉత్తర నిర్మాణవాదం (Structuralism & Post-Structuralism) మొదలైన సిద్ధాంతాలను అన్వయం చేసి పరిశోధన చేసిన వారు చాలా తక్కువమంది ఉన్నారు. ఈ నిర్మాణవాదం, ఉత్తర నిర్మాణవాదం సిద్ధాంతాలు భాష, సంస్కృతి మరియు సామాజిక నిర్మాణాలను విశ్లేషించే ప్రయత్నం చేస్తాయి. ప్రసార సాధనాలు, సామాజిక మాధ్యమాలు మొదలైన సమాచారం ఏ రకంగా సమాజాన్ని ఏ రకంగా మార్పులకు లోను చేస్తుందో అర్థం చేసుకోవడానికి ఈ సిద్ధాంతాలు ఎంతగానో సహాయ పడతాయి. ముఖ్యంగా ప్రస్తుతం రాజకీయ విధానాలు జాతీయ భావనలు మొదలైన వాటిని విశ్లేషించడంలో ఈ సిద్ధాంతాలు సహాయపడతాయి. సాహిత్యం మరియు పర్యావరణం మధ్య సంబంధాన్ని అధ్యయనం చేయడానికి పర్యావరణ విమర్శ (Ecocriticism), వ్యక్తి మనస్తత్వం, కోరికలు మరియు మానసిక సంఘర్షణలను, ఆరోగ్య సమస్యలను విశ్లేషించడానికి మనోవైజ్ఞానిక సిద్ధాంతం (Psychoanalytic Theory) ఉపయోగపడుతుంది. ఇటీవల కాలంలో ఆంగ్లంలో ఎన్నో నూతన సిద్ధాంతాలు ఉన్నాయి వాటిని తెలుగు సాహిత్యానికి అన్వయం చేసి విశ్లేషించడం ద్వారా

నూతన విమర్శనా ఫలితాలు వెలువడతాయి. ఈ సిద్ధాంతాలను వాస్తవ జీవితానికి అన్వయం చేయడం ద్వారా మరింత సమతుల్యమైన సమాజాన్ని నిర్మించే ప్రయత్నం చేయవచ్చు.

సంస్కృత కావ్య శాస్త్రాన్ని అన్వయం చేసి తెలుగు సాహిత్యాన్ని విస్తృతంగా పరిశోధించారు. కానీ తమిళ కావ్య శాస్త్రాన్ని తెలుగు సాహిత్యానికి అన్వయం చేసిన పరిశోధనలు పెద్దగా కనిపించలేదు. తమిళ తెలుగు భాషలు దగ్గరగా ఉన్నాయి. సాంస్కృతికంగా ఏదో ఒక రూపంలో సంబంధాలు ఉన్నాయి కానీ సాహిత్య పరిశోధనలో తమిళ కావ్య శాస్త్ర ప్రస్తావన ఎక్కడా కనిపించదు. ఈ దృక్పథంతో పరిశోధన చేయవలసిన ఆవశ్యకత ఉంది.

**టెలివిజన్ మరియు సినిమా ప్రభావం :** తెలుగు సినిమా రంగం యొక్క అభివృద్ధి, ముఖ్యంగా తెలుగు సినీ పరిశ్రమ ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందటం, ఆధునిక తెలుగు సాహిత్యం పై సినిమా ప్రభావాన్ని అధ్యయనం చేయడం ఒక ఆసక్తికరమైన పరిశోధనా అంశం. సినిమా రూపకల్పనలో సాహిత్య రచన, పాఠకుల అంగీకారం మరియు సృజనాత్మకతపై ఎలా ప్రభావం చూపిస్తుందో తెలుసుకోవడం అవసరం.

Research in Literature and Language Philosophy, Areas and Methodology అనే గ్రంథంలో H. V. Deshpande ఉత్తమ పరిశోధనా అంశం ఎంపికకు 10 అంశాలను సూచించారు. ఈ అంశాలు పరిశోధన నైపుణ్యాలను మెరుగుపరచడంతో పాటు, లోతైన పరిశోధన చేయడానికి ఉపకరిస్తాయని పేర్కొన్నారు.

**1. ముందుగా చదవడం**

పరిశోధకుడు పరిశోధన పంపించడానికి పూర్వమే సంబంధిత పుస్తకాలు, వ్యాసాలు, పరిశోధన పత్రాలను చదవడం అవసరం. ఈ అధ్యయనం పరిశోధకుడు పరిశోధించాలనుకుంటున్న అంశంపై మంచి అవగాహన ఏర్పరచుకోవడానికి ఉపకరిస్తుంది. ఈ అవగాహన వలన పరిశోధకుడికి కొత్త ఆలోచనలు, పద్ధతులు, మరియు దృష్టికోణాలు తెలుస్తాయి అలాగే, గతంలో చేసిన పరిశోధనలు ఏమిటో తెలుసుకోవడం ద్వారా, పరిశోధకుడికి ఏది కొత్తగా చేయాలో, ఎక్కడ నుంచి పరిశోధన మొదలు పెట్టాలో తెలుసుకుంటారు.

**2. పరిశోధన లక్ష్యం & విధానం స్పష్టత**

పరిశోధన ప్రారంభించే ముందు పరిశోధకుడు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం అవసరం. పరిశోధన విధానం కూడా స్పష్టంగా ఉండాలి, అంటే పరిశోధకుడు గమనించే అంశాలు, విశ్లేషణలు సాధించదలచిన ఫలితాల స్పష్టమైన అవగాహన ఉండాలి అవగాహన ఏర్పరచుకోవాలి.

**3. స్పష్టమైన శీర్షిక ఎంపిక**

పరిశోధన శీర్షిక ఒక పరిశోధన లక్ష్యం, ప్రాముఖ్యతను వివరిస్తుంది. స్పష్టమైన శీర్షిక పరిశోధకుడు చేయదలచిన పరిశోధనను సులభంగా అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది. తక్కువ పదాల్లో పెద్ద ఆలోచన లేదా ప్రయోజనాన్ని వ్యక్త పరచడం శీర్షిక యొక్క ప్రధాన లక్ష్యం.

**4. అవసరమైన సమాచార వనరులపై పూర్తిస్థాయి అవగాహన అవసరం**

పరిశోధన మొదలయ్యే ముందు, పరిశోధకుడికి అవసరమైన వనరులపై (పుస్తకాలు, వ్యాసాలు, ఇతర సమాచార వనరులు) పూర్తి అవగాహన ఉండాలి. కొంతమంది పరిశోధకులు డిజిటల్ వనరుల ద్వారా సరైన సమాచారం అందుకుంటారు, మరికొందరు ముద్రిత వనరులను ప్రాధాన్యమిస్తూ ఉంటారు. మరి కొంతమంది పరిశోధకులు మౌఖిక సమాచారం పై పరిశోధన చేస్తూ ఉంటారు. ఇవి ఎక్కడ లభిస్తాయో ముందుగా తెలుసుకోవడం అవసరం.

**5. పర్యవేక్షకుడి ఆసక్తి & నైపుణ్యం**

పరిశోధకుడు పరిశోధన చేయడానికి పర్యవేక్షకులను సంప్రదించినప్పుడు వారి ఆసక్తి, నైపుణ్యం చాలా ముఖ్యం. కొంతమంది ఆచార్యులకు కొన్ని అంశాల పైన నైపుణ్యం ఉంటుంది. ఆయా రంగాలలో వారు నిష్ణాతులు. వారు గతంలో చేసిన పరిశోధన, వారి నైపుణ్యాలు పరిశోధకుడి పరిశోధనకు ఎంతగానో ఉపయోగపడతాయి. కొంతమంది పర్యవేక్షకులకు కొన్ని అంశాల పైన పూర్తి అవగాహన లేకపోయినా పరిశోధకులతో సమానంగా చదివి, కొత్త విషయాలు నేర్చుకొని పరిశోధకుడిని మార్గదర్శకం చేయగలిగిన వారు ఉంటారు. అటువంటి పర్యవేక్షకులు పరిశోధకులతో సమానంగా పనిచేయాల్సి ఉంటుంది. పరిశోధకుడికి చివరి వరకు ఉత్తమ మార్గదర్శకం ఇవ్వగలిగేవారు ఉత్తమ మార్గదర్శకులుగా మిగిలిపోతారు. లేకపోతే పరిశోధకుడు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది.

**6. భవిష్యత్తులో ప్రచురణ అనుకూలత**

పరిశోధకుడు చేసే పరిశోధన భావి పరిశోధకులకు ఉపయోగపడతుందని, దాని ఫలితాలు ముద్రణ రూపంలో ప్రచురించడానికి అవకాశం ఉందా అనే విషయాన్ని పరిశోధకుడు ఆలోచించాలి. పరిశోధకుడు ఎంపిక చేసుకునే అంశం, అభిప్రాయాలు, మార్గదర్శకాలు, పరిశోధన పత్రాలు భవిష్యత్తులో ముద్రణకు అనుకూలంగా ఉండాలి. పరిశోధకుడు ఈ విషయాలను ముందుగా అర్థం చేసుకోవడం చాలా అవసరం.

**7. గత పరిశోధనలపై అవగాహన**

గత పరిశోధనలపై అవగాహన కలిగి ఉండటం అనేది ఒక ముఖ్యమైన దశ. గత పరిశోధనలలో పరిశోధకులు ఏ ఏ అంశాలపై

పరిశోధించారు? గత పరిశోధకులు పరిశోధనలో ఏమైనా కొత్తదనాన్ని చేర్చారా? అని పరిశీలించడం వల్ల, నూతన పరిశోధకుడి పరిశోధన మరింత విలువైనదిగా మారుతుంది.

**8. పరిశోధన కోసం సమయ నిర్వహణ**

పరిశోధన సమయం పరిమితం ఉంటుంది. పరిశోధకుడు చాలా సమయాన్ని సృజనాత్మకంగా, క్రమబద్ధంగా పనిచేయడం ద్వారా మంచి ఫలితాలను పొందగలుగుతారు. పరిశోధకుడు సరైన సమయ ప్రణాళికను రూపొందించుకోవడం, వాయిదా వేసే విషయాలు లేకుండా, గడువు ప్రకారం పూర్తిచేసేలా చూసుకోవడంలో సాయపడుతుంది.

**9. అన్వయ నైపుణ్యం**

పరిశోధకుడి పరిశోధన ఇతర పరిశోధనలకు లేదా సామాజిక అవసరాలకు ఎలా ఉపయోగపడుతుందో తెలుసుకోవడం చాలా ముఖ్యం. పరిశోధకుడు చేయాల్సిన పరిశోధన శాస్త్రీయ పరిధిలో మాత్రమే కాకుండా, దాని ప్రభావం సమాజం లేదా ఇతర రంగాలపై కూడా ఉండాలి. ఈ దృష్టి కోణం పరిశోధనను మరింత విలువైనదిగా మారుస్తుంది.

**10. పరిశోధకుడి ఆసక్తి, సంతృప్తి ముఖ్యం**

పరిశోధకుడు ఒక మంచి పరిశోధన అని గర్వపడేలా అనిపించే అంశాన్ని పరిశోధించటం అనేది చాలా ముఖ్యం. ఇది పరిశోధన చేసే సమయంలో పరిశోధకుడు చేసే కృషిని ఇంకా ఉత్తమంగా చేయడానికి ప్రేరణ ఇస్తుంది. ఇతరుల ఆసక్తి వల్ల కాకుండా, పరిశోధకుడి వ్యక్తిగత ఆసక్తి వల్ల తనకు అనుకూలమైన పరిశోధనను తీసుకోవడం ముఖ్యం. ఆయా శాఖలో ఉన్న అధ్యాపకులకు అనుకూలంగా, లేదా శాఖలను పనిచేసే అధ్యాపకుల ప్రాజెక్టుల కోసం పరిశోధనలు ఎంపిక చేసుకున్నట్లయితే పరిశోధకుడు జీవితాంతం బాధపడవలసి వస్తుంది. కొన్ని సందర్భాలలో మనం ఎంపిక చేసుకున్న పరిశోధన అంశం భవిష్యత్తులో మనం ఎంచుకునే రంగానికి అవసరమైనది గా ఉండాలి.

**ముగింపు :**

తెలుగులో పరిశోధన అంశం ఎంపికలో ఉన్న సంక్లిష్టతలు, గుర్తించని ఖాళీలపై దృష్టి సారించడం ఎంతో అవసరం. తెలుగు పరిశోధనలో మంచి పరిశోధనా అంశం ఎంచుకోవడం అనేది ఒక ప్రధానమైన అంశం. ఎందుకంటే ఈ అంశం పరిశోధన యొక్క నాణ్యతను మరియు దాని ప్రభావాన్ని నిర్ణయిస్తుంది. పరిశోధకులు తమ అభిరుచి, సామర్థ్యాలను నిష్పాక్షికంగా విశ్లేషించుకోవాలి. విశ్వవిద్యాలయాలలో శిక్షణ తరగతులకు హాజరుకావడం, పరిశోధన నైపుణ్యాలను పెంపొందించుకోవడం, పర్యవేక్షకులు, పరిశోధకులతో చర్చల ద్వారా పరిశోధనలో ఖాళీలను గుర్తించవచ్చు. సాంప్రదాయిక, ఆధునిక అంశాల మధ్య సమతుల్యతను పాటించడం ద్వారా మంచి పరిశోధనాంశాలను పరిశోధకుడు ఎంపిక చేసుకుని అవకాశం ఉంది.

**ఉపయోగించుకున్న పుస్తకాలు**

1. జయప్రకాష్, ఎస్. పరిశోధనా విధానం. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2011. (1990)

2. సుబ్బాచారి, పులికొండ. పరిశోధనా విధానం సిద్ధాంత గ్రంథ రచన. 2014.

3. అప్పారావు, గంధం. పరిశోధన పద్ధతులు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1995.

ఆంగ్లం : Deshpande, H. V. Research in Literature and Language: Philosophy, Areas and Methodology. Notion Press, 2018.

**'కదంబం'**

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే ఉత్తమ గ్రంథం 'కదంబం'.

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

**మూసీ**

**సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక**
**మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి**
**వెంటనే శాశ్వత చందాదారులు కండి.**
**సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక**
**యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక**
**శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-**
**సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5 33 హైదరాబాద్ ఏప్రిల్ : 2025

# తెలంగాణ కథ – స్థానిక స్పృహ

**భూక్యా ప్రమీల,** తెలుగు శాఖ, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్. ఫోన్ : 6281 889 426

జాతీయత, ప్రాంతీయత, స్థానికత అనే పదాలు సాహిత్యంలో తరచుగా వినబడుతుంటాయి. ఆంగ్లములో జాతీయతను 'Nationality' అని, ప్రాంతీయతను Regional. స్థానికతలను Local/ Native అని సమానార్థకాలుగా వాడుచున్నాం.

**"ఏ జాతి అయినా తన మూలాల్లోకి అన్వేషించుకుంటూ వెళ్ళడం స్థానికతగా భావించవచ్చు. మరి జాతీయతను స్థానికతగా భావించవచ్చున్న సందేహం రావచ్చు. జాతీయతను ఇప్పుడు ఒక ఆధిపత్య భావనగా భావించే స్థితి కూడా వుంది. హెూమీ జె.బాబా లాంటి వారు జాతీయతను ఒక కాల్పనికమైన సరిహద్దుగానే భావించారు. ఒక రాజకీయ ప్రయోజనం కోసం మాత్రమే జాతీయతను తీసుకోగలమని ఆయన వుద్దేశం. అయితే జాతీయతను 'గేట్ ట్రెడిషన్'గా, స్థానికతను 'లిటిల్ ట్రెడిషన్'గా సామాజిక పరిభాషలో వివరించారు. ఇది వర్తమాన 'భాషా' సాహిత్యదృక్పథం నుంచి సరైందిగా కనిపిస్తుంది. 'గ్రేట్ ట్రెడిషన్' మొత్తం జాతీయతని సాధారణీకరిస్తుంది. అలాంటి సాధారణీకరణకి పూర్తిగా భిన్నమైన ధోరణి స్థానీకరణ"** (కథ– స్థానికత, అఫ్సర్, పుట: 19.) అని అఫ్సర్ భావించినట్లుగా సాధారణీకరించడానికి వీలులేని ఒక ప్రత్యేకమైన ధోరణియే 'స్థానికత'గా అర్థం చేసుకోవచ్చు.

నేటి ఆధునిక సాహిత్య ప్రక్రియలన్నింటిలోను స్థానికత బలంగా నాటుకొని పోయింది. తెలంగాణ సాహిత్యంలో కవిత, పాట, నాటకం, కథ ప్రక్రియలలో నేడు స్థానికత ప్రాధాన్యతను సంతరించుకుంది.

**"భారతీయ భాషా సాహిత్యాలలో అత్యాధునికత వేర్వేరు పేర్లతో (అత్యాధునికత/ఉత్తరాధునికత/ఆధునికోత్తరవాదం) వ్యవహరించ బడినా లోపలి సారం మాత్రం దాదాపు ఒక్కటే. భారతీయాంగ్ల కవులూ రచయితలూ దాన్ని 'ఇండియన్ నెస్' అన్నారు. భారతీయత అంటే నిర్దిష్టమైన స్థల పరిమితులు సాహిత్యానికి తప్పనిసరి అయ్యాయన్న మాట. ఈ స్థల నిర్దిష్టత సాధించడానికి మొదట మనపైన పనిచేసే తక్షణ ప్రభావాల నుంచి బయటపడాలి"** (కథ– స్థానికత, అఫ్సర్, పుట:15.) అని అఫ్సర్ భావన.

ఆధునిక సాహిత్యంలో భాష పరంగా చూస్తే సృజనకారులు తమ స్థానికభాషను రచనల్లో వాడటానికి ఏ మాత్రం జంకడం లేదు. తమ పరిధిలోని మాండలిక భాషను సాహిత్యంలో వ్యక్తం చేస్తూ, అంతరించిపోతున్న స్థానిక భాష సొగసును విభిన్న ప్రక్రియల్లో ప్రస్ఫుటం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. సాహిత్యాన్ని విశ్వజనీనం చేసే క్రమంలో వాస్తవికతను ప్రతిఫలిస్తూ స్థల కాలాల స్పృహతో రచనలు చేస్తున్నారు.







**"స్థానిక అభివ్యక్తి అనేది భాషకి, శిల్పానికి సంబంధించినది మాత్రమే కాదు. ఆయా ప్రాంతాల సమస్త అంశాల విశిష్టతకి కూడా స్థానం ఉంటుంది. భౌగోళిక ప్రత్యేకతలు, ప్రజల జీవన విధానం, వనరులు, పంటలు, పరిశ్రమలు మొదలైనవి మిగతా ప్రాంతాలకి భిన్నంగా సొంతముద్రని కలిగి ఉంటాయి. ఇవన్నీ తప్పనిసరిగా సాహిత్యంలో ప్రతిఫలిస్తాయి. కాబట్టి ఒక రచనలో స్థానికత, సార్వత్రికత అనేవి ఒకదానితో మరొకటి ముడిపడి వుంటాయి"** (ఉత్తరాంధ్ర కథా స్థానీయత సాహిత్య వ్యాసాలు, మల్లీశ్వరి, పుట: 2.) అని మల్లీశ్వరి పేర్కొన్నారు.

ఒక విశాలమైన భౌగోళిక ప్రాంతం ప్రాంతీయత అయితే అందులో కొంత భాగము స్థానికత. ప్రాంతీయతలో స్థానికత అంతర్భాగమని చెప్పవచ్చు. **"అస్తిత్వ ఉద్యమాల రాకతో సాహిత్యంలో సూక్ష్మమైన అంశాలను వాటి ఉనికి ఆధారంగా గుర్తించి మాట్లాడటం మొదలయ్యింది. స్థానికత రాజకీయ ప్రతిపత్తిని సాధించి ప్రాంతీయత అయింది. ప్రాంతీయ ఉద్యమాల ప్రభావంతో స్థానికాంశాలన్నీ పునర్నిర్వచనాన్ని పొందుతున్నాయి. తమ ప్రాంతం, తమ సంస్కృతి, తమ భాష, యాసలు, తమ ఆచార వ్యవహారాలను ఆత్మగౌరవ పరిధిలోంచి చూడటం వలన స్థానీయత కొత్త శక్తిని పుంజుకుంది. ప్రపంచీకరణకి విరుగుడు స్థానికతేనన్న వాదనా జోరందుకుంది."** (ఉత్తరాంధ్ర కథా స్థానీయత, ముందుమాట, మల్లీశ్వరి) అని మల్లీశ్వరి పేర్కొనడాన్ని బట్టి ప్రాంతీయత రాజకీయ ప్రతిపత్తి గలిగినదైతే స్థానికత అందులో పార్శ్వమని విదితమగుచున్నది.

**"ప్రాంతీయ అస్తిత్వ చైతన్యంలో విశ్వజనీనతతో పాటు స్థానీయత కూడ నిక్షిప్తం అవుతూ ఉంటుంది. కేవలం రాష్ట్ర స్థాయీ, జాతీయ స్థాయి, భాషా స్థాయిల్లోనే కాకుండా జిల్లా స్థాయిలో కూడా తరతమ**

**భేదాలు, స్థల కాలాలు, కులాల మధ్య ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక అంతరాలు, వైరుధ్యాలు ప్రాంతీయ స్పృహలో తేడాలు స్పష్టంగా గోచరిస్తాయి. ఉదాహరణకు వర్గ దృక్పథంతో ఆలోచించినప్పుడు వారి ప్రాంతీయ స్పృహకు భిన్నంగా ఉంటుంది. ఈ రెండు వర్గాల ప్రయోజనాలు వేరు కనక, రెండింటి ప్రాంతీయ స్పృహల మధ్య వైరుధ్యం, సంఘర్షణ కూడ కొనసాగుతుంది"** (తెలంగాణ కథ – ప్రాంతీయ అస్తిత్వం, వ్యాసం, బి.యస్.రాములు, సం॥వెల్దండి శ్రీధర్, పుట:16) అని బి.ఎస్. రాములు పేర్కొన్నట్లుగా స్థానికతలో వైరుధ్యాలు స్పష్టంగా గోచరిస్తాయి. ఉదాహరణకు రాష్ట్ర రాజధానియైన హైదరాబాద్ నగరానికి మారుమూలలో ఉన్న ఆదిలాబాద్ జిల్లాకు స్పష్టమైన వైరుధ్యాలు కనిపిస్తాయి. అట్లాగే బొగ్గు గనులున్న నాలుగైదు ప్రాంతాలకు, బొగ్గు గనులు లేని జిల్లాలకు ఈ తేడా గమనించవచ్చు.

తెలంగాణ ఉద్యమం వచ్చినపుడు, దాన్ని ఉప ప్రాంతీయ ఉద్యమమని కొందరు వ్యవహరించారు. నిజానికి అస్తిత్వాన్ని సమకూర్చే భౌగోళిక ప్రాతిపదికను ప్రాంతీయత అనడం కంటే ప్రాదేశికతకత అనడం సబబు. కానీ, ఆ మాటకు ఇంకా ప్రాచుర్యం రాలేదు. ప్రాదేశికతలో ప్రాదేశీకుల అస్తిత్వాన్ని నిర్ణయించేది 'స్థానికత'. అని డా॥ కె. శ్రీనివాస్ పేర్కొనడాన్ని బట్టి ప్రాంతీయత, స్థానికతకు మధ్య ఉన్న స్వల్పమైన తేడా కనిపిస్తుంది.

**"స్థానిక అస్తిత్వం, స్థానిక స్పృహ, స్థానిక ప్రతిపత్తి ఇలాంటివన్నీ 1980ల తర్వాతే నిర్దుష్టమయిన అర్థంలో తెలుగు సాహిత్యంలోకి ప్రవేశించాయి. అలాగే స్థానికతకీ ప్రాంతీయతకీ ఉండే తేడా కూడా అప్పుడే నిర్వచించుకోవడం జరిగింది."** (ఉత్తరాంధ్ర కథా స్థానీయత (సాహిత్య వ్యాసాలు); మల్లీశ్వరీ, పుట:59)

తెలుగు సాహిత్యంలో ఆధునిక తెలంగాణ కథ ఆవిర్భవించి నూట ఇరవై ఏళ్ళు గడిచాయి. ఆది నుంచి తెలంగాణ కథ కాల్పనికత కన్నా వాస్తవికతకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం వల్ల నేల విడిచి సాము చేయని కథగా పాఠకులచే ఆదరణ పొందింది. తెలంగాణ ప్రజా జీవనంలోని సంక్షోభాలు, అవిద్య, పేదరికం, అమాయకత్వం, వివక్ష, పీడన మున్నగు అనేక స్థానికాంశాలు ఇక్కడి కథల్లో ప్రస్ఫుటమైనాయి. తెలంగాణ తొలితరం కథకులు ఇక్కడి స్థానిక సమస్యల్ని తమ కథల ద్వారా వెల్లడించారు.

**"ఉపరితలం నుంచి చూస్తే ప్రాంతీయ అస్తిత్వ భావనల్లో భాగంగా సాహిత్యంలోకి స్థానిక స్పృహ ప్రవేశించినట్లు కనబడుతుంది. కానీ స్థానికత మూలాల్లోకి వెళ్ళిచూసినపుడు సాహిత్యం పుట్టుక, స్థానికత పుట్టుక భిన్న కాలాలకి చెందినవి కావు. ప్రతి రచనా అది ఏ కాలానికి చెందినదయినా ఒక ప్రాంత భౌగోళిక స్థితిగతులను, ప్రజల ఆచార వ్యవహారాలను, ఆయా సమాజాల విలువలను వాహిక చేసుకొని వెలువడుతుంది. కాబట్టి ప్రతి రచనా ఒక స్థానిక వ్యక్తీకరణే."** (ఉత్తరాంధ్ర కథా స్థానీయత, ముందుమాట) అని మల్లీశ్వరీ పేర్కొన్నట్లుగా తెలంగాణ కథా సాహిత్యంలో తొలితరం నుండి నేటి వరకు వెలువడిన కథలో కథా రచయితలు స్థల కాలాల స్పృహతో కథలు వెలువరించారు. కాబట్టే ఇక్కడి కథలు తెలంగాణ సామాజిక చరిత్రకు వ్యాఖ్యానాలుగా నిలుస్తున్నాయి.

**"కథానికలో స్థానికత అంశంతో ముడిపడి వున్న మరో ముఖ్య విషయం ప్రాంతీయత. నిర్దిష్టమైన స్థలం. అంటే ఊరూ, పల్లె, పట్నం, పేరు చెప్పక పోయినా ఆ కథ జరుగుతున్న ప్రాంత నేపథ్యం కథంతా పరచుకొని ఉంటుంది."** (కథ– స్థానికత; వ్యాసం, విహారి; తెలుగులో తొలి వెబ్ పత్రిక.) అని విహారి పేర్కొన్నట్లుగా తెలంగాణ కథ ఆది నుండి ఈ ప్రమాణాన్ని పాటించింది. తెలంగాణ కథకులు ప్రతినిత్యం తాము చూస్తున్న స్థానిక సమస్యలను, తమ జీవనంలోని పరిసరాలను, వాటి ప్రభావాలను, తమ అనుభవాలను, స్పందనలను కథలుగా మలచడం జరిగింది.

తెలంగాణ కథ ఆరంభం నుంచే వస్తు వైవిధ్యంతో వెలువడింది. జాతీయోద్యమం ముమ్మరం కాకముందే దేశమంతటా సంఘసంస్కరణోద్యమం జరుగుతున్న కాలంలో కలం పట్టి కథలు రాయడం మొదలు పెట్టిన బండారు అచ్చమాంబ స్త్రీ జనోద్ధరణకు పూనుకొని తన కథల్లో అవిద్యను ప్రస్తావిస్తూ "స్త్రీ విద్య", "జానకమ్మ" కథలు రాసారు. వి.ఆర్.అవధాని 'తిరుగుబాటు' కథ స్థానికంగా ఉన్న అవిద్యను తెలిపేదే. బండారు శ్రీనివాసరావు 'రాజయ్య సోమయాజులు' కథలో ఆనాడు యథేచ్ఛగా కొనసాగుతున్న బాల్య వివాహాల సమస్యను చిత్రించాడు. యల్లాప్రగడ సీతాకుమారి 'పుని స్త్రీ పునర్వివాహం' కథలో నాటి స్త్రీ సమస్యలను చిత్రించడం జరిగింది. సమాజంలో సంస్కరించ గలిగిన అంశాలను తొలితరం తెలంగాణ కథ స్పష్టం చేసింది.

నిజాం రాజుల పాలనలో కొనసాగుతున్న సాంఘిక అసమానతలు, వెట్టి, దౌర్జన్యాలు, దోపిడి. భూస్వాములు, జాగీర్దార్లు, దొరలు, వతన్‌దార్లు సామాన్య ప్రజలపై సాగించిన దమనకాండ, ఆనాటి స్థానిక సమస్యలను తొలితరం కథారచయితలు తమ కథల్లో చిత్రిస్తూ వచ్చారు. సురవరం ప్రతాపరెడ్డి, నెల్లూరి కేశవస్వామి, భాగ్యరెడ్డి వర్మ, కాళోజి నారాయణరావు, వట్టికోట ఆళ్వారుస్వామి, అడ్లూరి అయోధ్య రామకవి, నందగిరి వెంకటరావు, నందగిరి ఇందిరాదేవి, కాంచనపల్లి చినవెంకట రామారావు, ఆవుల పిచ్చయ్య, భాస్కరభట్ల కృష్ణారావు, బి. శ్రీనివాసరావు, పి.వి. నరసింహారావు, పొట్లపల్లి రామారావు, వేనపల్లి ఆంజనేయులు మున్నగు ఎందరో రచయితలు వాస్తవికత దృక్పథంతో స్థానిక అంశాలపై కథలు రాసారు.

నాటి తెలంగాణ పల్లెల్లో భూస్వాములు అధికార్ల అకృత్యాలను తెలిపే కథల్లో వెట్టి మాదిగ, గరీబోణ్ణి, గ్యారా ఖద్దు బారా కోత్వాల్, దొరా, న్యాయం మున్నగు కథలున్నాయి. నిజాం కాలం నాటి జాగీర్దార్ వ్యవస్థ మూలంగా సామాన్య రైతులు అనుభవించిన కష్టాలు

– పటేల్ గారి ప్రతాపం, ఇజ్జత్, ఆకలి, ఈత గింజ ఇచ్చి తాటిగింజ లాగిన జమీందార్, పాడియావు, సమాధిస్థలం, కొత్త నాగలి తదితర కథల్లో చూడవచ్చు.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నేపథ్యంలో తెలంగాణ గ్రామాల్లో వచ్చిన చైతన్యాన్ని సంఘం చిట్టి, నోటీస్, అమరవీరుడు, కాలాన్ని తేవాలి తదితర కథలు తెలిపితే, స్థానిక విసునూర్ దేశ్‌ముఖ్ ప్రోద్భలంతో కడివెండి గ్రామ దుండగులు దొడ్డి కొమురయ్యను హతమార్చిన సంఘటనను "ఊరేగింపులు" కథ రికార్డు చేసింది.

పోలీస్ చర్య అనంతరం నిజాం పాలన అంతమై తెలంగాణ ప్రాంతంలో దారితీసిన పరిణామాలు యుగాంతం. జీవకారుణ్య చర్య, శాంతి ప్రకటనలు, లంకా పునరుద్ధరణ తదితర కథలు తెలుపుతాయి.

సురవరం ప్రతాపరెడ్డి కథలు నిజాంపాలనలోని స్థానిక ప్రభుత్వ అధికార్ల లంచగొండితనం, దోపిడి స్వభావం, హిందూ – ముస్లిం జీవనాన్ని చిత్రించినవే. నెల్లూరి కేశవస్వామి ఆనాటి స్థానిక హైదరాబాద్ నగరంలోని ముస్లిం జీవన సంస్కృతిని తన కథల్లో చిత్రించాడు. మొత్తం మీద తొలితరం తెలంగాణ కథ స్థానికతకు అగ్రతాంబూలం ఇచ్చిందనే భావించవచ్చు.

మలితరం తెలంగాణ కథా సాహిత్యంలో కాల్పనికత చోటు చేసుకోవడంతో కథావికాస క్రమంలో కొంత స్తబ్దత నెలకొంది. తెలుగు మాట్లాడే ప్రజలు భాషా ప్రాతిపదికపై ఉమ్మడి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు చేసుకోవడం జరిగింది. అప్పటినుండి ఆంధ్రుల పెత్తనం కొనసాగడంతో భాష విషయంలో తెలంగాణ ప్రాంత భాష పట్ల వివక్ష చోటు చేసుకున్నది. **"ఆధునిక తెలుగు కథా సాహిత్యం వికసించి వందేళ్ళు దాటినా తెలంగాణ ప్రాంత కథలకు, కథకులకు ఏ మాత్రం చోటు లేకుండా చేస్తున్న వివక్ష ధోరణి కొనసాగుతుండటంతో తెలుగు కథా సాహిత్యంలో తెలంగాణ కథా సాహిత్యం ఒక అస్తిత్వాన్ని నిలుపుకోవడానికి పోరాడాల్సి వచ్చింది. ప్రచురించ బడిన కథా సంపుటాలలో తెలంగాణ ప్రాంత కథలను అచ్చువేయడంలో చూపిన వివక్ష వల్లనైతేనేమి ఇక్కడి రచయితలు, సాహితీ విమర్శకులు తమ చరిత్రను తామే వెలుగులోనికి తీసుకురావడానికి కృషి చేసారు."** (తెలంగాణ కథ– పరామర్శ, డా॥ బన్న అయిలయ్య, పుట:7) అని డా॥బన్న అయిలయ్య పేర్కొన్నట్లుగా తెలంగాణ కథకులు ప్రాంతీయ, స్థానిక స్పృహతో కథలు రాసారు.

తెలంగాణ భాష పట్ల వివక్ష కొనసాగడం, ఆంధ్రప్రాంతం నుండి హైదరాబాద్‌కు వలసలు పెరిగిపోవడం, స్థానికులకు విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాలలో మొండి చేయి చూపడం, తొలివిడత ప్రత్యేక తెలంగాణ ఉద్యమం రావడం, తెలంగాణ ప్రాంత రాజకీయ నాయకులు పదవుల మోజులో పడి ఉద్యమాన్ని నీరు గార్చడం, నక్సలైట్ విప్లవోద్యమాలు చాపక్రింది నీరులా గ్రామగ్రామాన విస్తరించడం, నాటి కేంద్ర ప్రభుత్వం అత్యవసర పరిస్థితి విధించడం వంటి పరిణామాల్ని తెలంగాణ ప్రాంతం చవిచూసింది.

మలితరం తెలంగాణ కథాసాహిత్యంలో కాల్పనికత తోడవ్వడంతో చెప్పుకోదగినంత కథా వికాసం జరుగలేదు. అయినా, రాశిలో తక్కువైనా వాసిలో మిన్న అన్నట్లుగా వచ్చిన కథల్లో వాస్తవిక స్థానికత అంశాలను చూపే కథలు కూడా ఉన్నాయి. గూడూరి సీతారాం 'మా రాజు' కథ, తెలంగాణ పల్లెల నుండి బతుకుదెరువు కోసం మహరాష్ట్ర ప్రాంతానికి వలసలు ఆరంభమైనట్లు తెలుస్తుంది. జనుప సత్యనారాయణరెడ్డి 'అడవి మల్లెలు' కథలో ఆంధ్రప్రదేశ్ అవతరణ తర్వాత ఆంధ్ర ప్రాంతం నుండి తెలంగాణ ప్రాంతానికి వలసలు పెరిగి ఇక్కడి భూములను చౌకగా కొని అనతి కాలంలోనే దొరలుగా చెలామణి అవుతున్నట్లు తెలుస్తుంది. బి. దామోదర్‌రావు 'ఊరబావి' కథలో – తెలంగాణ గ్రామాల్లో స్థానికంగా ఉన్న అగ్రవర్ణాల వాళ్ళు దళితులకు త్రాగడానికి మంచినీళ్ళు ఇవ్వడానికి నిరాకరించే అంటరానితనపు ఆనవాళ్ళు తెలిసివస్తాయి. పి. యశోదారెడ్డి 'పీర్ల పండుగ' కథ తెలంగాణ గ్రామాల్లోని హిందూ – ముస్లింల సఖ్యతను తెలుపుతుంది.

తెలంగాణ గ్రామాల్లో నక్సలైట్ విప్లవోద్యమాలు క్రమంగా విస్తరించి స్థానిక ప్రజల్ని చైతన్యవంతం చేస్తున్న వైనాన్ని అంపశయ్య నవీన్, 'నిప్పురవ్వలు', చెరబండరాజు 'చిరంజీవి', దావా శివకోటి 'గడి', అల్లం రాజయ్య హీరో తదితర కథలే కాకుండా 1973లో వచ్చిన 'బదలా సంకలనం' తెలుపుతున్నాయి.

1975 నుండి 1990 వరకు వచ్చిన మూడవ తరం తెలంగాణ కథ విస్తృతంగా వచ్చింది. స్వాతంత్ర్యానంతరం జన్మించి చదువుకొని ఎదిగి జీవితాలు గెలుచుకున్న కథకులలో ఎక్కువ మంది దళిత, బహుజనులే కావడం గమనార్హం. వీళ్ళు చదువుకొని ఉద్యోగాలు చేస్తున్న క్రమంలో వచ్చిన సామాజిక మార్పులు, ఉద్యమాలు, ప్రజాజీవనంలోని పలు సమస్యలు వీళ్ళను కలం పట్టి కథలు రాసేలా ప్రేరణ నిచ్చాయి. సామాజిక అనుశీలన, స్వానుభవం వీరి కథారచనకు ఉపకరించాయి. తాము పుట్టి పెరిగిన గ్రామం, చదువుకున్న ప్రాంతం, ఉద్యోగం చేసే స్థలంతో ఏర్పడిన అనుబంధం వీరి కథ వేదికయ్యింది. కథారంగం వీరిని కార్యశీలురను చేసింది. సమాజం వేసే ప్రతి అడుగునూ వీళ్ళు కథల్లో నిక్షిప్తం చేసారు.

మూడవతరం తెలంగాణ కథకులు స్థానికంగా ప్రబలిన భూపోరాట విప్లవోద్యమం, భూస్వామ్య పెత్తందారీల ఆగడాలు, స్థానిక రైతు జీవనంలోని సమస్యలను, వివిధ రంగాలలో పని చేస్తున్న కార్మికుల జీవనం, దళిత, గిరిజన, బహుజన, స్త్రీ, మధ్యతరగతి, విద్యార్థి మేధావి జీవన సమస్యలు, సామాజిక చైతన్యాన్ని స్థల కాలాదుల ననుసరించి కథలుగా మలిచారు.

తెలంగాణ గ్రామాల్లో విప్లవోద్యమాల విస్తృతి పెరగడంతో, అందులో రైతు, కూలీలు భాగస్థులై భూపోరాటాలుగా రూపుదాల్చడం, స్థానిక రైతుకూలీలు సిరిసిల్లా జగిత్యాల జైత్రయాత్రగా కదం తొక్కిన దృష్టాంతాలు ఈ కథల్లో నిక్షిప్తం అయ్యాయి. నక్సలైట్ విప్లవోద్యమాల నాటికి గ్రామాల్లో పెత్తందార్లుగా ఉన్న దొరలు ఎప్పటిలాగానే దౌర్జన్యాలు, దోపిడీలు కొనసాగిస్తుంటే విప్లవోద్యమ కార్యకర్తలు వారిని గ్రామగ్రామాన నిలువరించడం ఈ కథల్లో చూడవచ్చు.

సాగునీరు అందక అతివృష్టి, అనావృష్టి వల్ల అల్లాడిపోయి అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతును మధ్య దళారులు మరింత దోపిడి చేస్తూ రైతు కూలీగా స్థిరపడాల్సి వచ్చిన స్థానిక విషయాలు మూడవతరం తెలంగాణ కథల్లో వ్యక్తం అవుతాయి. వ్యవసాయం అచ్చిరాక గని కార్మికులుగా వెళ్ళి ఆరంభంలో దుర్భరమైన జీవితాన్ని గడుపాల్సి వచ్చిన సింగరేణి గని కార్మికుల సమస్యలు, అసంఘటిత రంగాలలో పనిచేస్తున్న కార్మికుల వెతలు ఈ కథల్లో కనిపిస్తాయి.

మైదాన ప్రాంతం నుండి వెళ్ళిన వాళ్ళు అమాయకులైన గిరిజనుల్ని మోసం చేస్తున్న తీరు, గ్రామాల్లో వచ్చిన సామాజిక మార్పుల ద్వారా కులవృత్తులలో ఎదుగుదల లేకపోవడం ఈ కథలు వ్యక్తం చేసాయి.

**“స్థానిక ఉద్యమాలు బలపడే కొద్దీ వాటి విస్తృతి పెరుగుతుంది. సాహిత్య లక్ష్యం నిర్దిష్టమయ్యే కొద్దీ స్థానికత అనేకాంశాలుగా వ్యక్తమవుతుంది. ఒక ప్రాంతం ఈ విధంగా చైతన్యవంత మవుతున్నప్పుడు మిగిలిన ప్రాంతాలు కూడా వాటి నుంచి స్ఫూర్తిని పొందవచ్చు. అలాంటి సందర్భంలో భిన్న స్థానికుల వేదనలు సాహిత్య రూపం దాల్చుతాయి, ఇక సాధారణీకరించదగిన ‘స్థానికత’ అంటూ ఏదీ వుండదు. నిర్దిష్టమైన స్థానికత సాహిత్య లక్షణంగా మారుతుంది. దీనివల్ల ఒక స్థలానికీ, ఒక కాలానికీ పరిమితమైన ప్రాంతీయత, సంస్కృతి, గతం, వర్తమానం, భవిష్యత్తు సాహిత్యంలో ప్రధానంగా వ్యక్తమవుతుంది. వ్యక్తీకరణల్లోని సునిశితత్వం పెరుగుతుంది. సాహిత్యంలో కానీ సంస్కృతిలో కానీ, స్థానికత ఒక అన్వేషణ. ఇతర ప్రభావాల బారిన పడకుండా సంస్కృతి ఏర్పర్చుకునే ఒక రక్షణ, తాత్త్వికస్థాయిలో ఈ రెండు అంశాలు స్థానికతకి సామాజిక ప్రాధాన్యాన్ని పెంచుతాయి. పైగా స్థానికత అనేది ఒక నిరంతర ఉద్యమం, విస్తృతి అనేదే దాని మూల లక్షణం కాబట్టి అది బలహీన పడడం అంటూ ఉండదు.”** (కథ– స్థానికత; అఫ్సర్, పుట:22) అని అఫ్సర్ భావించినట్లుగా కాలం గడుస్తున్న కొద్దీ స్థానికత అనేకాంశాలుగా ప్రస్ఫుటం కావడాన్ని గమనిస్తున్నాం.

1990 దశకంలో సరళీకృత ఆర్థిక విధానాల అమలు జరగడంతో దేశంలో విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడం జరిగింది. దీంతో ప్రభుత్వ రంగ సంస్థలు కుదేలు అయ్యి వాటి స్థానంలో ప్రైవేట్ సంస్థలు వెలిసాయి. ప్రతిదీ వ్యాపార సరుకయ్యింది. పల్లెల్లో వ్యాపార సంస్కృతి విస్తరించగా వృత్తి నాశ్రయిస్తూ వచ్చిన వారి జీవనం సంక్షోభంలోకి నెట్టబడింది. అధునాతన సాంకేతిక విజ్ఞానం వల్ల కంప్యూటర్ ఆధారిత కోర్సులు చదివిన వారికి ఐటీ రంగాలలో ఉద్యోగావకాశాలు మెరుగయ్యాయి. పల్లె నుండి పట్టణాల వరకు యువత డాలర్ల మోజులో పడి విదేశాలలో స్థిరపడాల్సి రావడంతో మేధోవలసలు ఆరంభమైనాయి. ఎవరూ నియంత్రించలేని సామాజిక మార్పులు రావడం మొదలయ్యింది. సంస్కృతి, ఆచార వ్యవహారాల్లో ప్రస్ఫుటమైన మార్పులు వచ్చాయి. విదేశీ వస్తు, సంస్కృతి పట్ల వ్యామోహం పెరిగింది. అందుబాటులోకి వచ్చిన సమాచార వ్యవస్థ వల్ల ప్రపంచంలో ఏ దేశములోని మారుమూల పల్లెల్లోనైనా ఎప్పుడు ఏది జరిగినా క్షణాల్లో తెలిసే సాంకేతిక విజ్ఞానం వచ్చింది. ఇలాంటి మార్పునే మనం ప్రపంచీకరణగా వ్యవహరిస్తున్నాం.

**“1990 నుండి తెలంగాణలో కొత్తతరం మొదలైంది. ప్రపంచం అతి వేగంగా మారుతూ పెట్టుబడిదారుల, సామ్రాజ్య వాదుల సంస్కృతి, భాషల నుండి తమ భాషా సంస్కృతులను, ఉనికిని, అస్తిత్వాన్ని కాపాడుకోవాలనే తాపత్రయం ప్రారంభమైంది. భాషా సాహిత్యాల్లో, భాషా సంస్కృతులలో ఒక ప్రాంతం మరొక ప్రాంతం మీద చలాయించే ఆధిపత్యమే ఇందుకు కారణం. ఆ ఆధిపత్య సమస్యను తగ్గించడానికి, నిరంతర ఉద్యమంగా ముందుకు వచ్చినదే స్థానికత.”** (ఉత్తర తెలంగాణ - మూడు దశాబ్దాల కథ (1970-2000); డా॥ ఆకునూరి విద్యాదేవి, పుట:247)

‘స్థానికత’ ను అవగాహన చేసుకోవడం కోసమే ఇంత వరకు చేసిన ప్రయత్నం. ఈ చర్చ ద్వారా ‘స్థానికత’ వాదంలోని ముఖ్యాంశాలను సమీక్షించుకుందాం...

1. ఏజాతి అయినా తన మూలాల్లోకి అన్వేషించుకుంటూ వెళ్ళడం ‘స్థానికత’గా భావించవచ్చు.
2. ‘స్థానికత’ స్థల కాలాల పరిధికి లోబడి ఉంటుంది.
3. స్థానికత ప్రపంచీకరణకు విరుగుడు.
4. స్థానికతలో సమస్త అంశాల విశిష్టతకు స్థానం ఉంటుంది.
5. స్థానికత రాజకీయ ప్రతిపత్తిని సాధిస్తే ప్రాంతీయత అవుతుంది.
6. జాతీయత అనేది ‘గ్రేట్ ట్రెడిషన్’ అయితే స్థానికత ‘లిటిల్ ట్రెడిషన్,’
7. స్థానికత సాధారణీకరించడానికి వీలులేనిది.
8. భౌగోళికంగా ప్రాంతీయత పెద్దదైతే, స్థానికత అందులో భాగం.
9. ‘అడవి’ చిత్రపటం ప్రాంతీయత అయితే అందులో చెట్లను చూడటం స్థానికత.
10. స్థానికతను ప్రాదేశికతగా కూడ వ్యవహరిస్తారు.

11. స్థానికతలో వాస్తవికత అంతర్భాగం.

12. స్థానికత భిన్న భాషల సాహిత్యాన్ని, సంస్కృతులను, రచయితలను ఒకే దృక్పథంతో చూసే దృష్టిని నిరాకరిస్తుంది.

13. స్థానికత నిరంతర ఉద్యమం, విస్తృతి దాని మౌలిక లక్షణం.

ఇట్లా స్థానికత వాదం నేడు సాహిత్యంలో అన్నీ ప్రక్రియల్లో బలంగా వినిపిస్తున్నది. **"తెలుగు సాహిత్యానికి సంబంధించినంత వరకూ సమకాలీనంగా రూపుదిద్దుకున్న వివిధ నిర్దుష్ట వాదాల ప్రాముఖ్యాన్ని చెప్పుకోవడానికి 'స్థానికత' ఒక ప్రామాణికమైన సాధనంగా వుపయోగపడుతుంది. అందుకే to excavate and imaginatively represent the totality of community experience ని చెప్పడానికి స్థానికత వుపయోగిస్తుంది."** అని అన్నారు అఫ్సర్.

ప్రపంచీకరణ వల్ల పెట్టుబడిదారులకు మేలు జరిగిందేమో కానీ, స్థానికులైన ప్రజల జీవనం, సంస్కృతి, ఆచార వ్యవహారాలు మున్నగు వాటిలో ఎన్నడూ లేనంతగా మార్పు వచ్చింది. అభివృద్ధి పేరిట జరిగిన విధ్వంసంలో ప్రజలు తమ స్థానికతను కోల్పోవలసి వచ్చింది. పుట్టి పెరిగిన ఊరు కనుమరుగవ్వడం జరిగింది. ఈ నేపథ్యంలో తెలంగాణ కథా రచయితలు తమ మూలాల్లోకి వెతుక్కుంటూ వెళ్ళేక్రమంలో స్థానికతను ప్రతిఫలించే కథలు సమకాలీన రచయితలు రాసారు.

**ఉపయుక్త గ్రంథ సూచి**

1. అయిలయ్య బన్న, తెలంగాణ కథ- పరామర్శ, నానీ ప్రచురణలు, 2017

2. అశోక్‌కుమార్ కె.పి, కథావలోకనం, పాలపిట్ట బుక్స్, హైదరాబాద్, 2008

3. అఫ్సర్, కథ - స్థానికత (సం॥ గౌరిశంకర్ జూలూరు), స్పృహ సాహితీ, హైదరాబాద్, 2008

4. గుడిపాటి, ఇతివృత్తం, ఋషి ప్రచురణలు, గుడివాడ, 2003

5. గిరిజా మనోహర బాబు (సం॥), తెలుగు వెలుగులు, సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ, వరంగల్ 2017

6. బాల శ్రీనివాసమూర్తి గుమ్మన్నగారి, ఆత్మకథల్లో ఆనాటి తెలంగాణ (1900-1956), ప్రసన్న శివానందప్రచురణలు, 2008

7. డా॥మల్లీశ్వరీ, ఉత్తరాంధ్ర కథా స్థానికత, డి.వై.ప్రింటెక్స్, వైజాగ్, 2013.

❖ ❖ ❖ ❖ ❖

**STATEMENT OF OWNERSHIP & OTHER PARTICULARS ABOUT "MUSI" TELUGU MONTHLY**
**FORM IV (See Rule 8)**

| | |
|---|---|
| **1.** Place of Publication | Hyderabad |
| **2.** Periodicity of its Publication | Monthly |
| **3.** Printer's Name | **B. Ananta Laxmi** |
| a) Whether citizen of India? | Yes |
| b) if foreigner, state the country of origin | - |
| address | 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderabad-500027 |
| **4.** Publisher's Name | **B. Ananta Laxmi** |
| a) Whether citizen of India? | Yes |
| b) if foreigner, state the country of origin | |
| address | 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderabad-500027 |
| **5.** Editor's Name | **Dr. Sagi Kamalakara Sharma** |
| a) Whether citizen of India | Yes |
| b) if foreigner, state the country of origin | |
| address | 2-2-1109/BK-LIG-10, Bathukamma kunta, Bagh Amberpet, Hyderabad -500013 (Telangana) |
| **6.** Name and address of individuals who own the Newspapers and partners or share holders holding morethan one percent of the total capital. | **B. Ananta Laxmi** |

I, **B. Ananta Lakxmi,** hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

*Sd/-*

01.04.2025

**B. ANANTA LAXMI**
Publisher

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5 (38) హైదరాబాద్ ఏప్రిల్ : 2025

# సాంస్కృతిక శిలాఫలకం 'లోకపల్లి సంస్థానం'

**మ్యాడం అభిలాష్,** ఫోన్ : 814 257 6346

చరిత్ర అంటే కేవలం గత సంఘటనల సమాహారం మాత్రమే కాదు. తరతరాలుగా సమాజాన్ని ప్రభావితం చేసిన సంఘటనలు, వ్యక్తిత్వాలు, పరిపాలనా విధానాల సమాహారం. అందులోనూ సంస్థాన చరిత్రలు మరింత ఆసక్తికరమైన అధ్యాయాలను కలిగి ఉంటాయి. అలాంటి అరుదైన పాలనా రంగంలో ఒక ముఖ్యమైన అధ్యాయమే లోకపల్లి సంస్థానం. పరిపాలనాపరంగా మాత్రమే కాకుండా, ధార్మికత, సాంస్కృతిక, సైనిక, రాజకీయ రంగాల్లో కూడా ఈ సంస్థానం తన ప్రత్యేకతను చాటుకుంది. రాజకీయ చతురత, ధర్మ పరిరక్షణ, వీరత్వం, సంస్కృతిని సమన్వయం చేసుకున్న ఈ సంస్థానం దక్షిణ భారత చరిత్రలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించింది.

ఇది కేవలం రాజకీయ శక్తి కేంద్రంగా మాత్రమే కాకుండా, ఓ నమ్మక స్థావరంగా కూడా నిలిచింది. ఇక్కడి పాలకులు ధర్మాన్ని రక్షించడమే గాక, ఆపత్కాలంలో శరణార్థులకు సహాయం అందించే వారు. మహారాష్ట్ర యోధుడు, మరాఠా సామ్రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ మహారాజుకు కొన్ని రోజులు ఆశ్రయం కల్పించడం, మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించేందుకు సహాయపడటం, ఈ సంస్థాన చరిత్రలో విశేష ఘట్టాలుగా నిలిచాయి.

తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన నారాయణపేటజిల్లాలో ఈ సంస్థాన వారసత్వాన్ని నేటికీ మనం చూడవచ్చు. నారాయణపేట నగరం పేరు కూడా లోకపల్లి సంస్థాన పాలకుల నుంచే వచ్చిందని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. వ్యవసాయం, వాణిజ్యం, విద్య, న్యాయవ్యవస్థ, కళలను ఈ సంస్థానం అత్యంత నిబద్ధతతో ప్రోత్సహించింది. అటువంటి ఈ సంస్థాన ప్రాముఖ్యత, చరిత్ర, సాంస్కృతిక వారసత్వం ఇంతవరకూ వెలుగులోకి రాకపోవడం గమనార్హం. ఈ సందర్భంగా ఈ ప్రాంతం గురించి తెలుసుకోవాల్సిన అవసరం నేటి తరానికి ఉంది. ఆ దిశగా అవగాహన కల్పించేందుకే ఈ వ్యాసం.

## సంస్థాన ఆవిర్భావం

సంస్థానాలు కొన్ని ఆధిపత్య పోరాటాల ద్వారా ఏర్పడగా, మరికొన్ని సమర్థవంతమైన పాలకుల ద్వారా శాస్త్రీయంగా అభివృద్ధి చెందాయి. లోకపల్లి సంస్థానం, రెండో విధానానికి చెందినదనే చెప్పవచ్చు. పరిపాలనా నైపుణ్యం, ధర్మ పరిరక్షణ, ప్రజాహితం ఈ మూడు సూత్రాలపై నిర్మితమైన సంస్థానం ఇది.

ఇది కేవలం రాజ్యశక్తిని ప్రదర్శించేందుకు మాత్రమే కాకుండా, ఒక సమర్థమైన పరిపాలనా వ్యవస్థను నిర్మించేందుకు ఏర్పాటు చేయబడింది. ఈ సంస్థానానికి చెందిన రాజులు ప్రాంతీయ రాజకీయాలను చక్కగా అర్థం చేసుకొని, ధర్మ పరిపాలన సాగించేందుకు కృషి చేశారు. మొదట్లో పరిమితంగా ఉన్న ఈ సంస్థానం, అనేక యుద్ధాలు, కూటముల ద్వారా విస్తరించబడింది.

శా.శ. 1294లో, దేవగిరి యాదవరాజైన రామచంద్రుడు మక్తల్ ప్రాంతాన్ని పాలించే సమయంలో ఈ సంస్థానం ఆవిర్భవించింది. ఆ కాలంలోనే ఈ ప్రాంతానికి ఒక ప్రత్యేకమైన పరిపాలనా వ్యవస్థ ఏర్పడి, అనంతర కాలంలో అది లోకపల్లి సంస్థానంగా రూపుదిద్దుకుంది. ఇది రాజ్య పరిపాలన కంటే వేద పరిరక్షణ, ధార్మికతకు అధిక ప్రాధాన్యతనిచ్చిన పాలకులతో కొనసాగింది. ఈ సంస్థానాన్ని అభివృద్ధి పథంలో నడిపిన ప్రధాన వ్యక్తి మొదటి వెంకటనారాయణ రావు. ఈయన 1611లో ప్రస్తుత నారాయణపేట పరిసర ప్రాంతాలలో పళ్ళ అనే ప్రదేశానికి చెందిన త్రయంబక భట్టు, విఠల భట్టు అనే శ్రౌత తంత్రవేత్తలకు భూదానం చేసి, ధార్మిక విధానాలను మరింత బలపరిచారు. వీరు సంస్థాన పాలకులకు యజ్ఞయాగాదులు నిర్వహించేవారు.

ఈ సంస్థాన పాలకులు వేదశాస్త్ర పరిరక్షణను తమ ప్రధాన బాధ్యతగా భావించారు కాబట్టి తమ రాజ్య స్థాపనను ధర్మాధిష్ఠితంగా, న్యాయపూర్వకంగా తీర్చిదిద్దారు. రాజకీయ విస్తరణ కంటే సాంస్కృతిక, ఆధ్యాత్మిక పురోగతి మీదే ఎక్కువగా దృష్టి పెట్టారు. ఈ విధంగా లోకపల్లి సంస్థానం ఒక సాధారణ సంస్థానం కంటే భిన్నంగా, వేద విద్యాభివృద్ధికి, ధార్మిక వ్యవస్థను సమర్థవంతంగా కొనసాగించేందుకు అంకితమై ఏర్పడింది. ఈ సంస్థాన ఆవిర్భావం వెనుక ధర్మ పరిరక్షణే ప్రధాన ఉద్దేశంగా ఉండటం, దానిని ఇతర రాజ్యాల కంటే ప్రత్యేకమైన స్థానంలో నిలబెట్టింది.

ఇక లోకపల్లి అనే పేరు విషయానికి వస్తే... "లోకపాలన" అనే పదం నుండి వచ్చిందని చెప్పవచ్చు. అంటే ప్రజల పాలన అనే అర్థాన్ని ఇందులో గమనించవచ్చు. దీనికి తగ్గట్టుగానే, ఈ సంస్థానం ప్రజలకు ఆత్మరక్షణ, ఆర్థిక స్థిరత్వం, సామాజిక ప్రగతిని అందించేందుకు కృషి చేసింది. పురాణాలను, శాసనాలను పరిశీలిస్తే, ఈ ప్రాంతం మౌర్య, శాతవాహన, చాళుక్య రాజవంశాల ప్రభావాన్ని పొందినట్టుగా తెలుస్తుంది. అటుపై, అది ఒక స్వతంత్ర సంస్థానంగా మారి, శక్తివంతమైన పాలకులచే పరిపాలించబడింది.

## విద్య - సాహిత్యం

సంస్థానం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక విద్య, వేద అధ్యయనం, శాస్త్రీయ పద్ధతుల బోధనకు పెద్దపీట వేయబడేది. భాస్కరరాయలు

వంటి పండితులు ఇక్కడ ఉండి తమ రచనల ద్వారా సాంస్కృతిక వికాసానికి దోహదపడ్డారు.

భాస్కరరాయలు లోకాయపల్లి సంస్థానకవి. గంభీరరాయలు, కోనమాంబల పుత్రుడు. శాక్త దర్శనాలలో చేయి తిరిగినవాడు. 17వ శతాబ్దంలోనివాడు. ఇతడు నారాయణపేటకు దగ్గరలో గల లోకాయపల్లిలో నృసింహజయుడి దగ్గర విద్యనభ్యసించాడు. సౌభాగ్య భాస్కరం, వరివస్యా రహస్యం, నిత్యాషోడశికార్ధవ టీకయైన 'సేతువు', దుర్గా సప్తశతి వ్యాఖ్యయైన 'గుప్తవతి', కాల భావనా త్రిపురోపనిషత్తు లపై టీక, వాద కుతూహలం అనే పూర్వమీమాంస శాస్త్రం వంటివి భాస్కరరాయలు రచనలు. లలితా సహస్ర నామావళి భాష్యమైన 'సౌభాగ్య భాస్కరం' కూడా ఈయనే రచించాడు. ఇందులో తాంత్రిక, మాంత్రిక, వామాచార, దక్షిణాచార, కౌళాది భిన్న సిద్ధాంత రహస్యాలు ఉన్నాయి. సేతుబంధం, చండాభాస్కరం, తృచ భాస్కరం మొదలైనవి కూడ ఈయన రచనలే. ఈయన మొత్తం 43 రచనలు చేసినట్టు తెలుస్తున్నది.

భాస్కరరాయల గురించి అతడి శిష్యుడు అయిన జగన్నాథుడు 'భాస్కర విలాస కావ్యం' అనే గ్రంథాన్ని రాశాడు. ఇతని తండ్రి కూడ ఒక కవి. అతను మహాభారతాన్ని పార్శీ భాషలోకి అనువదించాడు.

ఈ ప్రాంతంలో భాస్కర రాయలకంటే ముందు ఆదిభట్ట నారాయణుడు అనే పండితుడు కూడా చరిత్రలో ఉన్నాడు. లలితా సహస్ర నామాలకు ఇతడు రచించిన 'జయమంగలము' వ్యాఖ్య ఎంతో ప్రసిద్ధి చెందింది. నారాయణుని వ్యాఖ్య మిగతావారి కంటే చాలా సమంజసంగా ఉన్నదని పండితుల అభిప్రాయం. ఈయన పేరు మీదనే ప్రస్తుత నారాయణపేట ప్రాంతానికి ఆ పేరు వచ్చిందని చెప్పవచ్చు.

### శివాజీకి ఆశ్రయం - లోకపల్లి చరిత్రలో కీలక ఘట్టం

లోకపల్లి సంస్థాన చరిత్రలో ఒక కీలక ఘట్టం 17వ శతాబ్దంలో చోటు చేసుకుంది. ఆ కాలంలో తెలంగాణ ప్రాంతాన్ని కుతుబ్షాహీ రాజైన తానీషా మహారాజు పాలించారు. ఈ పాలనకాలంలో మొఘల్ సామ్రాజ్య విస్తరణ పెరిగి, దక్షిణ భారతంలో కొత్త రాజకీయ పరిణామాలకు దారితీసింది. తానీషా అనేకసార్లు మొఘల్ దండయాత్ర లను ఎదుర్కొన్నాడు. అయితే, వారిని సుసాధనం చేసేందుకు మరాఠా సామ్రాజ్య స్థాపకుడైన ఛత్రపతి శివాజీతో స్నేహ సంబంధాలు ఏర్పాటు చేయాలనే ఆలోచనతో, తన కొలువులోని మంత్రులు అక్కన్న, మాదన్నల ద్వారా శివాజీకి సందేశం పంపించాడు.

ఈ ఆహ్వానం అందుకున్న శివాజీ దక్షిణ భారతయాత్రకు సిద్ధమయ్యాడు. 17వ శతాబ్దంలో తన అనుచరులతో కలిసి దక్షిణ దిశగా ప్రయాణించాల్సి వచ్చిన సందర్భంలో, లోకపల్లి సంస్థానాధిపతి శివాజీకి ఆశ్రయంగా నిలిచాడు. కేవలం సురక్షితంగా ప్రవేశించేందుకు మాత్రమే కాదు, శత్రువుల కళ్లకు చిక్కకుండా విశ్రాంతి తీసుకోవడానికి, తన భవిష్యత్ వ్యూహాలను పునరాలోచించేందుకు ఈ సంస్థానం శివాజీకి అండగా నిలిచింది.

శివాజీ వెంట వచ్చిన అనేకమంది వ్యాపారులు ప్రస్తుత నారాయణపేట ప్రాంతంలో స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. వీరిలో అధికంగా చేనేత వృత్తికి చెందినవారు ఉండటం విశేషం. దీని ఫలితంగా, నారాయణపేట ప్రాంతం చేనేత కళకు ప్రసిద్ధి చెందడానికి బీజం పడినట్లు చరిత్రకారులు విశ్లేషిస్తున్నారు.



ఈ ప్రాంతం మీదుగా ప్రయాణించిన శివాజీ తానీషాను కలిసిన తర్వాత, శ్రీశైలం వైపు పయనించాడు. అక్కడ భ్రమరాంబికా అమ్మవారు ప్రత్యక్షమై ఖడ్గాన్ని ప్రసాదించిందని చారిత్రక ఆధారాలు పేర్కొంటున్నాయి. ఈ సంఘటన శివాజీ మరింత ధైర్యాన్ని, భక్తిని కలిగించే ఘటనగా మారింది. కుతుబ్షాహీ పాలకులు, శివాజీ మధ్య ఏర్పడిన ఈ సంబంధం వల్ల, ఆయన తన వ్యూహాలను పునరాలోచించే అవకాశం పొందాడు. తద్వారా మరికొన్ని విజయవంతమైన దండయాత్రలకు సిద్ధమయ్యాడు.

శివాజీకి ఆశ్రయం ఇచ్చిన ఘట్టం లోకపల్లి సంస్థానాన్ని మరింత ప్రాచుర్యంలోకి తెచ్చింది. మొఘల్ సామ్రాజ్య విస్తరణ సమయంలో, తమ రాజకీయ చతురతను ప్రదర్శించి శివాజీకి సహాయం అందించడం, ఈ సంస్థాన పాలకుల ధైర్యసాహసాలకు, వ్యూహా నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచింది.

### పరిపాలన

లోకపల్లి సంస్థాన పరిపాలన అనేక ప్రత్యేకతలు కలిగి ఉంది. ధర్మపరమైన పాలన సంస్థాన పాలకుల ప్రధాన లక్ష్యంగా ఉండేది. న్యాయ వ్యవస్థలో రాజులే స్వయంగా ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి, స్థానిక రాజ్యవ్యవస్థ ద్వారా తీర్పులు అందించేవారు.



# అమ్మ

**విను**

ఎర్రటెండకు / ఎండిన కట్టెలను ఏరుకొచ్చి
ఎన్ని గడపలకు మోపులమ్మితే
పొయ్యి మీదికి కాసిన్ని నూకలొచ్చాయో!
గుబురు గుబురు పొదల్లోంచి / ఒక్కొక్క గింజను పోగుజేసి
ఎన్ని సేరుల కరివేపాకు విత్తులేరుకొస్తే
మా కుండలోకి కూరగాయలొచ్చాయో!
అమ్మకి 'అక్రోఫోబియా'
తోటి వాళ్ళందరూ చెట్లెక్కి
మూటల నిండా అడ్డాకులకై ఆరాటపడుతుంటే
మాయమ్మ గాలికి రాలిన ఆకులనే ఏరుకొచ్చేది
దీపం బుడ్డి వెలుగులో విస్తరాకు కుదుతుంటే
అమ్మచేతితో చందమామకు పురుడొస్తున్నట్లుండేది
ఎంత అడవిని చుట్టి వచ్చిందో
ఎన్ని కాలువలు దాటి వచ్చిందో / ఎన్నెన్ని చెట్లను పలకరించిందో
తునికాకు సంచినెత్తుకొని జారిపడినప్పుడల్లా
చిద్రమైన మోకాళ్ళచిప్పలెలా విలవిలలాడాయో
నడిరాత్రి నడింట్లో కట్టలు కడుతుంటే
అలసిన అమ్మకు తునికాకులే మెత్తని పానుపయ్యేవి
భుజాల లోతు వాగు / ఒంటి చుట్టూ కప్పలు జలగలు
పొద్దుగూకులు మునిగి తీసిన ఇసుక
ఊరిలో మేడల గోడలకు సరుకయింది
మా గూడునేమో చిల్లులు పడిన గొడుగులాగుంది
మాయమ్మ తనువు చెమట ఊట / చుట్టూ పద్నాలుగు పల్లెల్లో
దాని పాదం మోపని గుంట భూమి లేదు
దాని చెమట ఇంకని సెంటు చేను లేదు
గంపెడాశతో రేషన్ షాపుకెళ్తే / ఫింగర్ ప్రింట్ మిషన్ నిరాకరిస్తుంది
పాపం, ఈ సాంకేతిక పరికరాలకేం తెలుసు
కూలీతల్లి చేతి వేళ్ళు అరిగిపోయాయని!
నాతల్లి అడుగులకు / అడవితల్లి ఒళ్ళంతా పులకరించేది
మాయమ్మ దండం పెడితే / దారిలోనున్న నాగుపాములు దారినిచ్చేవి
నాగరికత నరుడేమో ప్రకృతి ప్రాణం తీస్తుండు
నెత్తి మీద పచ్చి గడ్డిమోపు / గడ్డిమోపు సిగలో కొడవలి
మాయమ్మ గుట్టెక్కి గుట్ట దిగుతుంటే
పగిలిన పాదాలు స్రవించిన రక్త ధార
ఎత్తుపల్లాల ఎరుపు దారిని చూపెట్టింది

అనాథల సంరక్షణ, దేవాలయ భూముల పరిరక్షణ, విద్యాభివృద్ధి వంటి అంశాలకు సంస్థానంలో ప్రత్యేకమైన ప్రాధాన్యం ఉండేది.

## సైనిక సామర్థ్యం

ఇతర సంస్థానాల మాదిరిగా, లోకపల్లిలో కూడా స్వంత సైనిక దళాలు ఉండేవి. గుఢచార వ్యవస్థ, ప్రాంతీయ రక్షణ వ్యూహాలు, గుర్రపు దళాలు వంటి యుద్ధపద్ధతుల్ని ప్రత్యేకంగా అభివృద్ధి చేశారు.

లోకపల్లి సంస్థాన రక్షణ వ్యవస్థలో సైన్యాధిపతి రాఘోజీ భోంస్లే గారు ప్రధాన పాత్ర పోషించారు. ఆయన ఆధ్వర్యంలోని సైనిక బలగాలు, ప్రత్యేకించి గుర్రపు దళాలు, సంస్థానాన్ని కాపాడటంలో నిపుణంగా ఉండేవి. రాఘోజీ భోంస్లే తండ్రి సైనిక సేవల కారణంగా సంస్థాన పాలకులకు విశ్వసనీయంగా మారారు.

## మహిళా నాయకత్వం

ఇతర సంస్థానాలతో పోలిస్తే, లోకపల్లి సంస్థానంలో మహిళలు కూడా పరిపాలనా వ్యవస్థలో ప్రముఖ పాత్ర పోషించేవారు. ప్రత్యేకించి చివరి రాణి లక్ష్మమ్మ సంస్థాన పరిరక్షణలో విశేష కృషి చేశారు. ఆమె ధైర్యసాహసాలతో, వ్యూహాత్మక నిర్ణయాలతో, సంస్థానాన్ని శత్రు దాడుల నుండి రక్షించేందుకు పలు చర్యలు చేపట్టారు. దీనికి ఫలితంగా నేడు ఈ ప్రాంతపు ప్రజలు "లక్ష్మమ్మ మాత" పేరుతో ఆలయాన్ని నిర్మించి పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

## ముగింపు

లోకపల్లి సంస్థానం చరిత్రను అధ్యయనం చేయడం అనేది కేవలం భూతకాలపు ఘట్టాలను గుర్తించడమే కాదు. ఇది మనకు పాలనలో నిబద్ధత, ధర్మపరమైన చింతన, సాంస్కృతిక భద్రత వంటి అంశాల్లో పాఠాలను అందించగలదు.

ఛత్రపతి శివాజీ వంటి మహారథులకు ఆశ్రయం ఇచ్చిన సంస్థానంగా ఇది ప్రత్యేకతను నిలబెట్టుకుంది. సంస్థాన పరిపాలన విధానం, ధర్మనిష్ఠ, సాహిత్యం, సైనిక వ్యూహాలు, మహిళా నాయకత్వం వంటి అంశాలు దీన్ని మరింత విశిష్టమైన సంస్థానంగా నిలబెట్టాయి.

ఒకప్పుడు పరిపాలనా లోకంలో సుస్థిరంగా వెలుగొందిన లోకపల్లి సంస్థానం, నేడు చరిత్ర పుటల్లో ఒక చిరస్థాయిగా నిలిచిపోయింది. ఈ చరిత్రను మరింత లోతుగా పరిశోధించి, సంస్థాన విశేషాలను మరింత లోకానికి అందించాల్సిన అవసరం ఉంది.

## ఆధార గ్రంథ సూచి

1. "లోకపల్లి సంస్థాన చరిత్ర సమాచారం" – జి. కుర్మన్న, నారాయణపేట

2. "మహబూబ్ నగర్ జిల్లా సాహిత్య చరిత్ర" – డా. భీంపల్లి శ్రీకాంత్, తెలంగాణ సాహిత్య అకాడమీ

3. లోకపల్లి ప్రాంతపు ప్రజల నుండి సేకరించిన సమాచారం.

# నాటకం – రాజుల ప్రోత్సాహం

**జి. సురేష్ బాబు,** పరిశోధక విద్యార్థి, రంగస్థల కళల శాఖ. తెలుగు విశ్వవిద్యాలయం. ఫోన్ : 812 5811671

నాటకం అనేది నిజ జీవితంలోని అంశాల దృష్ట్యా ఆవిర్భవించిందని, మన సామాజిక జీవన స్థితిగతులకు అద్దం పడుతుందని మనందరికి తెలిసిన విషయమే. అందుకే జీవితాన్ని జగన్నాటకమని మన పెద్దలు అనటం పరిపాటి.

నాటకం అనేది ప్రత్యక్ష పాత్రల ద్వారా సమకాలీన అంశాలపై, అనేక సమస్యలపై దృష్టి ఉంచి ప్రదర్శించే ఒక ప్రక్రియ. అందువల్ల ప్రేక్షకులు ఆయా పాత్రలలో లీనమై అనేక భావోద్వేగాలకు లోనవుతారు. కన్నీరు పెడతారు. ఆనందంతో కేరింతలు కొడతారు. ఇక్కడ కేవలం ప్రేక్షకులే కాదు, పాత్రలు పోషించే ఆయా నటీనటులు కూడా పాత్రలో లీనమై వారు కూడా తమను తాము రంజింప చేసుకోగలుగుతారు. ఒకేసారి ఇరువురూ అంటే అటు పాత్రధారులు, ఇటు ప్రేక్షకులు ఏకకాలంలో ఆనందంలో, ఆయా భావోద్వేగాలకు లోనవడం నాటక ప్రక్రియ యొక్క ప్రత్యేకత అనవచ్చు. అందుకే నాటకం ఎన్నో శతాబ్దాల నుండి కూడా తన ఉనికిని కోల్పోకుండా ప్రదర్శించబడుతుంది. అయితే నాటకం మొదటి నుంచి కూడా రచనాపరంగా, ప్రదర్శనాపరంగా కూడా ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటుంది అనడంలో సందేహం లేదు.

మొదటగా తెలుగు నాటకాలు గద్య, పద్య, గేయాత్మక నాటకాలుగా ఉండేవి. అందుకే వాటిల్లో అనేక పద్యాలు, పాటలు ఆయా నాటకాలలో చోటుచేసుకునేవి. ఆ తర్వాతి కాలంలో వచన నాటకాలు క్రమక్రమంగా ఊపందుకున్నాయి. ఈ క్రమంలోనే సమకాలీన పరిస్థితులను ఆధునిక సమాజ జీవితాలను ప్రతిబింబిస్తూ 1897లో "కన్యాశుల్కం" అనే నాటకాన్ని సాంఘిక వచన నాటకంగా రచించటం జరిగింది. కన్యాశుల్కం నాటకం వాస్తవ పరిస్థితులకు అద్దం పట్టింది. ఆ తర్వాత ఎంతోమంది రచయితలు తమ నాటక రచనలను తెలుగునాట రచించి ఎంతో లబ్ధప్రతిష్టులయినారు.

అయితే, నాటక ప్రదర్శనకు ఆర్థికపరమైన అంశాలు కూడా ముడిపడి ఉన్నాయి. ఆయా ప్రదర్శన పరిధిని బట్టి నాటక ప్రదర్శనకు కొంత ఖర్చు అవుతుంది. దానిని కొంతమంది భూస్వాములు లేదా కొంతమంది కలిసి ఒక సమాజంలా ఏర్పడి నాటకానికి తగిన నిర్వహణ ఖర్చులను భరించేవారు. కళాభిరుచి కలిగిన కొంతమంది దాతలు ముందుకు వచ్చి ప్రదర్శనకు ఆర్థిక సహాయాన్ని అందించేవారు. ఈ విధంగా నాటకం ప్రోత్సాహాన్ని పొందుతూ వస్తుంది.




**రాజులు – నాటక ప్రోత్సాహం**

కొంతమంది రాజులు కూడా నాటక కళపట్ల ప్రత్యేకమైన శ్రద్ధ కనబరిచారు అని నిస్సందేహంగా చెప్పవచ్చు. రాజులు అప్పట్లో వారి వారి ఆస్థానాలలో ఎన్నో కళారూపాలను అంటే సంగీతము, నృత్యము, నాట్యములను ఆదరించటం జరిగింది. వీరు వివిధ రంగాలకు చెందిన కళాకారులను సత్కరించి కళలను ప్రోత్సహించేవారు. వారు తమ తమ ఆస్థానాలలో ఎంతో నైపుణ్యం కలిగిన కళాకారులు ఉన్నారని చెప్పుకోవటానికి ఉత్సాహం కనబరచేవారు. వారు దానిని గర్వంగా భావించేవారు.

ఆయా కాలాలను బట్టి చాలామంది రాజులు తమ రాజ్యాలలో కళా ప్రోత్సాహాన్ని అందించేవారు. వారిలో ముఖ్యులు 1. ఆంధ్ర రాజులు 2. చాళుక్య రాజులు 3. కాకతీయ రాజులు 4. రెడ్డిరాజులు 5. విజయనగర రాజులు 6. తంజావూరు రాజులు.

**ఆంధ్ర రాజులు**

క్రీస్తు శకమునకు ముందే ఆంధ్రదేశములో సంగీత, నృత్య నాటకములను, వాద్యములను ప్రచారంలో ఉన్నట్లుగా మనకు స్పష్టంగా అర్థమవుతుంది. ఇది హాల శాతవాహనుని గాథాసప్తశతిని బట్టి ఋజువు అవుతున్నది. హాల శాతవాహన మహారాజు క్రీ.శ. ప్రథమ శతాబ్దికి చెందినవాడు అని పరిశోధకులు అభిప్రాయం. దీనిని బట్టి క్రీ.శ. ప్రారంభం నాటికి ఆంధ్రదేశంలో వాద్య గాన నాటక నృత్యము ప్రచారంలో ఉన్నట్లు చెప్పవచ్చు. గాథాసప్తశతితో పాటు చెప్పుకోదగిన గ్రంథం భరతముని నాట్యశాస్త్రము. ఇది క్రీ.శ. ప్రారంభ కాలానికి సంబంధించినదని విమర్శకుల భావన. దీనిని బట్టి చూస్తే క్రీ.శ. ప్రథమ శతాబ్దానికే ఆంధ్రులు లలితకళల విషయంలో ఎంతో అభివృద్ధి సాధించారనేది అర్థం అవుతుంది.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5 42 హైదరాబాద్ ఏప్రిల్ : 2025



నాట్యశాస్త్రం తర్వాత చెప్పుకోదగిన గ్రంథము అభినయ దర్పణము. ఈనాడు విరివిగా ప్రచారం పొందిన కూచిపూడి, భరతనాట్యములకు, నాట్యశాస్త్రములకు పత్రిక అనేటువంటి ఈ అభినయ దర్పణమే ఆధార గ్రంథము.

అమరావతి, నాగార్జునకొండ మొదలైన ప్రదేశాలలో బయటపడిన బౌద్ధశిల్పాలు ఆంధ్రుల లలితకళలు, నిరంతరంగా అభివృద్ధి చెందుతున్నాయి అనటానికి నిదర్శనంగా ఉన్నాయి. దీనిని బట్టి చూస్తే ఆంధ్ర రాజులు మంచి కళాహృదయంతో నాటక ప్రక్రియకు పెద్దపీట వేసి నాటకాన్ని ప్రోత్సహించారని చెప్పవచ్చు.

**చాళుక్య రాజులు**

వీరి కాలంలో అనేక రకాల నాట్యశాలల పోషణకై భూవసతులు ఏర్పాటు చేసినట్లు రాజరాజకులోత్తుంగని శాసనము వలన మనకు తెలుస్తుంది. ఆనాడు ఆంధ్ర, కర్ణాటక సీమలలో అనేక దేవాలయాల యందు నాట్యమండపములు నిర్మించినట్లు శాసనముల ద్వారా తెలుస్తుంది. తెలుగుభాషలో లభించిన మొదటి గ్రంథము నన్నయ రచించిన భారతము. శివరాత్రి ఉత్సవ సమయాన జరిగే ఆటపాటల గురించి సోమన విపులంగా వర్ణించాడు. ఈ విధంగా నాటి నాటక ప్రదర్శనములు, వినోద ప్రదర్శనములు అనేకం జరిగాయి. దీన్ని బట్టి చూస్తే చాళుక్యుల కాలంలో కూడా అనేక కళలు అభివృద్ధి చెందాయని చెప్పవచ్చు. మరీ ముఖ్యంగా నాటకం అనే ప్రక్రియకు కూడా ఎంతో ప్రోత్సాహం లభించిందని చెప్పాలి.

**కాకతీయ రాజులు**

కాకతీయ చక్రవర్తులందరిలోనూ గణపతిదేవుడు ముఖ్యుడు. ఈయన 60 సంవత్సరాలకు పైగా రాజ్యమును పాలించి, ఆ కాలంలో లలితకళలకు అధిక ప్రాధాన్యత ఇవ్వటం జరిగింది. ఆ కాలంలో ముఖ్యంగా తిక్కన, జాయన గురించి చెప్పుకోవాలి.

రెండవ ప్రతాపరుద్రుని కాలంలో (క్రీ.శ. 1290-1323) విద్యానాథుడు ప్రతాపరుద్ర యశోభూషణం అనే ఉత్తమ లక్షణ గ్రంథాన్ని రచించెను. సంస్కృతంలో నాటక లక్షణమును చెప్పిన ప్రథమ అలంకారికుడు ఇతనే అనవచ్చు. అగస్త్య విద్యానాథుని మేనల్లుడైన గంగాధరుడు మహాభారతమును నాటకీకరించెను. నాచన సోముడు. నాటకం, సంగీతం, నృత్యము, రంగస్థలము, కీలుబొమ్మలాట, తోలుబొమ్మలాట మొదలైన వాటి గురించి సందర్భోచితంగా వర్ణించటం జరిగింది. ఈ రకంగా చూస్తే కాకతీయుల కాలంలో అనేక కళలతో పాటు, నాటక రంగానికి కూడా ఎనలేని ప్రోత్సాహం జరిగినట్లు తెలుస్తోంది.

**రెడ్డిరాజులు**

రెడ్డిరాజుల కాలంలో సుప్రసిద్ధ తెలుగు కవి శ్రీనాథుడు, తెలుగు నాటక లక్షణములను గురించి ప్రత్యేకించి చెప్పిన ప్రథముడు చిత్రకవి పెద్దనార్యుడు. సంస్కృత రూపకములను ప్రబంధీకరించిన వారిలో మంచన ప్రథముడిగా తెలుస్తుంది. ఇతను రాజశేఖరుని 'విద్దసాలభంజిక' అనే నాటకం అనుసరించి 'కేయూర బాహు చరిత్ర'మును రచించెను. ఈ కాలంలో వసంతోత్సవం కూడా ప్రధానమైనది. దీంట్లో నటులు నాటకంను చదివి రాజసన్మానం పొందేవారు. ఈ విధంగా రెడ్డిరాజులు కాలంలో నాటకం కూడా బాగా ప్రోత్సహించబడింది అని చెప్పాలి.

**విజయనగర రాజులు**

శ్రీకృష్ణదేవరాయల కాలము లలితకళల అభివృద్ధికి పెద్దపీట వేసింది. కృష్ణదేవరాయలు స్వయంగా 'జాంబవతీ కళ్యాణం' అనే సంస్కృత నాటకాన్ని రచించెను. క్రీ.శ. 1514 నాటి ఒక శాసనములో రాయల నాటి నటుల పేర్లు పేర్కొనటం విశేషం. వీరి కాలంలో కళారంగం విలసిల్లిందని చెప్పాలి.

**తంజావూరు రాజులు**

రఘునాథ రాయలు – విజయరాఘవులు ఇద్దరూ కూడా స్వయంగా సంగీత, సాహిత్య నాట్యవేత్తలగుట చేత వారు అనేక గ్రంథాలు రచించటం జరిగింది. వీరికాలంలో యక్షగాన, వీథి నాటకాలకు స్వర్ణయుగం అనవచ్చు. రఘునాథ నాయకుని రాజ్యంలో అనేక నాటకశాలలున్నాయని విజయ విలాసాన్ని బట్టి అర్థం అవుతుంది. రఘునాథుని నగరంలోనే 'నవరత్నమయమైన నాటకశాల' ఉన్నది. అంతేకాక మరోచోట శృంగాటకముల యందు కూడా నాటకశాలలు కలవు. విజయరాఘవుడు స్వయంగా అనేక యక్షగాన నాటకములను రచించాడు. విజయ రాఘవునివలే తంజావూరును పాలించిన మహారాష్ట్ర రాజులు కూడా తెలుగులో అనేక యక్షగానాలను రచించి ప్రదర్శించారు. ఈ విధంగా నాటక రంగానికి తంజావూరు రాజులు ఎంతో దోహదపడ్డారు.

అయితే ఈ రోజుల్లో రాజులు లేరు కానీ, నాటక రంగం ఇంకా తన ఉనికిని చాటుతూనే ఉంది. కానీ నాటకరంగం ఇంకా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని చెప్పాలి. అందుకు ప్రభుత్వం నాటక రంగానికి మరిన్ని ప్రోత్సాహకాలను అందించాల్సిన అవససం ఉంది. అప్పుడు మాత్రమే తెలుగు నాటక రంగం ఇతర రాష్ట్రాలతో పాటుగా మరింత దేదీప్యమానంగా వెలుగొందుతుంది.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5 (43) హైదరాబాద్ ఏప్రిల్ : 2025

# నీతి శాస్త్రము – తాళపత్ర గ్రంథము

డా. గంద్ర లక్ష్మణ రావు, విశ్రాంతాచార్యులు ఫోన్ : 98493 28036

(గత సంచిక తరువాయి)

**యథా విహంగాస్తరుమాశ్రయంతి నద్యో సాగర మాశ్రయంతి**
**యథా తరుణ్యః పతి మాశ్రయంతి సర్వేజనా కాంచనమాశ్రయంతి**

**పద్యానువాదం :**

ఎట్లు పక్షులు చేరును చెట్లపైకి
ఎట్లు నదులన్నియును సంగమించు కడలి
ఎట్లు తరుణులు పతుల సన్నిధిని యుందు
రట్లు జనమంత పసిడికై యాశపడును

**అర్థం :** పక్షులకు వృక్షములే ఆధారం, గంగాది నదులు యెన్ని గలవో అన్ని సముద్రుని ఆశ్రయమే ఆధారం, స్త్రీలకు పురుషులే ఆధారం, అందరికీ ద్రవ్యమే ఆధారమనిన రీతి.

**ఆపదర్థే ధనం రక్షో ద్ధారాన్ రక్షో ధనైరపి**
**ఆత్మానాం సతతం రక్షో ద్ధారైరపి ధనైరపి – 74**

**పద్యానువాదం :**

ఆపదలయందు రక్షించు నదియె ధనము
అరయ భార్య బిడ్డల గాచు నదియె ధనము
తనకు సర్వమ్ములందున ధనము రక్ష
దార సుతులను రక్షించు ధనము నెపుడు

**అర్థం :** ఆపద వచ్చినపుడు ధనము వలననే రక్ష, దారపుత్రాదులు ధనము వలననే రక్షకం, తన సకల కార్యాలను ధనము వలననే రక్షకం, ధనమున్న భార్యనున్న తన ఆజ్ఞలో ఉంచి వారల నమ్మక ధనం వల్లనే సమస్త రక్షకం. అట్టి చేతనే గృహస్థాశ్రమమనిన రీతి.

**లుబ్ధమర్థేన గృహ్ణీయాత్ స్తబ్దమంజలి కర్మణా**
**మూర్ఖ ఛందాను వర్తంతి యథా వర్తే స పండితః – 75**

**పద్యానువాదం :**

లోభివానికి ధనమీయ లొంగియుండు
స్వాభిమానికి నతిజేయ సఖ్యుడగును
మూర్ఖునివిధానమును మెచ్చ మోదమందు
పద్ధతులివినేర్చిన గేస్తు పండితుండు

**అర్థం :** గృహస్థానం వాడు **లుబ్ధునికే ధనమిచ్చి తన వాన్ని గా జేసుకునేది. అభిమానిని చేతులు జోడించి మూర్ఖుడైన వాణ్ణి** వాని చిత్తమెట్లో అట్లే తనవాన్ని జేసుకున్నవాడే పండితుడునిన రీతి.

**పండితేషు గృహస్సర్వే మూర్ఖ దోషా పరంపర్ణా**
**అతస్మాత్మూర్ఖ లక్షపి ప్రజ్ఞామేకం నియోజయేత్ – 76**



**(పండితేచ గుణాస్సర్వే, మూర్ఖో దోషహి కేవలమ్**
**తస్మాన్మూర్ఖో సహస్రేషు, ప్రాజ్ఞః ఏకో విశిష్యతే ......చాణక్యనీతి సూత్రము)**

**పద్యానువాదం :**

పండితులమంచి గుణముల ప్రతిభ వలన
దుష్టులగు వారిదోషముల్ తొలగుచుండు
వక్రగుణముల నుండెడు వారినైన
చక్కగావంచి సరిచేయు జ్ఞానియొకడె.

**అర్థం :** పండితుడైన వాని సమస్త గుణముల వలన మూర్ఖుని దోషాలు ఒకటికటే విడిపోను తొలగించును. అదెట్లన్నను మూర్ఖుని దుర్గుణాలు వక్రమై వున్నను పండితుడు వొక్కడయ్యు మూర్ఖుని తలంపు తిరగవేశి మెడలు వంచుననిన రీతి.

**శుక్ల వ్యాధిర్ధనానాశశ్చ దేశాంతర గతశ్చ సహా**
**రదన్యశోకదగ్ధ స్వసుహుర్దర్శన మౌషధః – 77**

**పద్యానువాదం :**

తెల్పు రోగిని, సంపద డీలుపడిన
వాని, పరదేశమేగిన వాని, తనదు
భూమి యధికారమంతయు పోయినట్టి
వారి నెరాదరించుటమేలు వసుధయందు

**అర్థం :** తెల్పురోగం గలవాన్ని ద్రవ్యం పోగొట్టుకున్నవాన్ని తన దేశం విడిచి మరియొక దేశం పోయిన వాన్ని , తన క్షేత్ర పాత్ర రాజత్వం భూమిని విడిచి అతిదుఃఖం పొందినవారిని జూచి ఆదరించినదే మంచిదనిన రీతి.

**ప్రస్తావ్యమృతం వాక్యం స్వభావన్యదృశం ప్రియాః**
**ఆత్మ శక్తి యథాక్రోధం యోజనానపి పండితః**

**పద్యానువాదం :**

పలుకుసందర్భమునుబట్టి పలువురకును
అమృతమొలుకగ మాటల నాడవలయు
ఎపుడు కోపింపవలయునో యెరుగునతడె
ప్రజ్ఞగలవాడు యోచించ పండితుండు

**అర్థం :** ప్రస్తావనకు తగిన అమృతపు మాటలాడినను యెవ్వరు యే ప్రియము పల్కినా వారికి తగిన ప్రియములు...(పలుక వలయును. ఎపుడు కోపానికి రావలెనో తెలిసిన వాడే పండితుడు)

11 వ ఆకు లేదు.

12 వ ఆకు

**ఆహారం జాయతి వ్యాధి క్రూరగర్భంచ మైథునాత్**
**శ్రియం హరతి నిద్రాచ స్వాధ్యాయం మరణం ధృవం - 88**

**పద్యానువాదం :**

అసురసంధ్యల వేళల ఆలుమగలు
కలియ,క్రూరసంతానమే కలుగు చుండు
అట్టి వేళలనిద్రించ ఆయువుచెడు
వేదపఠనమ్ము ప్రాణమువిడుచుటగును

**అర్థం :** సంధ్యాకాలమున భోగం రోగోత్పత్తి, మైథునం క్రూరపువాడు పుట్టును, నిద్ర ఆయువును, భాగ్యమును హరించును. వేదము సంధ్యాకాలాన చదివితే వానికి మరణమే సిద్ధించును.

**నక చిత్తంచ భిన్నంచ మానావమానాని జాయతే**
**మిత్రస్యాం రిపూన్ హంత్రి రిపూన్ సరిమిత్రస్తదా - 89**

**పద్యానువాదం :**

అవసరముబట్టి మిత్రులై యవలవీడు
నట్టి వారికై పరులతో ఆగ్రహింప
తనదు గౌరవమంతయు తరిగిపోవు
నంత ఆత్మాభిమానమ్ము నడుగు బట్టు

**అర్థం :** తనకు కొన్ని దినములు చుట్టమై కొన్నిదినములు విడిచేది, అదెట్లన్నను వాని శత్రుల మీదికి వీని అభిమానమునకు పోయి వీని మానాభిమానాలు వాని నిమిత్తం పోవును.

**అగ్నిరాపస్త్రియో మూర్ఖ సర్పరాజ కులేషుచా**
**నిత్యం యత్నేన శైవం తేసద్య ప్రాణి హరావిషత్ - 91**

**పద్యానువాదం :**

మందు చున్నట్టి యగ్నిని మలిన జలము
వనితలను మూర్ఖులను మరి పాలకులను
పాములను,వీరి నార్గుర భక్తి తోడ
కొలిచినను గాని ప్రాణముల్ తొలగు నిజము.

అర్థరా అగ్ని వైరుత్యాన్ని, ఉదకం, స్త్రీలను మూర్ఖులను రాజులను సర్పాలను నిత్యం భక్తి కొలది నమ్మి సేవిస్తే ఆరుగురు ప్రాణహతం చేతురనిన రీతి.

**.....కోవిచారం సమర్థానాం,కిం దూరం వ్యవసాయినాం**
**కో విదేశశ్చ విద్యానాం తష్ణ ప్రియవాదినామ్ - 92**

( కో2తి భార్థ సమర్థానాం కిం దూరం వ్యవసాయినాం
కోవిదేశ్ణ స విద్యానాం క్ష పర్ణ ప్రియవాదినామ్ ...చాణక్యనీతి )

**పద్యానువాదం :**

కార్యసాధకులకునేది కాదు బరువు
దున్ని పండించు వానికిదూరమేమి
విద్యగలవానికివిదేశ భేదమేమి
ప్రియముపల్కినచో శత్రువెవ్వరింక

**అర్థం :** సమర్థునకు ఎంత పెద్ద కార్యం బరువు లేదు. వ్యవసాయం జేశేటువంటివానికి దూరమనిలేదు.విద్యగల పండితునికి యాదేశం ఆ దేశం అని లేదు. పెద్దలు తపస్సంపన్నులు యితరులతో ప్రియ వాక్యాలే చెప్పుదురనినరీతి.

**లోకయాత్రా భయం లజ్జా దాక్షిణ్యం ధర్మ శీలతా**
**పంచయస్మిన్ న విద్యంతే నకుర్యాత్తేన సంగతమ్ - 93**

**పద్యానువాదం :**

లోకయాత్రల జ్ఞాన వివేక మొకటి
పాపముల పట్ల భీతియు, పరుల పట్ల
దయయు,ధర్మము,శీలము నయిదు మంచి
గుణము లను గల్గువారితో కూడియుండు.

**అర్థం :** లోకంలోగల పుణ్య యాత్రలుచూచిన భయమున్ను, లజ్జనున్ను, దాక్షిణ్యం, శీలం,ధర్మము అను ఈ అయిదు గుణములు గల కుటిలం లేని వారితో చెలిమి చేశేదనిన రీతి.

**దైవాధీనం జగత్సర్వం మంత్రాధీనం దైవతం**
**మంత్రం బ్రాహ్మణాధీనం తస్మాత్ బ్రాహ్మణదైవతః - 94**

(........ బ్రాహ్మణో మమ దైవతమ్.....అనిపాఠాంతరము)

పద్యానువాదం :

జగము సర్వము దైవవశమ్మునుండు
దైవముండు మంత్రమున కధీనమగుచు
బ్రాహ్మణులనోట మంత్రము పలుకబడును
కనుక బ్రాహ్మడే దేవుడు మనకు నెల్ల.

**అర్థం :** జగత్తు దైవాధీనం. దైవం మంత్రాధీనం. మంత్రం బ్రాహ్మణాధీనం. అటు గన్క వేదమున్ను శాస్త్రమున్ను, యజ్ఞములు నడిపిన బ్రాహ్మణుడే దైవమన్న రీతి.

# భారతీయ యోగ శాస్త్ర పరిచయం

**కె. సరితా దేవి,** యోగ ఇన్స్ట్రక్టర్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, ఫోన్ : 9490 993379

**పరిచయం :**

ప్రస్తుత ఆధునిక సమాజంలో అనేక సౌకర్యాలు, భోగభాగ్యాలు ఉన్నప్పటికినీ మానవులకు మనఃశాంతి కరువైపోతున్నది. శాంతి లేనప్పుడు ఎన్ని సౌకర్యాలు ఉన్ననూ నిరర్థకమే కదా! నేటి సమాజంలో మనిషి అనేకరకాలైన శారీరక, మానసిక, ఆర్థిక, సాంఘిక వృత్తి పరమైన, ప్రకృతి పరమైన మార్పుల వలన ఎన్నో ఒత్తిడులకు లోనవుతూ జీవన విధానం అస్తవ్యస్తం చేసుకుంటున్నాడు. ఇటువంటి పరిస్థితుల్లో మనిషిని వీటన్నింటి నుండి బయట పడేయగల ఏకైక మార్గం యోగా మార్గం. అది మన పూర్వీకులు మనకు అందించిన గొప్ప వరం. చక్కని జీవిత విధానాన్ని అందిస్తూ ఎన్ని ఎల్లవేళలా సుఖశాంతులతో ఉండడానికి మరియు సమాజం లోని అందరూ ఆనందంగా కలిసి మెలసి జీవించుటకు తగిన మార్గము నిర్వహించబడినది అదియే యోగ మార్గం.

అది షట్ దర్శనాలలో ఒకటైన యోగదర్శనం. దీనిని మనకు శాస్త్రీయబద్ధంగా, సులభతరంగా క్రోడీకరించి అందించిన వారు పతంజలి మహర్షి. యోగా అనే పదం యుజ్ అనే సంస్కృత ధాతువు నుండి తీసుకొనబడింది. యుజ్ అనగా కలయిక అని అర్థం. అనగా జీవాత్మ పరమాత్మల కలయికయే యోగము. ప్రాథమిక దశలో శరీరము, మనసుల కలయికగా చెప్పవచ్చును. యోగ సాధన ద్వారా శరీర ధారుఢ్యము పెంపొందించుకోవడం వివిధ అనారోగ్యాల నుంచి రక్షించుకొనటమే కాకుండా సమాజంలో అనేక ఆకర్షణల నుండి మనసును రక్షించుకొని మనసును అదుపులో ఉంచుకొనడమే ఈ సాధన ఉపయోగపడును.

సనాతన పద్ధతులలో రూపొందించబడిన ఈ యోగసాధన జాతి, కుల,మత, లింగ వర్ణబేదములు లేకుండా అన్ని వర్గముల ప్రజలను అనుగుణంగా సాంప్రదాయ పరిస్థితులను అనుసరిస్తూ శాస్త్రీయంగా రూపొందించబడినది. ఈ పద్ధతి ద్వారా సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం కలిగి తమయందే శాంతి సౌఖ్యాలను పొందగలరు. వ్యక్తిశాంతియే ప్రపంచశాంతికి మూలము అని యోగ క్రియ ద్వారా నిరూపించ బడుతుంది.

అనేక యోగ విధానములున్ననూ కర్మ, భక్తి, జ్ఞాన రాజయోగములే ప్రధానమైనవి. ఫలాపేక్ష లేని సేవయే కర్మ సిద్ధాంతమునకు మూల సూత్రము. తనను తాను భగవంతుని సేవకు అర్పించుకొనుటయే భక్తి మార్గం. ఆత్మ విచారణ, ఆత్మ విశ్లేషణయే జ్ఞానమార్గం. మంత్ర, లయ, హఠ యోగములు రాజయోగమునకు పూర్వాంగములు. మంత్ర యోగం అనగా గురువు ఉపదేశించిన




మంత్రమును 12 సంవత్సరాలు విడవకుండా జపం చేయుట. లయ యోగం అనగా తన మనస్సును తానే ఆరాధించు చిహ్నముతో కలిపి ఉంచి క్రమంగా అందు తాదాత్మం చెందుట. హఠయోగమనగా సూర్యచంద్రాదులు అనుసంధానం చేసి క్రమంగా సుషుమ్న నాడిని మేల్కొలిపి ప్రాణమును సుషుమ్నాలో ప్రవేశింప చేయుట ద్వారా కైవల్యము పొందవచ్చును.

రాజయోగం అనగా మనసును, ప్రాణమును అదుపులో ఉంచు కొనుచు కుండలినీ శక్తిని మూలాధారం నుండి సహస్రారమునకు వెన్నుపూసలోని సుషుమ్న నాడి ద్వారా ఊర్ధ్వ ముఖముగా నడిపించి సమాధి స్థితిని సాధించవచ్చును.

పైన తెలిపిన యోగ పద్ధతుల్లో సులభమైన మార్గమును నిర్ణయించుట వ్యక్తి యొక్క స్వభావము, సంస్కారము, జీవన దృక్పథము సాధన స్థితిపై ఆధారపడి ఉంటుంది. సులభమైన మార్గమును ఎంచుకొనుటకు సాధకుని యొక్క స్థితిగతులే ప్రధాన కారణం. భావావేశం గల సాధకులు భక్తి మార్గము. బుద్ధి వికాసం ఉన్నవారు జ్ఞానయోగాన్ని అనుష్ఠిస్తారు. పతంజలి మహర్షి చెప్పిన అష్టాంగ యోగము సరైన రీతిలో అనుసరించిన ఏ సాధకుడైన తన గమ్యాలను సులభంగా చేరుకొనగలడు.

ఆత్మజ్ఞానం పొందుటకు శాస్త్ర జ్ఞానంలోనూ, అనుభవ జ్ఞానం లోనూ నిష్ణాతుడైన సద్గురు యొక్క మార్గదర్శకత్వం తప్పనిసరి అవసరం. శిష్యుని యొక్క అంతరంగిక పరిణతి గ్రహించిన గురువు తగిన సాధన మార్గమును సూచించగలడు. గురువు నిర్ణయించిన సాధన క్రమమను శిష్యుడు కచ్చితంగా పాటించినచో తన గమ్య స్థానం సులువుగా చేరుకోగలడు.

శరీరము మనసులను అదుపులో ఉంచుకొను సాధకుడు సులభంగా తనలోని ఆత్మ తత్వమును తన మనసు ద్వారా సాధించును. దీనినే జ్ఞాన యోగమందురు. స్వయం నియంత్రణ లేని సాధకుడు పతంజలి మహర్షి తెలిపిన అష్టాంగ మార్గమును (యోగమును) అనుసరించి తన లక్ష్యమును సాధించగలడు. శరీరం ఏ విధంగా వివిధ అంగములు కలిగి ఉండి కలిసి పనిచేయునో, అదే విధంగా అష్టాంగ యోగమును ఎనిమిది అంగములు కలిగి విడివిడిగానూ, కలిసి పని చేయను.

ఆ ఎనిమిది అంగములు :

1. యమము 2. నియమము 3. ఆసనము 4. ప్రాణాయామం 5. ప్రత్యాహారము 6. ధారణ 7. ధ్యానము 8. సమాధి

యమ – నియమ – ఆసన – ప్రాణాయామ –ప్రత్యాహార – ధారణ – ధ్యాన – సమాధయో 'సావంగానే' (పతంజలి యోగా సూత్రాలు : సాధన పాదము 29 వ శ్లోకము)

**అహింసా – సత్యాస్తేయ – బ్రహ్మచర్య అపరిగ్రహ యమాః**

(పతంజలి యోగా సూత్రాలు : సాధన పాదము 30 వ శ్లోకము)

అహింస, సత్యము, ఆస్తేయం, అపరిగ్రహం, బ్రహ్మచర్యము అనే ఐదు యమాలు, మొదటగా ప్రతి మనిషి సమాజ శ్రేయస్సు కోసం పాటించదగినవి. తర్వాత అంగాలు అయిన నియమము, అసనాలు పాటించటం ద్వారా శారీరక వికాసం కలుగును.

**శౌచ – సంతోష– తపః స్వాధ్యాయేశ్వర ప్రమీదానాని నియమాః**

(పతంజలి యోగా సూత్రాలు: సాధన పాదము 32 వ శ్లోకము)

శౌచం, సంతోషం, తపస్సు, స్వాధ్యాయం, ఈశ్వర ఆరాధనం అనే నియమాలు వ్యక్తి శ్రేయస్సు, శారీరక వికాసమునకు తోడ్పడును. ప్రాణాయామము, ప్రత్యాహారాలు మానసిక వికాసమునకు తోడ్పడును. ధారణ, ధ్యాన, సమాధులు ఆధ్యాత్మిక వికాసమునకు తోడ్పడును.

**ఆసనములు :**

ఆరోగ్య ప్రాప్తికి, రోగనిరోధమునకు రకరకాల ఆసనములు కలవు. మనసును స్థిరమగుటకు, ఆత్మవికాసమునకు స్థిరంగాను, సుఖంగాను ఒకే ఆసనాల్లో రెండున్నర గంటలు ఉన్నచో ఆసన సిద్ధి కలిగినట్లుగా పరిగణించబడుతుంది. ఏ ఆసనం వేసినప్పుడైనా మన దృష్టిని భ్రూమధ్యమునందు ఏకాగ్రం చేయవలెను. దృష్టి అనగా చూపు, మనసుల కలయికే.

**ప్రాణాయామం :**

ప్రాణాయామం అనగా ప్రాణమును ఆయాయము చేయుట. అనగా ప్రాణ శక్తిని విస్తృత పరుచుట మరియు స్వాధీన పరచుకొనుట. శరీరంలో ప్రాణం ఉన్నట్లు తెలుసుకొను గుర్తు శ్వాస. శ్వాసకు ప్రాణమునకు – శ్వాసకు దృష్టికి– శ్వాసకు మనసుకు సంబంధం కలిగి ఉన్నది. కావున శ్వాస ద్వారా ప్రాణమును దృష్టిని మనసును స్వాధీన పరుచుకోవచ్చు.

**ప్రత్యాహారం :**

ఇంద్రియాలు తమ నియమాలను విసర్జించి, చిత్తస్వరూపాన్ని పొందటమే ప్రత్యాహారం. అనగా ఇంద్రియముల వశీకరణం, ఇంద్రియములను అంతర్ముఖం చేయడం ద్వారా సాధ్యమవుతుంది. మనసు ధ్యేయమును విడిచి తన ఇష్టం వచ్చినట్లుగా ఇతరత్రా పోయినప్పుడు ఆ మనస్సును ధ్యేయమునకు తీసుకొని వచ్చుటయే ప్రత్యాహారం.

**ధారణ :**

**దేశ బంధతశ్చిత్తస్య ధారణః** (విభూతి పాదం 1 వ శ్లోకం)

ఏదో ఒకచోట చిత్తాన్ని నిలపడమే ధారణ. శరీరంలో కానీ, బాహ్యంలో ఒక వస్తువు మీద కానీ, స్థలం మీద గానీ, ఏదో ఒక అవలంబాన్ని ఆశ్రయించి మనసును నిలపవలెను. ఇట్లా నిలిపినచో చిత్తమునకు చలనము కలగదు. అట్టి స్థితియే ధారణ అనబడును.

**ధ్యానము :**

**తత్ర ప్రత్యైకాతనతా ధ్యానం.**

ఏక భావ ప్రవాహ రూప జ్ఞానమే ధ్యానం. ధ్యేయం నందు లేదా దేని యందు అయినా మనస్సు సంపూర్ణంగా ఏకాగ్రము అయినచో అదియే ధ్యానము.

**సమాధి :**

**తదేవార్ధమాత్రవిర్భాసం స్వరూప శూన్యమివ సమాధిః** (విభూది పాదం 3 వ శ్లోకం)

రూపాన్ని వదిలి అర్థాన్ని మాత్రమే భాసింప చేస్తుంటే దాన్ని సమాధి అంటారు. అనగా ధ్యానమునందు మొదట ధ్యాత (ధ్యానించువాడు) ధ్యేయము (ధ్యానింపబడినది). ధ్యానము అను క్రియ ద్వారా క్రమక్రముగా ధ్యాత ధేయమే తానై పోయేడి స్థితియే సమాధి స్థితి అనుబడును.

పై విధానాలను అనుసరిస్తూ సాధకుడు తన శరీరం దానికున్న లోటు పాట్లు, సమర్థతను ఏ విధంగా సాధనకు ఉపయోగించు కోవడానికి మలుచుకోవాలో, మనస్సుకున్న బలాలను, లోపాలను సమర్థతను విశ్లేషించి సాధన అభ్యాసానికై ఎలా ఉపయయుక్తంగా మలచుకోవాలో, అలాగే ఆత్మ విద్యకై ఆత్మ తత్వాన్ని అధ్యయనం చేయడం ద్వారా లోపాలను తగ్గించుకుంటూ అర్హతలను పెంచుకుంటూ విశ్వాసాన్ని, సంకల్ప బలాన్ని, ఏకాగ్రతను పెంచుకుంటూ సాధన అభ్యాసాలలో వృద్ధి పొందాలని ఆశిస్తున్నాం.

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5  హైదరాబాద్ ఏప్రిల్ : 2025

# శ్రీరామా యను దివ్య మంత్ర జపమై...

జి. లింగేశ్వర శర్మ, ఫోన్ : 960 338 9441

శ్రీరామా యను దివ్యమంత్ర జపమై; సిద్ధించు కార్యంబునన్!
ధారాళమ్ముగ మారుతాత్మజుడు తా; తాదాత్మ్య చిత్తంబుతో!
నోరారన్ జపియించుచుండి కదిలెన్; నుత్సాహముప్పొంగగా!
ఆరామాద్భుత కార్యమందు నిలచెన్నా జ్ఞానువర్తుండుగా!

కౌసల్యా ప్రియనందనా! రఘువరా! కాకుత్థ్సవంశోద్భవా!
శ్రీసాకేతపురాధిపా! జనహితా! సీతామనోవల్లభా!
బాసన్దప్పని సత్యధర్మవ్రతుడై పాటించు శుద్ధాత్ముడై!
దాసాదాసుల ధైర్యశౌర్యమిడుమాలి దైవజ్ఞ దైవాంశకా!

రామా! సర్వసులక్షణా! గుణనిధీ! రాజీవపత్రేక్షణా!
ధీమా వీరపరాక్రమాది పురుషా! దేదీప్యమానప్రభో!
శ్రీమాత్రా శ్రితవత్సలా! రఘుపతే! చిన్మంగళాకార! శ్రీ
రామా! ధర్మపరాయణా! శుభకరా! రాకేందుబింబాననా!

ధర్మాచార పరాయణా రఘుపతే! దైత్యాంశసంహారకా!
కర్మాచార పరాయణన్! వదలకన్ కర్మాంగతాధర్మ! స
త్కర్మల్నెన్నియొ నాచరించితివిగా ధర్మంబురక్షించ దు
ష్కర్ముల్నంతము జేసినావు నిలలో సంక్షేమరాజ్యమ్ముకై

శ్రీరామా! పురుషోత్తమా! సురవరా! సీతామనోవల్లభా!
ధీరోదాత్త గుణోత్తమాది సుగుణా! దివ్యాంశ సంభూత హే!
కారుణ్యామృత చిత్త సత్యహృదయా! కాకుత్సవంశోద్భవా!
ఆరాధింతుము రామచంద్రకలి నిన్నాదర్శమీవేఁగదా!

సీతారాముల జంట యీ పుడమిలో స్త్రీజాతి కాదర్శమై!
ప్రీతిన్ బంచుచు నెల్లవేళ మిగులన్ ప్రేమానుబంధమ్ముతో!
జాతిన్నిల్చిన మానవాళికెపుడున్ సంసారబంధమ్ములో!
ఖ్యాతిన్ పొందిరిలోకమందు మిగులన్ కైమోడ్చి ప్రార్థించగన్!

హే! భద్రాచల రామభద్ర వినుతా యిక్ష్వాకు వంశోద్భవా!
ప్రాభాతమ్మున నిద్రలేచి శుచితోలి ప్రార్థించగా భక్తితో!
శోభాలంకృత దివ్యరూపముగ నీలి స్తోత్రంబు గావించుచున్!
సౌభాగ్యమ్ముల నందజేసెదవుగాలి సద్భక్తపాలాత్మకా!

క్షామంబన్నది లేకసాగెనుగ దాలి కర్తవ్యమున్ వీడకన్!
క్షేమంబేమది నిండియుండ సతమున్ కీర్తించి శ్లాఘించు నీ!
ధామంబవ్వగ రామరాజ్య మవనిన్ ధర్మంబు సంశోభిలన్!
నేమంబెన్నడు వీడకుండ నిలచెలిన్నిక్ష్వాకు వంశోద్భవా!

రాకా చంద్రసమాన భాసవదనా! రాజీవ పత్రేక్షణా!
శోకాతప్త నివారణా! రఘుపతే శుద్ధాంతరంగాత్మకా!






శ్రీకారంబిడి రామనామ జపమున్ శ్రేయంబులందించగా!
సాకారమ్మగు వాంఛితార్థ ఫలముల్ సాయుజ్యమందించగన్!

ఆకారమ్మది సత్యధర్మములకున్ నాదర్శవంతంబుగా!
లోకమ్ముందున మానవాళికివియే లోకోపచారంబులై!
శోకంబన్నది పార ద్రోలిమిగులన్ శోభాయమానంబులై!
నాకంబౌ నిలరామనామ స్మరణన్ నాశీస్సులందించగన్!

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5 48 హైదరాబాద్ ఏప్రిల్ : 2025

# విశ్వావసు ఉగాదికి ఆహ్వానం ...

**కుంతి, ఫోన్ : 87909 20745**

వికసిత వదనాంబుజివై,
ప్రకటిత ప్రేమాంబుధివయి, వరదాయినివై
సకలేప్సితములిడగ , నీ
దు కరుణను కురియగ రమ్ము నేస్తము వగుచున్!

త్రాతవు,మాతవైశుభవిధాతవు, దాతవు, నేతవై! మనో
ఘాతపు తాపహారివయి! కాంతికి,శాంతికి దూతవై! యశో
నైతిక మార్గదాయివయి! నవ్య పథంబుకు సూచివై! ఉగా
దీ!త్వరితంబె రా వలయు -దీన జనాభ్యుదయంబు కోరుచున్!

కవుల విశేష కావ్య రసగాన సుధాంబుధియందు మున్గగన్
చివురులు మెక్కుకోయిలలు జేయుకచేరిని యాలకించగన్
నవ కుసుమంపు శోభలు మనంబునకింపును గొల్పువేళలన్
దివి దిగిరమ్ము! బిడ్డలకు దీవనలీయగ నూత్న వర్షమా !

వేతన జీవులన్ గనుచు, బెంగను దీర్చుచు తుష్టి గూర్చగన్
నాతుల బాధలన్ గనుచు, నాయము జేయుచు హేలగూర్చగన్
రైతుల బాధలన్ గనుచు, రాతను మార్చుచు నెమ్మిగూర్చగన్
ప్రీతి యొనర్చుచున్ భువికి వేగమె రమ్ము! యుగాది వేడ్కతో!

అయ్యో !యేమని చెప్పుదున్ ప్రజల యాహాకారమాక్రందనల్
కుయ్యో మొఱ్ఱులు !భీకరార్తి యెదదన్ ఘోశించు తాపంబులున్ !
వెయ్యేలన్ చవిచూచుచుంద్రి నరకంబీ నేల పై! చూపుమా
నెయ్యమ్మున్! ప్రియ వర్షమా! తవమనో నేత్రంబు తో గాంచుచున్!

ఉద్యోగులకు ముదంబును!
విద్యార్థులకు విజయమును! వినుత వ్యవసా
యోద్యమ రైతుకుఫలమును!
హృద్యంబుగ నిడ యుగాది ! యిలకున్ దిగుమా !

వినుమా క్రోధి యుగాది ! రైతుల ఘన స్వేదంబు ధాన్యంబుగన్,
ఘనిలో చిందిన కార్మికస్వజము బంగారంబుగా మారినన్!
అనిలో సైనిక విక్రమంబు జన రక్షాంగంబుగా నిల్చినన్ !
జనులానందము గాంచినన్ నదియె విశ్వా నంద విశ్వావసున్!

ఆశా పలాశ ములవని పై రాలినా
చెలగి మొలకవోలె చివురు లెత్తు!
కష్టాల వడ గాడ్పు క్రమ్ముకున్న
చైత్ర తరువు వోలె సాగి నిలుచు!
జీవన రాగాల చిత్ర గీతాలను
పరవశిం చు పికమై పాట పాడు




మండు వేసవిలోన మనుజాళి ముదము కై
మరు మల్లి యైపరిమళము గూర్చు
సప్త వర్ణ శోభిత మగుచు సకల మోద
చిహ్నమగుచును చిగురాకు చీర కట్టి
ప్రకృతి కాంతఉగాది రూపమున భువిన
నిలిచె నరులకు నమృత ధారలను గురియ!

నశ్వరమిది నరుని బ్రతుకు
శాశ్వతమ్మగునె యని దలచు జనులకు మదిలో
విశ్వాసము పాదు గొలుప
విశ్వావసు భువిని జేరు వేవరములతో!

ఆరు శత్రువుల దునుముట రయజేయ
ఆరు రుచుల మర్మంబునరయ జేయ
ఆగ్రహా శ్చర్య మోద భయాది ఆరు
గుణములను సమముగ జూచు కూర్మి జూప
ఆరు ఋతువుల రాణిగా నరుగు దెంచు!

కట్టెదము తోరణములను
పట్టెదమిక హారతులను పరవశమున జే
కొట్టెద మో విశ్వావసు
పుట్టెడు ఆశలను దీర్చు పూజ్యుని వనుచున్!

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5 (49) హైదరాబాద్ ఏప్రిల్ : 2025

# జానపద కళా సంపద – సామాజికత

(ఆచార్య తూమాటి దొణప్ప గారి శతజయంతి సందర్భంగా)

**ఆచార్య ఎం. గోనా నాయక్,** తెలుగు శాఖ, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం. ఫోన్ : 984 909 33 00






జానపదం అంటేనే కళలు, సంస్కృతి, ఆచారాలు, ఆహార్యాలు, ఆటపాటలు. ఒక పరిమిత ప్రదేశంగాను, ఒక యూనిట్‌గా గుర్తింపబడిన ప్రాంతం గ్రామం అనవచ్చు లేదా నన్నయ గారన్నట్లు 'జనపురిగా' అభివర్ణితమైన ప్రాదేశికతతో కూడిన ప్రదేశంగా చెప్పబడింది. దాదాపు ఈ భారతీయ సమాజంలో పదిన్నర లక్షల గ్రామాలు ఆవరించబడి ఉన్నాయి. మనకీ నాడు నగర సమాజాలుగా అభివర్ణితమై నగరాల మూలాలన్ని గ్రామీణ సమాజ సంస్కృతి ఆలంబన అంటే అతిశయోక్తి ఏమాత్రం కాదు. తెలుగు సాహిత్యావరణంలో జానపద సాహిత్యం, కళలు, జానపద విజ్ఞానం పేరుతో అనేక పరిశోధనలు చోటుచేసుకున్నాయి. ఈ పరిశోధనలకు భూమికగా విశ్వవిద్యాలయాలందించిన కృషికే అర్ధశతాబ్దం పై చిలుకు అవ్వడం గర్వకారణం. ఇది ఒక కోణం అయితే మరొక కోణంలో జానపదంలో పురాగాథలు, కథాగానాలు, యక్షగానాలు, బుర్రకథలు, పాటలు, ఆటలు మొదలైన అంశాలకు సంబంధించి ఎంతో శ్రమించి విషయసేకరణ చేసి కృషి చేసినవారు శ్రీ నేదునూరి గంగాధరం, ఆచార్య బిరుదురాజు రామరాజు, ఆచార్య నాయని కృష్ణకుమారి, రావి ప్రేమలత గార్లు. వీరు ఎంతో లోతులతో కూడిన పరిశీలనతోను, పరిశోధన నేపథ్యంలోనూ ఎంతో అమూల్య సంపద జానపద విజ్ఞానం పేరుతో అందించి తెలుగు జాతికి మేలు చేశారు.

ఇదంతా ఒక ఎత్తైతే భాష, జానపదాల పట్ల మక్కువతో తీవ్ర పరిశ్రమతో రేయింబవళ్ళు శ్రమించిన మహోన్నత వ్యక్తి ఆచార్య తూమాటి దొణప్ప గారు. తెలుగు జాతి ఉన్నంత కాలం నిలిచే ప్రామాణిక పరిశోధన **"జానపద కళా సంపద"** పేరుతో అందించారు. ఈ గ్రంథం మూడు సంపుటాలలో ఆవిష్కృతమైంది.

ప్రధానంగా ఈ 'జానపద కళా సంపద' గ్రంథంలో (ప్రథమ సంపుటంలో) ఆచార్య తూమాటి దొణప్పగారు రాయలసీమ జానపద కళా సంపదను దృశ్యమాన రీతిలో ఆవిష్కరించారు. ఈ జానపద కళా సంపద గ్రంథాల రచనలో దొణప్పగారు తిండిలేని పగళ్లను, నిదురకు దూరమైన రాత్రుల శ్రమ ననుభవించారనడానికి ఈ గ్రంథాల విషయ వివరణ, సేకరణ సమాచారాన్ని సమగ్రంగా సూదిగుచ్చినట్లు తెలియజేయడం ద్వారా వీరి అవిశ్రాంత శ్రమ ఏర్పరచుకున్న లక్ష్య సాధన బహిర్గతమౌతుంది.

ప్రతి విషయంలో వారు చూపిన శ్రద్ధ రాజీకి రాని నైజం ఈ గ్రంథాల మనుగడ విస్తృతవ్యాప్తం కావడానికి శాశ్వతంగా నిలవడానికి దోహదపడింది అన్నది నిజం. దీనికి ఋజువు ఈ గ్రంథానికి తొలి పలుకు రాసిన రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ గారు ప్రస్తావించిన ఈ మాటలు దొణప్ప గారి కృషికి ఆశాపూర్వకంగా అనిపిస్తాయి. ఆ మాటలు ఇలా ఉన్నాయి. **"నాగరికులు సూత్రబద్ధమైన వాఙ్మయ మద్దతుతో అంతఃశ్రద్ధ వ్యాసంగాలు జానపదులు స్వచ్ఛంద సాహిత్య వాఙ్మయమునందును చూపించేసి పెట్టినవారు చాలామంది దొరకరు. ఒకవేళ ఎవరైనా పూనికతో ముందుకు వస్తే వారిని మనీషులంటారు. అట్టి వీరిలో అగ్రగణ్యులు నా యెరుకలో శ్రీ తూమాటి దొణప్పగారు. వారు సమకూర్చిన యీ జానపద కళా సంపద తెలుగు వారంతా రెండు చేతుల స్వాగతింపవలసిన అపభ్రంశ కళా సంహిత".**

గ్రామ్యము, అపభ్రంశము అనే మాటలీనాడు మనకు అసహ్యమైన మైలపలుకులు. ఈ కారణంగా గ్రామ్యం అనే మాటను వ్యవహారికం అంటున్నాం. అమరసింహుడు (అమర కోశం కర్త) అపభ్రంశము, అపశబ్దము రెండు ఒకటే అని తెలిపాడు. అలాంటి దానికి ఒక ప్రయోజనాన్ని కలిగించి సమాజ ఎక్కింతగా మించిన మహనీయుల కారణంగా అది కావ్య సంహోతిగా ప్రకాశితమైంది. రాయలసీమ ప్రాంతం జానపద కళా సంపదను వెల్లడింపజేసిన చేసిన ఘనత శ్రీ దొణప్ప గారిదే. దానికి ప్రత్యేక కారణం వారి స్వీయాభిమానాలే ప్రధాన కారణం. దానికి ప్రత్యక్ష ఉదాహరణే ఈ గ్రంథం.

పైన పేర్కొన్న రాళ్లపల్లి వారి కితాబు ఈ గ్రంథానికే మకుటాయ మానంగా నిలిచింది. వ్యవహారంలో ఉన్న మాటను ఇక్కడ ప్రస్తావించాల్సిన అవసరం ఉంది. అదేమిటంటే సరైన అన్నంలోకి

సరైన కూర అన్నట్టుగా దొణప్ప గారి భావాలహరికి రాళ్లపల్లి వారి మాటలు కర్పూరహారతిగా పరిఢవిల్లింది.

ప్రధానంగా రాయలసీమలో పుట్టిన స్వచ్ఛంద సాహిత్యం ఎప్పుడు ఎలా మొదలైందో ఎంత విస్తరమైందో ఎవరెరగరు. కానీ దొణప్ప గారి ఈ గ్రంథంలో జానపద చిత్తవిలాసాలు, పురాణ వెన్నెలలు, భావాత్మకమైన భావనలు, అల్లిన కథలు, అనర్గళమైన ఆశా పాశాలు, గ్రహీత ధర్మ నీతి తత్త్వాలు ఎంతో స్పష్టంగా హృదయంగమంగా దొణప్పగారు ఈ గ్రంథంలో ఆవిష్కరించారు. జానపద విజ్ఞానం సామాజిక సంస్కృతిలోనూ, వ్యక్తి జీవితంలోని అన్ని విషయాలను తనలో ఇమడ్చగలిగినంత విశాలమైంది కావటం చేత దానికి ప్రత్యేకంగా వివరణలు అవసరం లేదు. అందుకే ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం గారు జానపదాన్ని దానికి సంబంధించిన వాఙ్మయాన్ని ప్రజా వాఙ్మయంగా అభివర్ణించారు. మహాభారతంలో జానపద శబ్దం గ్రామీణులు అని అర్థంలో చెప్పబడింది.

జానపద కళా సంపదలో భాగస్వామ్యం వహించిన జానపద గేయాలను జానపద గీతిక జాతికి జీవనాళిక అన్నారు ఆచార్య జయధీర్ తిరుమల రావు గారు. ఈ మాటలకు రూఢీగా దొణప్ప గారి ఈ గ్రంథంలో కలుపు పాటలు, మొహరం గీతాలు, జెట్టిజాము పాటలు పేర్కొన్నబడ్డాయి. ఈ పాటలతో పాటు మెఱవణి గద్య ఈ ప్రాంతపు ప్రత్యేకతగా దొణప్పగారు వివరణాత్మక విశ్లేషణను అందించారు. అలాగే విసురురాతి పాటల సేకరణ మాత్రమే గాక వాటిని ఉదాహరించిన వైనాలు చదువరులను ఆకట్టుకునేలా తెలియజేశారు. సామాన్యంగా జానపద కళా సంపద అనన్య సామాన్యమైనదని విషయం దొణప్పగారి ఈ గ్రంథంలోని వ్యాసాల ద్వారా వికాసవంతమైంది.

ప్రధానంగా సమాజం వికాసంతో అభివృద్ధి పథంలో పయనించ డానికి ఈ జానపద కళా సంపద ప్రధాన భూమిక వహిస్తుంది. జానపద కళా సంపదగా చెప్పబడుతున్నవన్నీ సామాజిక మానవావరణంలో బలమైన ప్రాతిపదికలంటే అతిశయోక్తి ఏమాత్రం కాదు. ఈ జానపద కళా సంపద వ్యాసాలలో తలమానికంగా చెప్పబడుతున్న వ్యాసాలలో తలమానికమైంది యక్షగానాలు ప్రాచీనాంధ్ర నాటక స్వరూపం అనే వ్యాసం. ఈ వ్యాసంలో సాహిత్య స్వరూపాలలో ప్రజా హృదయాలపై ఎనలేని అధికారం నాటకానికే ఉందని రసజ్ఞులంగీకరించరు అని దొణప్పగారు ఉటంకించిన మాటను పరిశీలిస్తే సామాజిక జీవనంలో జానపద కళారూపాలకున్న ప్రాధాన్యత అవగతమౌతుంది. ఈనాటి విషయం ఎలావున్నా ఒకనాటి జానపద ఆహార్య కళారూపాలలో యక్షగానాల ప్రభావం ఎంతగా ఆనాటి గ్రామీణులపై ఉండేదో అవగతమౌవుతుంది. ఆచార్య దొణప్ప గారు ఈ వ్యాసంలో బలమైన భూమికకు ప్రాతిపదికగా 1911వ సంవత్సరం ఉగాది ఆంధ్రపత్రికలో శ్రీ విక్రమ దేవవర్మ గారి భావజాలాన్ని ఉటంకించడం ఎంతో జ్ఞానాన్ని అందించినట్లుగా అనిపిస్తుంది.

'కురువంజి' అనే మాటలో ఒక ప్రత్యేకత కళారూపం అందులో కురువ అనునది పర్వత ప్రాంతం అనే అర్థంలో ద్రావిడ భాషలో సామాన్య వ్యవహారంలో తెలియజేశారు. అలాగే యక్షగాన ప్రక్రియను వేటూరి ప్రభాకర శాస్త్రిగారు తెలిపినట్లు పర్వత ప్రాంతం వాసుల కురవంజి ప్రదర్శన ప్రక్రియను జానపదులు గ్రహించి దానికి తగు మార్పులు, కూర్పులు చేసి యక్షగాన ప్రక్రియగా ప్రయోగం చేసి దానిని వ్యాప్తంలోకి తెచ్చారనడం యక్షగాన ప్రక్రియ మూలాలను వెలికి తీసినట్లుగా ఈ వ్యాసంలో దొణప్పగారు ఉటంకించారు. యక్షగానాలపై పరిశోధన చేసిన ఆచార్య ఎస్వీ జోగారావు గారి వివరణ కోణాన్ని దొణప్ప గారు ఈ వ్యాసంలో మరింత సుసంపన్నం చేశారు. అయితే ఈ వ్యాసం రాయలసీమ ప్రాంతాన్ని ఆవిష్కరించినా జానపద ప్రదర్శన కళగా యక్షగానం ఈ ప్రాంతాన్ని ఎంతగా ప్రభావితం చేసిందో అవగతమౌవుతుంది.

దొణప్పగారు ఈ వ్యాసంలో యక్షగానాలు ప్రదర్శించిన కాలంలో ఆయా ప్రాంతాల సామాజిక జీవన గతులను, సాంఘిక పరిస్థితులను, స్పష్టంగా యక్షగాన ప్రదర్శనలో తెలియజేయబడ్డాయని వివరణ ఇచ్చారు. అలాగే ఈ గ్రంథంలో కలుపు పాటలు వ్యాసంలో చేలలో కలుపుతీయుచు స్త్రీలు పాడే పాటలు. కలుపు పాటలు అని ప్రసిద్ధ జానపద విజ్ఞానంలో గ్రామీణ సమాజంలో ప్రధానంగా వ్యవసాయ నేపథ్యంలో కలుపు పాటల ప్రాముఖ్యతను స్త్రీల నేపథ్యంలో తెలియజేయడం ద్వారా ఎన్నో విషయాలందించారు. ఈ కలుపు పాటలను కాల నేపథ్యంలోనూ, కర్తల నేపథ్యంలో తెలియజేయడం పరిశోధన నిష్ణాతులుగా దొణప్ప గారు క్షేత్ర పర్యటన ద్వారా విషయ సేకరణ ఎంత పటిష్టంగా చేశారో అవగతమౌతుంది.

ఈ కలుపు పాటల నేపథ్యంలో మిరపచేలో దవన పున్నమ నుండి గౌరీ పున్నమి దాకను, వంగ తోటలో కాముని పున్నమి నుండి కారు పున్నమి దాకా కలుపులు తీస్తూ స్త్రీలు పాడే పాటలు రాయలసీమ నేపథ్యంలో విశ్లేషించడం ద్వారా ఎన్నో కొత్త విషయాలందించి నట్లయింది. ఈ వ్యాసంలో వారందించిన విషయ సామాగ్రి ఈనాటి నాగరిక సమాజంలో ప్రధానంగా నగర సమాజంలో తీవ్రమైన వేగవంతమైన కాలంలో అక్కడివారు తీసే పరుగులు ఒత్తిడిలు గ్రామీణ సామాజిక జీవనంలో ఉన్న సంతోషాలు తెలియని జీవితాలకు దొణప్ప గారి లాంటి పరిశోధకులు అందించే విషయాలు వ్యాసాల అంచనా వేయడానికి గర్వంగా మన దేశ గ్రామీణ సమాజ సంస్కృతి (జానపద కళల ద్వారా) అవగాహన చేసుకోవడానికి ఇలాంటి పరిశోధకుల వ్యాసాలు ఎంతో ఉపకరిస్తాయన్నది నిజం.

ఈ వ్యాసంలో అధికారికంగా వ్యవసాయ కలుపుల కూలీలందరూ స్త్రీలని మగవారు ఈ పనులకు పనికిరారని తెలియజేయడం ద్వారా గ్రామీణ సమాజంలో స్త్రీ శక్తికి ఉన్న బల నిరూపణను బహిర్గతం చేసిన సత్యంగా అనిపిస్తుంది. కలుపు పాటలు (స్త్రీలు పాడునవి) పాడే విధానం వివరణ చేస్తూ వ్యవసాయ క్షేత్రంలో వారి ప్రతిభకు తార్కాణంగా నిరూపితం చేశారు. పాట ఎత్తుగడ పాడే విధానంలో వంతల పాత్ర చరణాలు రెండుసార్లు పాడే విధానాన్ని తెలియజేశారు. ఒక రకంగా వీటిని వృత్తి కథాగానాలనవచ్చు. ఈ పాటలు పాడే నేపథ్యంలో కథా వస్తువులు వారి వారి ప్రాంతాల క్షేత్ర తీర్థమూర్తుల లీలా విలాసాలను పాడడం కూడా తెలిపారు.

ఇక జానపదులు జ్ఞానపదులనడానికి ఎన్నో తార్కాణాలు కనిపిస్తాయి. వీటికి ప్రత్యక్షోదాహరణలు ఆచార్య దొణప్పగారు. ఈ గ్రంథంలో కేవలం కలుపు పాటలకే పరిమితం కాక జన ప్రచారంలో ఉన్న యేబులేశు (నరసింహస్వామి) కథను బీబీ నాంచారి కథను ప్రాచుర్యంలోకి తెచ్చారు. ఆ కథల వెనుక కారణాలను గాథలను కూడా వివరణాత్మకం చేశారు. కుటుంబ వ్యవస్థ, విలువలు, అన్నదమ్ముల అనుబంధాలను ఈ కథల అంతరార్థ నేపథ్యాన్ని విపులంగా తెలియజేశారు. జానపదుల జనపద సమాజమే ఈనాటి నగర సమాజానికి పునాది అనేందుకు ఈ వ్యాసాలు బలంగా జ్ఞానసౌష్టవంతో అలరారాయి. పెన్నోబిలేశ నరసింహుని కథలో అన్నకు వివాహం కాలేదని అతన్ని వివాహానికి ప్రోద్బలం చేసి తమ్ముల స్థితిని తెలియజేస్తూ అన్నని బతిమలాడే వైనాన్ని ఈ విధంగా తెలియజేశారు.

**"పెండ్లాడు పెండ్లాడు పెండ్లాడుమన్న**
**పెద్దవాడవు నీవు పెండ్లాడకుంటే**
**ఈడోళ్ళ జోడోళ్ళ హీనమై పోతాము**
**సరి వాళ్ళ సందు నాసవొకలైతాము**
**అయిన వాళ్లంతా ఆడుకొందురు"(జానపద కళా సంపద పుట)**

పై పాటను పరిశీలిస్తే కాళిదాసు కుమార సంభవం పంచమసర్గలో సప్తర్షులు పరమశివుని సతీదేవి మరణానంతరం పర్వత రాజపుత్రి పార్వతిని పరిణయం చేసికొమ్మని చెప్పిన సంఘటన తలుపుకు వస్తుంది.

రాయలసీమ ప్రాంతపు పండుగల విశేషాల ప్రస్తావన చేస్తూ ముఖ్యంగా మహమ్మదీయుల మొహరం పండుగ విశేషాలను వివరిస్తూ దొణప్ప గారు రాసిన మొహరపు గీతకలు వ్యాసం జానపదాలలో ప్రధానంగా అన్ని మతాల వారి మధ్య ఉన్న ఐకమత్యంతో పాటు గ్రామీణ సంస్కృతిలో భాగస్వాములుగా ఉండే నేపథ్యాన్ని తెలియజేశారు. అలాగే హిందువులు ముస్లిం పండుగలలో (ముస్లిం సాధువులకు సంబంధించినవి) ఉరుసులు పరసలలో పాల్గొనే విషయాన్ని మతసామరస్య ధోరణిలో తెలిపారు. అలాగే ముస్లిం సాధు పురుషుల పేర్లుగా పెట్టుకోవడం కూడా సాంస్కృతిక నేపథ్యంలో వివరించారు.

ముస్లింలు మొహరం పండుగలకు చేసే ఊరేగింపును శహర్ గస్తు అంటారనే విషయం తెలపడం ద్వారా రాయలసీమ ప్రాంతంలో మొహరం పండుగకున్న ప్రాధాన్యతను తెలిపినట్లయింది. మొహర్రం పండుగలో ప్రాధాన్యత వహించే ఫకీర్లను జలాలికలు అంటారని చెప్పడమే గాక వీరు ఒక సంప్రదాయానికి ప్రాతినిధ్యం వహిస్తారనే విషయం వీరి వ్యాసంలో విషయ సేకరణ ఎంత పటిష్టంగా జరిగిందో అవగతమౌవుతుంది. ఈ ఫకీర్లను గురించిన విషయం నరసింహ శతకంలో **"ఆత్మకీర్తన సేయు హరి భక్తులేటికి కాకలు వేయ ఫకీర్లు కలరు"** అనే దాఖలాను కూడా చూపించారు. కలుపు పాటల్లో హిందూ దేవతల కథలు చోటు చేసుకోవడమే గాక మహమ్మదీయల కథలు కూడా దొణప్పగారు ఈ గీతాన్ని అందించారు. ఈ గీతంలో 'హసన్, హాసీనుల' అంగరంగ భోగాలను తెలియజేశారు.

జెట్టిజాము పాటల వ్యాసంలో జట్టి జామును సూచికార్థ సహితంగా వెన్నెల్లో ఆడుతూ పాడే పాటలుగా వివరించారు. వీటి తుల్యమైన పాటలు బతుకమ్మ పాటలుగా తెలంగాణలో ప్రసిద్ధములైనవి తలుపుకు వస్తాయి. అంతేకాక ఈ వెన్నెల పాటలు రాయలసీమలో ప్రాముఖ్యనొందితే ఒకనాటి శివకవి యుగంలో పాల్కురికి సోమన పేర్కొన్న అనేకరకాల పదాలలో (పాటల్లో) వెన్నెల పాటలున్నట్లు బహిర్గతమౌతాయి.

ఈ విధంగా దొణప్ప గారి జానపద కళా సంపద గ్రంథం జానపద విజ్ఞాన నేపథ్యంలో ఒక విజ్ఞాన సర్వస్వంగా అనేక కోణాల్లో ఎన్నో విషయాలను అందించింది. నిజానికి జానపద సమాజంలో ఉండే విలువలు, సంస్కృతి సంబంధ ఆచారాలు, కళలు, ఆటపాటలు, వృత్తి సంబంధ పాటలు (సాహిత్యం) తరగని సంపదగా వున్న వాటిని మనం నిలబెట్టుకోవాలి. దానికి ఉపకరణాలుగా ఇలాంటి గ్రంథాల ఆవశ్యకత ఎంతైనా ఉంది. అంతేగాక ఈ గ్రంథాలను పరిరక్షించు కోవాల్సిన అవసరం కూడా ఉంది.

దొణప్ప గారి ఈ కృషి శాశ్వత స్థితిని కలిగి ఉండడమే గాక ఒక ప్రాంతం (రాయలసీమ) జానపద సంస్కృతిని సుసంపన్నం చేయడమే గాక అధ్యయన, పరిశీలన, పరిశోధనకు అణువుగా ఉ ండడమే గాక భావి పరిశోధనలకు, పరిశోధకులకు కరదీపికగా ఉంటుందనడంలో ఏమాత్రం సందేహం లేదు. దొణప్ప గారి ఈ కృషి అజరామరంగా నిలుస్తుంది.



ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5  హైదరాబాద్ ఏప్రిల్ : 2025

# సాహిత్యంతో సమాజ పరిశీలన : రావూరి భరద్వాజ 'లోకం కోసం' కథల విశ్లేషణ

**డా. రమేష్ బుద్ధారం, క్రిష్ణమణి భాగవతి,**
సహాయాచార్యులు, ఇందిరాగాంధీ నేషనల్ ట్రైబల్ సెంట్రల్ యూనివర్సిటీ, అమర్ కంతక్, మధ్యప్రదేశ్. ఫోన్ : 9479390830

ప్రస్తుత కాలంలో తెలుగు సాహిత్యం పాతపాటగా మారిపోకుండా, సమాజంలోని ఆధునిక అంశాలను, మార్పులను, మరియు సమస్యలను చర్చిస్తూ నూతన రూపాన్ని స్వీకరిస్తోంది. రచయితలు కొత్త ఆలోచనలకు వేదికగా, ప్రజల చైతన్యాన్ని పెంచుతూ కొనసాగుతున్నారు. తెలుగు సాహిత్యం సమాజం కోసం కేవలం ప్రతిఫలనం కాదు. అది సమాజాన్ని మార్గనిర్దేశం చేసే దీపస్తంభం. అది సాంప్రదాయాలను కాపాడడమే కాక, కొత్త మార్గాలను సూచిస్తూ సమాజాన్ని ముందుకు నడిపిస్తుంది. అట్లాంటి సాహిత్యంలో రావూరి భరద్వాజది ఒక ప్రత్యేకస్థానం.

రావూరి భరద్వాజ (1927–2013) తెలుగు సాహిత్యంలోని మహానుభావులలో ఒకరు. ఆయన రచనల్లో సమాజంలోని అనేక సమస్యలు, మానవీయ విలువలు, జీవన సత్యాలు ప్రతిఫలిస్తాయి. 2012లో ఆయనకు జ్ఞానపీఠ పురస్కారం లభించింది, ఇది భారతదేశంలో సాహిత్య రంగంలో అత్యున్నత గౌరవంగా గుర్తించబడుతుంది. ఆయన 1927లో ఆంధ్రప్రదేశ్‌లోని మొగల్తూరులో జన్మించారు. రచయితగానే కాకుండా, పత్రికా రచయితగానూ పేరు సంపాదించారు. పాఠకులకు అనేక కథలు, నవలలు అందజేసి తెలుగు సాహిత్యంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు. భరద్వాజ గారి రచనల శైలి సహజమైనదే కాకుండా సామాజిక స్పృహను కలిగించేలా ఉంటుంది. సామాజిక సమస్యలు, జీవితంలోని ఘర్షణలు, పేదల జీవన పరిస్థితులు ఆయన రచనల్లో ప్రధాన అంశాలుగా కనిపిస్తాయి.

రావూరి భరద్వాజ 37 నవలలు, 400కి పైగా చిన్న కథలు, 8 నాటకాలు, అనేక వ్యాసాలు రాశారు. భరద్వాజ గారి రచనల ప్రత్యేకత అనేకం. ఆయన కథల్లో సామాన్యుల జీవితం, వారి కష్టాలు, ఆత్మగౌరవం శృంగారం, ప్రతిబింబిస్తాయి. పాఠకుల హృదయాలను తాకే సులభమైన భాషలో సహజమైన శైలిని ఉపయోగించారు. కుటుంబ బంధాలు, ప్రేమ, త్యాగం వంటి మానవ సంబంధాలను సున్నితంగా తీర్చిదిద్దారు. భరద్వాజ గారు సమాజంలోని అవినీతి, అసమానత్వం వంటి సమస్యలను విమర్శిస్తూ, సామాజిక స్పృహ కలిగించే రచనలు చేశారు.

రావూరి భరద్వాజ గారి 'లోకం కోసం' (కథల సంపుటి) తెలుగు సాహిత్యంలో ఒక అద్భుత కృతి. 1956 లో ప్రచురితమైన ఈ కథల సంపుటి ఆదర్శ మండలి విజయవాడ వారు ప్రచురించడం జరిగింది. 'లోకం కోసం' కథల సంపుటిలో మొత్తం 11 కథలు ఉన్నాయి. ఒక్కొక్క కథ ఒక్కొక్క అంశాన్ని ఆసక్తిని రేకెత్తించింది. ఈ శీర్షిక 'ప్రపంచం కోసం' అనే అర్థం ఇచ్చి, వ్యక్తిగత ఆకాంక్షలను సామాజిక బాధ్యతలతో సంతులనం చేయాలనే ప్రధాన అంశాన్ని ప్రతిబింబిస్తుంది. కథల సంపుటి సమాజంలో వ్యక్తుల ప్రవర్తన సామాజిక సమస్యలను వ్యక్తులు సమాజంలో ఎదుర్కొనే ఉదుదుడుకులను స్పృశిస్తూ ముందుకు సాగే కథల సంపుటి అనేక ఆసక్తికర విషయాలను పాఠకుల ముందు ఉంచి ఏకబిగిన చదివేల ఈ కథల సంపుటి సాగుతుంది. ఈ రచన భరద్వాజ మానవ స్వభావంపై లోతైన అవగాహన, జీవన నైతిక సంక్లిష్టతలను ఎదుర్కొనే వ్యక్తులపై ఆయన అనుకంపను, మరియు సమాజ నిర్మాణాలపై చేసిన విమర్శలను ప్రతిబింబిస్తుంది. ఇది వ్యక్తిత్వం, త్యాగం, శృంగారం, మరియు సమిష్టి మంగళం మధ్య అంతర్సంబంధాన్ని చర్చిస్తూ సజీవ కథనం ద్వారా పాఠకుల మనసును కదిలిస్తుంది.

ఈ రచన 19 వ శతాబ్దం మధ్యకాలం భారతదేశంలో, సమాజంలో ప్రధానమైన మార్పుల సమయంలో ఆవిష్కృతమైంది. సంప్రదాయ విలువలు ఆధునిక సిద్ధాంతాల ద్వారా సవాలు పొందుతూ, వ్యక్తులు సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకునే క్రమంలో మరియు మార్పులను స్వీకరించే క్రమంలో తటస్థం అయ్యారు. భరద్వాజ గారు ఈ పరివర్తనశీల దృశ్యంలో తమ పాత్రలను ఏర్పాటు చేసి, పాఠకులను ఒక మారుతున్న ప్రపంచంలో వారి విజయాలు మరియు పోరాటాలను చూయిస్తారు.

ఇందులో లోకం కోసం, ఆహిరి, నీతి స్తంభం, అనుమానం, కన్న కడుపు, సంతానం, పల్లెపట్టు, ప్రవృత్తులు, అభ్యుదయం, కడుపు తీపి, మరియు అద్దె కొంప. ఈ కథల్లో విభిన్న వ్యక్తిత్వాలు, పరిస్థితులు, మరియు మనుషుల ప్రవర్తనను చాలా స్పష్టంగా వర్ణించడం జరిగింది. 'లోకం కోసం' అనేక అనుసంధానమైన పాత్రల జీవితాలను అన్వేషిస్తుంది, ప్రతీ ఒక్కరూ మానవ జీవితానికి ఒక కోణంగా ఉంటారు. ఈ కథల సంపుటి మనిషి, సమాజం, జీవితం అనే మూలబూతులను అన్వేషించడంలో ప్రత్యేకమైనదిగా నిలుస్తుంది. ఈ కథలు వివిధ వ్యక్తిత్వాల, పరిస్థితుల ద్వారా మనిషి ప్రవర్తన, నైతికత, మరియు సామాజిక సంబంధాలపై వివిధ కోణాల్లో ఆలోచించడానికి ఒక మంచి వేదికను అందిస్తాయి. ప్రతి కథలోని ప్రతీకలు, పాత్రలు, మరియు సంఘటనలు మనిషి జీవితంలోని

వివిధ సవాళ్లను, ఆశలను, మరియు బాధలను బలంగా ప్రతిబింబిస్తాయి. 'లోకం కోసం' కథల ద్వారా, రచయిత మానవ సంబంధాలను, నైతిక విలువలను, మరియు జీవన ప్రయాణాన్ని అన్వేషిస్తూ, సమాజంలో మరింత దయ, సౌమ్యత, మరియు సమాజసేవ అవసరమనే సందేశాన్ని అందిస్తారు. ఈ కథల విశ్లేషణ ద్వారా మనం మానవీయతను, నైతికతను, మరియు మనుషుల మధ్య సంబంధాలను మరింత అర్థం చేసుకోవచ్చు.

ఈ కథల సంపుటిలో మొదటి కథ లోకం కోసం. నరసమ్మ అనే యువతికి వృద్ధునితో వివాహం అవుతుంది తన భర్త వృద్ధుడం కావడం మూలంగా ఆమె వేరే వ్యక్తితో సంబంధం ఏర్పరచుకుంటుంది ప్రతిరోజు నరసమ్మ ప్రియుడు ప్రతిరోజు చీకటి పడగానే ఇంటికి వచ్చి వెళ్లేవాడు ఈ విషయం భర్తకు తెలిసిన ఏమనే వాడు కాదు ఎందుకంటే ఎందుకంటే ఇది రహస్యంగా నడుస్తున్న వ్యవహారం కాబట్టి సమాజంలో ఎవరికి తెలియదని భావించేవాడు. కానీ కొన్ని రోజుల తర్వాత నరసమ్మ ప్రియుడు పట్టపగలు ఇంటికి రావడం ఇది అందరికీ తెలుస్తుంది అని భావించిన నరసమ్మ భర్త అతని ప్రతిఘటిస్తాడు. ఈ కథలో సమాజము ప్రతిష్ట కుటుంబము గౌరవము అనే అంశాలు ప్రధానంగా ప్రతిబింబిస్తాయి.

రెండవ కథ ఆహిరి ఇక్కడ లలిత, రాజా రామ్– శారద – రామ్మూర్తి శంకరం అనే వ్యక్తుల మధ్య జరిగిన అక్రమ సంబంధం ప్రయత్నాలు విషయదీకరించడం జరిగింది . ఇందులో ముఖ్యంగా మగవారి యొక్క మనస్తత్వం ముఖ్యంగా కామ ప్రయత్నాలు ఏ విధంగా ఉంటాయో వ్యక్తుల యొక్క వ్యక్తిత్వాలు పైకి తర్వాత లోపల ఏ విధంగా ఉంటాయో విశదీకరించడం జరిగింది . ఇది చదువుతుంటే చాలా ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది కళ్ళకు కట్టినట్లు రావూరి గారు వివరించారు.

'నీతి స్తంభం' అనేది మూడవ కథ. ఇది చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది పార్వతమ్మ భర్త సుబ్బారావు సమాజం ఆధునిక పోకడలు అతనికి నచ్చేవి కావు ముఖ్యంగా స్త్రీలు మోడల్‌గా తయారయ్యి సమాజాన్ని పాడు చేస్తున్నారని అంతేకాక రచయిత అయిన చలం రచనలు చదివి ఆడవారు పడుతున్నారు అని అతని అభిప్రాయం. ప్రతిరోజు ఈ విషయాన్ని పదేపదే తన భార్యతో చెప్పి చెప్పి ఆమెను విసిగించి వ్యక్తిగత జీవితం పట్టించుకునే వాడు కాదు దీంతో విసిగిపోయిన తన భార్య ఇతనితో ఉండడం కంటే వేరే వాళ్ళతో ఉండడం అని బూతు కథలు రాసే కృష్ణమూర్తి అనే వ్యక్తితో వెళ్ళిపోతుంది.

నాలుగో కథ అనుమానం. ఇక్కడ రచయిత వ్యక్తుల మనస్తత్వాలు అనుమానాలు ఏ విధంగా ఆవిర్భవిస్తాయో తెలియజేసే కథ ఇది. నాగరాజు వెంకయ్యమ్మ భార్యాభర్తలు. వెంకాయమ్మ తన తల్లి గారి




ఇంటికి వెళ్లి చాలా రోజులైనా తిరిగి రాకపోయేసరికి నాగరాజుకు అనుమానం కలుగుతుంది. దీంతో అతని భార్య ఎవరితోనూ సంబంధం పెట్టుకున్నట్టు నిర్ధారణకు వచ్చి సతమతమవుతుంటాడు.

ఈ కథ సంపుటిలో మరొక కథ 'కన్న కడుపు' అత్త శేషగిరమ్మ అల్లుడు శివరామయ్య తన బిడ్డ వరమ్మ తన మధ్య జరిగిన వివిధ సన్నివేశాలు ప్రధానంగా నిలుస్తాయి. వరమ్మ తల్లి అయిన శేషగిరిమ్మ తన బిడ్డ పెళ్లయిన తర్వాత అత్తగారింట్లో సుఖంగా ఉంటుందని భావిస్తుంది. అయితే అల్లుడు శృంగారపురుషుడని తన బిడ్డ దగ్గర ఆ సుఖం దొరకడం లేదని భోగం అమ్మాయి అయినా మేనకతో సంబంధం ఏర్పరచుకుంటాడు తర్వాత అనేక సుఖ వ్యాధులను తన బిడ్డకు అంటిస్తాడు. బిడ్డ అనారోగ్యంగా ఉందని తెలిసి ఎంతో బాధపడిన అత్త అత్త శేషగిరమ్మ అల్లుడింటికి వచ్చి బిడ్డ బాధలను చూసి చెల్లించిపోతుంది ఈ విషయం వితృతంగా సాగే ఈ కథ కన్న కడుపు శీర్షికతో రచయిత తెరకెక్కించాడు.

లోకం కోసం కథల సంపుటిలో ఆరవ కథ 'సంతానం'. ఈ కథ ముఖ్యంగా పిల్లలు లేని (కానీ) దంపతులు మధ్య పిల్లల పొందడం కోసం పడే తాపత్రయం జరిగే సంఘర్షణ ఇతివృత్తంగా ఈ కథ సాగుతుంది. ఈ కథలో భర్త కంటే పిల్లలు ఇష్టం లేదు, కానీ భార్య పిల్లలు కావాలని అతనితో ప్రతిరోజు సంఘర్షణ చేస్తుంటుంది. ఇదే కాకుండా గుళ్ళు గోపురాలు ఋషులు జపాలు పూజలు చేస్తూ ఉంటుంది. సంతానం కోసం ఆ భార్య పడే ఆరాటము ఒక స్వామీజీని కలిసేటట్టు చేస్తుంది స్వామీజీతో ఏకాంతంగా గడిపితే తనకు పిల్లలు పుడతారు అన్న ఆశతో స్వామీజీతో కలవడానికి తయారవుతుంది ఇక్కడ సంతానం కోసం దంపతుల మధ్య జరిగే ఘర్షణ ఏ విధంగా ఉంటుందో రచయిత వివరిస్తాడు.

మరొక కథ 'పల్లెపట్టు'. పైనున్న ఆరు కథలకు భిన్నంగా ఈ కథ ఇద్దరూ భూస్వాముల మధ్య వర్గ పోరు ఏ విధంగా జరిగింది. ఈ పోరులో వారి జీతగాళ్లు ఏ రకంగా కొట్టుకొని తమ.

జీవితాలు నాశనం చేసుకున్నారు అనేది ప్రధాన ఇతివృత్తం . పట్టు విడుపుల కోసం ఇద్దరు భూస్వాములు తమ పని వాళ్ళ జీవితాలు ఏ రకంగా నాశనం చేస్తారో సవివరంగా చెబుతుంది. పట్టు కోసం జనాలు ఏ రకంగా ఆవేశాలకు లోన్ అవుతారో చెప్పుడు మాటలు వింటారు తద్వారా ఎలాంటి అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటారో ఈ కథలో చాలా స్పష్టంగా రచయిత వివరించడం జరిగింది. పట్టింపులు చెప్పుడు మాటలు అమాయకుల బలి మొదలగు అంశాలు ఈ కథలో ఇమిడి ఉన్నాయి.

ప్రవృత్తులు అనే కథలు రచయిత రెండు ఆత్మలు చనిపోయిన తర్వాత భూలోకంలో జరిగే వివిధ రకాల అన్యాయాలు వార్త నాదాలు వ్యక్తుల ప్రవర్తనలు ఏ రకంగా ఉంటాయో చర్చించుకున్న విధానం గురించి వివరించడం జరుగుతుంది. ఈ కథ కలియుగంలో వ్యక్తుల ప్రవర్తన ఏ రకంగా ఉంటుంది తమ స్వార్థం కోసం వ్యక్తులు ఎటువంటి అఘాయిత్యాలు దోపిడీలు దొంగతనాలు మానభంగాలు చేస్తున్నారు సవివరంగా తెలియజేస్తుంది వర్తమాన సమాజంలో జరిగే అనేక అనేక సంఘటనలు 70 ఏళ్ల క్రితం రచయిత సవివరంగా సమాజ నడవడి అన్యాయాలు దోపిడీలు మొదలైన కళ్ళకు కట్టినట్లు వివరించడం జరుగుతుంది

'అభ్యుదయము' ఈ కథలో మేజర్ పాత్రధారి రంగయ్య ఒకప్పుడు బాగా బతికిన రంగయ్య వ్యాపారంలో నష్టం మూలంగా తను ఉన్న ఊరు వదిలి పక్క ఊరు జమిందార్ దగ్గరికి వచ్చి సాయం కోసం కోరతాడు. పూర్తిగా కోల్పోయిన స్థితి నుంచి వ్యాపారాన్ని విస్తరించి ఆ ఊరి గ్రామ ప్రజలకు ఏ రకంగా సాయపడతాడు అని ఇతివృత్తంతో ఈ కథ సాగుతుంది ఇదే కాకుండా ఒకే ఇంట్లో రెండు రాజకీయ పార్టీలు ఏర్పడి తండ్రి కొడుకులు ఏ విధంగా ఆ పార్టీ కొరకు పని చేస్తారు అనే విషయాన్ని కూడా చర్చిస్తారు ఇక్కడ ప్రధానంగా రంగయ్య ఆ ఊరి ప్రజలకు ఏ రకంగా మేలు చేసింది వ్యాపారం నష్టం వచ్చిన కష్టపడి పనిచేసి ఏ రకంగా పైకి వచ్చింది పూరి జనాలకు ఏ రకంగా సహాయం చేసింది అభ్యుదయం కోతలో స్పష్టంగా వివరించారు రచయిత.

చివరి కథ అద్దె కొంప. ఇందులో ప్రధాన పాత్రధారులు భాగ్యమ్మ శివరామయ్య. మీరు ఇరువురు భార్యాభర్తలు. శివరామయ్య భార్య భాగ్యమ్మను చీటికిమాటికి వేధింపులకు గురి చేశాడు. ఇవన్నీ దగ్గర నుంచి చూస్తున్నా వారింట్లో కిరాయికి ఉండే ఒకతను ఒకరోజు శివరామయ్యను ఎందుకంటే భాగ్యమను వేపుకు తింటున్నారు అని నిలదీస్తాడు దీంతో శివరామయ్య వేధింపులు బహిరంగ తగిన లోలోపల భాగ్యమకు వేధింపులు ఎక్కువయ్యాయి. శివరామయ్య భాగ్యముపై అనేక నిందలు వేస్తాడు. వీరికి అక్రమ సంబంధం ఉందంటూ లేనిపోని మాటలు అంటున్నాడు దీంతో ఆ ఇంట్లో అద్దుకుంటున్న వ్యక్తి ఇల్లు కాల్ చేయాల్సి వస్తుంది. ఇక్కడ ముఖ్యంగా రచయిత భార్యాభర్తల విషయంలో మూడో వ్యక్తి ప్రమేయం సంబంధాలు దెబ్బతీస్తుంది అనే విషయాన్ని చాలా స్పష్టంగా చెబుతారు.

ప్రధాన అంశాలు:

పైన పేర్కొన్న 11 కథలలో వర్తమాన సమాజంలో జరుగుతున్న అనేక విషయాలు చాలా స్పష్టంగా రచయిత 70 ఏళ్ల క్రితమే కళ్ళకు కట్టినట్లు వివరించడం జరుగుతుంది. ఈ కథలో సమాజంలోని విభిన్న వర్గాల వ్యక్తుల వ్యక్తిత్వాలు ప్రవర్తనలు సమాజ పోకడలు మొదలగునవి చాలా వివరంగా అయినది. ఈ కథలన్నింటిలో సర్వసాధారణంగా ఈ క్రింద పేర్కొన్న ప్రధాన అంశాలు కనిపిస్తాయి.

1. త్యాగం మరియు స్వార్థరహితత వ్యక్తిగత సంతోషాన్ని త్యజించి, సమిష్టి మంగళం కోసం త్యాగం చేయాల్సిన ఆవశ్యకతను ఈ కథా ప్రక్రియలో ప్రధానంగా చూపిస్తారు.

2. నైతిక సంక్లిష్టత మానవ జీవితంలోని నైతిక అపోహలను లోతుగా పరిశీలిస్తూ, పరిస్థితులు మరియు నిర్ణయాల ద్వారా ఆ నైతికత ఎలా ప్రభావితమవుతుందో చూపిస్తారు.

3. సామాజిక విమర్శ అవినీతి, అసమానత్వం వంటి సమస్యలపై కథాకర్త తన విమర్శల ద్వారా స్ఫూర్తి కలిగిస్తారు.

4. మనోధైర్యం కథానాయకులు ఎదుర్కొన్న సవాళ్లను అధిగమించడంలో చూపించిన మనోధైర్యం మానవ ఆత్మ విశ్వాసానికి ఒక గౌరవనీయమైన నిదర్శనం.

5. శృంగారం, ఈ కథల సంపుటి శృంగారం కేంద్ర బిందువుగా సాగుతుంది.

6. తల్లి పిల్లల సంబంధాలు. కడుపు తీపి మొదలగునవి

ముగింపు:

రావూరి భరద్వాజ గారి "లోకం కోసం" కాలానికి అతీతమైన కథల సంపుటి. సమాజాన్ని ప్రతిబింబించే అద్దంలా నిలుస్తూ, ఇది మన జీవితాలపై మరియు ప్రపంచంలో మన పాత్రపై ఆలోచన చేసేలా చేస్తుంది. కథల సంపుటి తెలుగు సాహిత్యంలో ఒక మైలురాయి, భరద్వాజ గారి సాహిత్య నైపుణ్యానికి సాక్ష్యంగా నిలుస్తుంది. ఆయన సృజనాత్మకత, సామాజిక స్పృహ, మరియు మానవీయ విలువల గురించి లోతైన అవగాహన కలిగి ఉండటం ఈ రచనను చిరస్థాయిగా నిలిపే ప్రధాన కారణం.

**ఆధారం**

1. లోకం కోసం (1956) రావూరి భరద్వాజ, ఆదర్శ ప్రచురణ, విజయవాడ

❖ ❖ ❖ ❖ ❖

# 'గ్రంథాంతరంగం' విమర్శనాత్మక వ్యాస సంపుటి

**డా. బడిగె ఉమేశ్,** నెల్లూరు. ఫోన్ : 9494 815 854

తెలుగు సాహిత్య విమర్శనా క్షేత్రాన్ని సంవృద్ధం చేసిన, చేస్తున్న 'ఎందరో మహానుభావులు అందరికీ వందనములు'. మేటి తెలుగు గ్రంథాల సారాన్ని ఒడిసి పట్టుకుని 'ప్రాత క్రొత్తల మేలు కలయిక క్రొమ్మెరుంగులు' చిమ్మేటట్లుగా ఐదు దశాబ్దాలుగా అవిరళ కృషి చేస్తున్న ఘట్టమరాజు అశ్వత్థనారాయణగారు ఎంతగానో అభినందనార్హులు. వీరు హైదరాబాద్ నుంచి వెలువడుతున్న ప్రసిద్ధ సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక 'మూసీ'లో ఫిబ్రవరి 2021 నుంచి జనవరి 2024 దాకా రాసిన 30 విమర్శనాత్మక వ్యాస సంపుటం ఈ 'గ్రంథాంతరంగం'. ప్రఖ్యాత ప్రచురణ సంస్థ ఎమెస్కో బుక్స్ వారు ఈ పుస్తకాన్ని డిసెంబర్ 2024లో ప్రచురించి పుణ్యం మూట కట్టుకున్నారు.

**గ్రంథాంతరంగం**
విమర్శనాత్మక వ్యాస సంపుటి
ఘట్టమరాజు అశ్వత్థనారాయణ
పేజీలు : 256
వెల : 200 రూ.
ప్రతులకు :
ఎమెస్కో బుక్స్ ప్రై. లిమిటెడ్.
హైదరాబాద్, విజయవాడ.




ఘట్టమరాజు గారు తమ 79వ యేట వెలువరించిన మొట్టమొదటి విమర్శనాత్మక వ్యాస సంపుటం ఇది. ఈ గ్రంథంలో అజ్ఞాతంగా, అల్పజ్ఞాతంగా ఉన్న అమూల్యమైన తెలుగు పుస్తకాల పరిచయాత్మక, విమర్శనాత్మకమైన వ్యాసాలు కూర్చబడ్డాయి. ఇది వైవిధ్యభరితమైన విషయాల గురించి లోతైన దృష్టితో పరిశీలించబడిన రచన. ఆంధ్ర వాఙ్మయ చరిత్రలు, ఆంధ్ర కవిత్వ చరిత్రలు, యాత్రా చరిత్రలు, షష్టి పూర్తి అభినందన గ్రంథాలు, నిఘంటువులు, నిస్వార్థ సాహితీసేవకుల అమూల్యమైన జ్ఞాపకాలు వగైర ఈ గ్రంథంలో చర్చింపబడ్డాయి.

ఇందులోని వ్యాసాల్ని చదివితే గ్రంథకర్త సూచీముఖ, విమర్శనాత్మ దృష్టి, పరిశోధనాత్మక దృక్పథాలు పాఠకులకు తెలుస్తాయి. ఈ ఉద్గ్రంథం ఆధారంగా వ్యాసకర్త అభిప్రాయాల లోతుపాతులు ఎంతో నిశితమైనవనడానికి కొన్ని ఉదాహరణల్నిక్కడ ప్రస్తావిస్తాను. తొట్టతొలి వ్యాసం వంగూరి సుబ్బారావు 'ఆంధ్ర వాఙ్మయ చరిత్రము' (1920). ఇది తెలుగులో వెలువడిన మొట్టమొదటి తెలుగు సాహిత్య చరిత్ర. ఇందులోని వంగూరి వారి మాటల్ని ఘట్టమరాజు ఈ విధంగా ఉటంకించారు –''ఈ భారత భాగవత రామాయణము లాంధ్రములోనికి వచ్చి మన దేశము నందార్యమత వ్యాప్తి నొనర్చి మహోపకార మొనర్చిన మాట సత్యమే కాని, ప్రాచీన భాషకు, బూర్వ వాఙ్మయమునకు, దేశీయ సంప్రదాయములకు నీ గ్రంథము లొనర్చిన యపకారము వర్ణింపరానిది."(పుట:28) వీటిని ఆధారంగా చేసుకుని వ్యాసకర్త ఘట్టమరాజు 'నన్నయకు మునుపటి తెలుగు బౌద్ధ, జైన కావ్యాలు ఖిలమైనందుకు విచారిస్తున్నారనీ, ఎంతో విలువైన దేశి సారస్వతం నాశనమైనందుకు వగస్తున్నారన్న సుబ్బారావుగారి బాధాతప్తతను ఎత్తి చూపారు. ఇదే విషయాన్ని భోగరాజు నారాయణమూర్తి 'ఆంధ్ర కవిత్వ చరిత్రము' (1924) లో కూడా స్మరిస్తూ– "నన్నయకు ముందు ప్రచారంలో వున్న కావ్యాలు ఏవీ ఆంధ్ర మహాభారత రచనకు ప్రేరకాలు కాజాలవని పింగళి లక్ష్మీకాంతంగారు భావించడం సమంజసం కాదు. జైనమత ప్రచార ప్రదీప్తమైన తెలుగు కావ్యాలు నన్నయను వైదిక మత ప్రచారం కోసం భారత రచనకు తీవ్రంగానే ప్రభావితం చేసి వుంటాయని నా భావన."(పుట:59)అని వ్యాసకర్త చెప్పారు. కాగా ఇంకొక వ్యాసంలో కవిత్వవేది కల్లూరు వేంకట నారాయణరావు తమ 'ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సంగ్రహము'(1926)లో అసామాన్య, సామాన్య కవుల రచనా వైశిష్ట్యాన్ని చిన్న వయసులోనే బయటికి తీయటం ప్రశంసనీయమంటారు.

ఇంతవరకూ అజ్ఞాతంగా ఉన్న బేతపూడి సుందరరాయుడు 1864లో రాసిన 'నీలగిరి చరిత్ర' గురించి తొలిసారిగా ఘట్టమరాజు గారు లోతుగా పరిచయం చేశారు. కోలా శేషాచలకవి 1854లో రచించిన 'నీలగిరి యాత్ర'ను డా.మచ్చ హరిదాసు తమ సిద్ధాంత గ్రంథం "తెలుగులో యాత్రాచరిత్రలు"లో విస్తారంగా రాశారే కాని బేతపూడి సుందరరాయుడి 'నీలగిరి చరిత్ర' పేరు మాత్రం పేర్కొన్నారు. అయితే ఘట్టమరాజు మాత్రం ఈ 'నీలగిరి చరిత్ర'ను ఉద్దేశించి విలువైన అంశాల్ని చెబుతూ "నీలగిరి చరిత్ర" ముగ్ధ మనోహరమై, ఆద్యంతం పాఠకుల్ని అలరించే సులభసుందర భాషాశైలీ సమన్వితమై వొప్పారుతూంది. ద్రాక్షాపాక రచనలు చదివే ఈనాటి పాఠకులకు ఈ 26పేజీల చిన్నిపొత్తం పరమానందం కలిగిస్తుంది'' (పుట:116)అని అభిప్రాయపడ్డారు. మరో

యాత్రాచరిత్రగా ప్రసిద్ధి పొందిన 'పిక్చర్స్ ఆఫ్ ఇంగ్లండ్' (1876) బహుశా భారతీయ మహిళల్లోనే యాత్రా కథనం రాసిన తొలి మహిళ పోతం జానకమ్మపై రాసిన వ్యాసంలో ఎన్నో విశేషాల్ని వ్యాసకర్త తెలియజేశారు. అనంతరం 'జానకమ్మ ఇంగ్లండ్ యాత్ర' (2022) పేరుతో డా.కాళిదాసు పురుషోత్తం అనువదించిన గ్రంథాన్ని ప్రశంసినిస్తూనే అందులోని కొన్ని అభిప్రాయాలతో విభేదించారు."పోతం జానకమ్మ రాఘవయ్య తమ యూరపు యాత్రానుభవాల్ని మొదట తెలుగులో రాశారా లేదా ఇంగ్లీషులో రాశారా అన్నది చర్చనీయాంశమే"(పుట:169) అంటూ... జానకమ్మ ఆంగ్లంలో కాకుండా తెలుగులోనే తమ యూరప్ యాత్రానుభవాల్ని రాశారనడానికి కొన్ని కారణాల్ని స్పష్టంగా వ్యాసంలో పొందుపరిచారు.

అలాగే ఆంధ్రనేలిన ఆంగ్లేయులను ముప్పుతిప్పలు పెట్టించి, చీరాల పేరాల ఉద్యమంతో ఉధృతంగా పోరాడిన తెలుగు వీరుడు ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య జీవిత చరిత్రను బసవరాజు అప్పారావు 'శ్రీ ఆంధ్రరత్న ద్యుతులు'(1963)గా రాయడం ముదావహం అంటూ... చాలా ఆలస్యంగా వెలువడిన ఈ మంచి పుస్తకం గురించి నేటి పాఠకులకు పరిచయం చేస్తూ ఘట్టమరాజు -"గోపాలకృష్ణయ్య భార్య, పిల్లల, ప్రస్తావనే లేదు. ఆయన ఆలోచనామృతాన్ని, హాస్య, వ్యంగ్య చమత్కారాన్ని వ్యక్తం చేసే చాటువద్యాల్ని మనమీ పుస్తకంలో చూడలేకపోవడం దురదృష్టకరం!"(పుట:141) అని అన్నారు.

తదనంతరం తెలంగాణ ముద్దుబిడ్డ దేవులపల్లి రామానుజరావుగారి 'యాభై సంవత్సరాల జ్ఞాపకాలు' (1981) గ్రంథంపై రాసిన వ్యాసంలో దేవులపల్లివారిని 'బహుళాంధ్రోక్తి మయ ప్రపంచ'పు మురిపాల ముత్తెంగా అభివర్ణించారు వ్యాసకర్త. కాగా వారి స్వీయచరిత్ర ఎంతో విలక్షణమైనదంటూ-"తెలంగాణలో పుట్టిన ఒక సామాన్య వ్యక్తి తన బుద్ధి హృదయాల మణికాంచన సంయోగాన్ని అఖిలాంధ్ర సాహిత్య, చరిత్ర, సంస్కృతుల పరిరక్షణ, వికాసాలకై సమర్పించిన అసామాన్య శక్తి"(పుట:147)గా దేవులపల్లిని కొనియాడారు.

ఘట్టమరాజుగారి చదువు సాములు బహుముఖీనమైనవి. ఈతరంవాళ్లు, అంతకు ముందు తరంవాళ్లు కూడా చదవాల్సిన గ్రంథమైన 'మునగాల పరగణా : కథలు-గాథలు' (2017) అనే పుస్తకాన్నుద్దేశించి రాసిన వాక్యాలు గమనించండి- "గుడిపూడి సుబ్బారావు గారనే పెద్దాయన తన ఎనభైయ్యవ ఏట 302 పేజీలతో మునగాల పరగణా గత వైభవాన్నీ, వర్తమాన శైథిల్యాన్నీ, రాజా రాణీల, దివాన్ల, రైతు పెదరాయుళ్ల, కోట కొత్తళాల, రాజభవనాల, విశ్రాంతి గృహాల, గుడి గోపురాల, అనాథ శవాల్లా పడివున్న గడీల ఫోటోలతో కూడుకున్న ఈ గ్రంథం పాఠకుల్లో ఉత్కంఠను కలిగించి, ఆవేశాన్ని రేకెత్తిస్తూ, విషాద నిర్వేదాల్ని పుటం పెడ్తుంది." (పుట:187) అని తెలిపారు. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన జంటకవుల్లో శేషాద్రి రమణ కవులకు కూడా ప్రముఖ స్థానమున్నదని మనందరికి యెరుక. వ్యాసకర్త "శేషాద్రిరమణ కవుల పరిశోధన వ్యాసమంజరి"(2017) గురించి రాస్తూ-"రమణకవులు 'నిజాము రాష్ట్రము- వాఙ్మయ చరిత్రము'-1,2 వ్యాసాలు తెలంగాణ సాహిత్య చరిత్రకు వెలుగు నిచ్చే రచనలన్నారు. ఈ మహానుభావులే పానగల్లు, నేలకొండపల్లె, రామగిరి దుర్గం మొదలైన వాటి పుట్టు పూర్వోత్తరాల్ని తవ్వి తీసి, జైన, బౌద్ధ కళా సంపదను ప్రకటించారని అన్నారు. అలాగే "దోమకొండ, వనపర్తి మొదలైన నిజాం రాష్ట్రంలోని సంస్థానాల కవి, పండితాగ్రణుల వివరాలు సేకరించిన శ్రమజీవులు వీళ్ళు" (పుట:250) అని హర్షించారు. ఆదిరాజు వీరభద్రరావు రాసిన 'షితాబుఖాను అను సీతాపతి రాజు'(1961) అనే పరిశోధన గ్రంథంపై ఘట్టమరాజుగారి అభిప్రాయమిలా ఉన్నది-"ఇది కాకతీయుల తర్వాతి కాలంనాటి ఒక వీరుని శౌర్యచరిత్రే కాదు తెలంగాణ చరిత్రలో ఒక స్మరణీయ అధ్యాయమంటారు. అంతేకాదు తెలంగాణలోని ఒక నిరుపేద వీరోచిత విద్యలు నేర్చి, ఓరుగల్లు గద్దెనెక్కి, అల్పకాలంలోనే అనల్ప కీర్తి ప్రతిష్ఠలు ఆర్జించిన అసమాన శూరుని పరాక్రమ గాథ" (పుట:256) అని ఉద్ఘాటించారు. 'గ్రంథాంతరంగం'లో 'శుక్ల పక్షము' అనే పుస్తకంపై రాసిన వ్యాసం సుదీర్ఘమైనది. ఇందులో రచయిత చెప్పిన మాటలు చూడండి ఎంత చమత్కారంగా, ఆలోచనాత్మకంగా ఉన్నాయో!-"కృష్ణశాస్త్రి, అనంతపంతుల రామలింగస్వామి ఇద్దరూ ఇద్దరే! దేవులపల్లి వారు 'కృష్ణపక్షం' రాసి శుక్లపక్ష చంద్రునిలా వెలిగారు. మరేమో రామలింగస్వామి గారు 'శుక్లపక్షము' రాసి కృష్ణపక్ష చంద్రునిలా కనుమరుగయ్యారు."(పుట:227)అంటారు. ఇలాంటి చమత్కారాలే కాదు సాహితీవేత్తలు, అధ్యాపకులు, పరిశోధకుల బుద్ధి కుశలతను పెంచే చాలా అంశాలు ఈ పుస్తకంలో ఉన్నాయి.

ఇదే 'గ్రంథాంతరంగం' లో అక్కిరాజు ఉమాకాంతం 'నేటికాలపు కవిత్వము', గొబ్బూరి వేంకటానంద రాఘవరావు 'ఆంధ్ర గద్య వాఙ్మయ చరిత్ర', పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి 'ప్రాకృత గ్రంథకర్తలూ ప్రజాసేవానూ', కురుగంటి సీతారామయ్య 'అలంకార తత్త్వవిచారము', 'తంజాపురాంధ్రనాయక రాజ చరిత్రము', పాటిబండ మాధవశర్మ 'ఆధునికాంధ్ర భావకవిత్వం', విద్వాన్ విశ్వం 'సమీక్ష', వెలగావెంకటప్పయ్య 'గ్రంథాలయ జ్యోతి', వంగూరి సుబ్బారావు 'వేమన', వేటూరి ప్రభాకరశాస్త్రి, 'బాలభాష', నిడుదవోలు వేంకటరావు 'ఆంధ్రకర్నాట సారస్వతములు- పరస్పర ప్రభావము', సి. పి. బ్రౌన్ 'మిశ్రభాషా నిఘంటువు', 'తాతాచార్ల కథలు', డా. కోడూరు ప్రభాకర రెడ్డి 'స్వారోచిష మనుచరిత్ర టీకా తాత్పర్య వ్యాఖ్య' తదితర గ్రంథాలపై రాసిన వ్యాసాలు మేలిమి ముత్యాల్లాంటివని

చెప్పవచ్చు. ప్రధానంగా జనమంచి శేషాద్రిశర్మ, లంకా సూర్యనారాయణ, గుఱ్ఱం సుబ్బరామయ్య 'గురు సంస్మృతి', బ్రహ్మశ్రీ మల్లాది సూర్యనారాయణ మొదలైవారిపై వచ్చిన అభినందన సంచికలపై ఘట్టమరాజుగారి వ్యాస మంజరి గుభాళిస్తుంది.

వ్యాసకర్త ఘట్టమరాజు గారు ఈ పుస్తకానికి రాసిన 'వినయ పత్రిక' అనే స్వీయ కథనంలో "నా 79వ ఏట వెలువడుతున్న తొట్టతొలి వ్యాస సంపుటి ఇది. అంటే 'ముసలి ముప్పున తొలి సమర్త!' అంటూ...వీటిలో ఒకటి, రెండు తప్ప మిగతా వ్యాసాలన్నీ, శతాబ్దం, అర్ధశతాబ్దం నాటికి సంబంధించినవే. విస్మృతి గర్భంలో విలీనమైపోయిన, మూలల్లో దాగి వున్న అమూల్య గ్రంథాల్ని ముంగిట్లో తెచ్చేందుకు చేసిన సాహస కృత్యమిది"(పుట:8) అన్నారు. సుప్రసిద్ధ విమర్శకులు డా. దుర్గంపూడి చంద్రశేఖర రెడ్డి ఈ పుస్తకానికి 'అంతరంగాంతరంగం' శీర్షికతో మహత్తరమైన పీఠిక రాస్తూ-"ఊరికే గ్రంథాలను నామమాత్రంగా పరిచయం చేయడం ఘట్టమరాజు గారి ఉద్దేశం కాదు. వాటి అంతరంగాన్ని విప్పి చెప్పడం ఆయన లక్ష్యం. బహుశా ఈ పుస్తకాల పునర్ముద్రణ ఆవశ్యకతను ఉద్ఘాటించడం కూడా ఆయన లక్ష్యంలో భాగం కావచ్చు"(పుట:8) అని అభిప్రాయపడ్డారు. మరో విఖ్యాత విద్వాంసులైన డా. శ్రీపెరంబుదూరు శ్రీరంగాచార్యులు అన్న ఈ మాటలు పాఠకులు గమనించతగ్గవి "మొత్తం మీద ఘట్టమరాజువారి ఈ 30 వ్యాసాల 'గ్రంథాంతరంగం' మన అంతరంగాల్లో పలు విధములైన గ్రంథములను గూర్చిన ఆలోచనలు కల్గిస్తున్నదనుటలో సందేహం లేదు"(పుట:20).

'గ్రంథాంతరంగం' లోని వ్యాసాల్లో ఘట్టమరాజుగారి విమర్శనా ధోరణి ప్రబుద్ధ పాఠకుల్ని ఆలోచింపజేస్తుంది. వారి శైలి ఎంతో చేతోహారిగా కనబడుతుందనడానికి వారు వాడిన తాళ్ళపాక అన్నమాచార్యులగారి 'చింతకాయ తొక్కు చూచితే నోరూరు', 'సేవలు సేసేవారి సేతలెల్లా నింపులే', ఒక్కరు తలిచినట్టు ఒక్కరి తలపు రాదు/ పక్కన నందరికి బహుభావాలు' అన్నమాటలు పసిడికి పరిమళం అబ్బినట్లు చేస్తాయి. రచయిత విషయ సంగ్రహం, వివేచనా, వ్యక్తీకరణలు చదువరుల్లో జిజ్ఞాసనూ ఉత్కంఠనూ ఉల్లాసాన్నీ పెంచుతాయి. ఘట్టమరాజుగారు తమకు ఎన్నో అమూల్య గ్రంథాలను, జిరాక్సు ప్రతులను పంపి ఈ విశిష్ట వ్యాస రచనా సంపుటికి తోడ్పడ్డ వారిని స్మరించడం గమనార్హం.

(గ్రంథాంతరంగం (విమర్శనాత్మక వ్యాస సంపుటి), రచయిత : ఘట్టమరాజు అశ్వత్థనారాయణ, ఫోన్: 9964082076. పేజీలు: 256 వెల: 200 రూ. ప్రతులకు: ఎమెస్కో కేంద్ర కార్యాలయం, విజయవాడ- 520004, ఆంధ్రప్రదేశ్, ఫోన్ నెంబర్స్ : 0866-2436643, నవోదయ, విశాలాంధ్ర, నవచేతన పుస్తక కేంద్రాల్లో లభిస్తుంది.)

## తెలుగు సాహిత్యంలో త్రివిక్రములు విశ్వనాథ, సినారె, రావూరి భరద్వాజ

**డా. వేల్పుల కుమార స్వామి**, తెలుగు శాఖ అధ్యక్షులు, నిజాం కళాశాల. ఫోన్ : 9000056655

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, మహేంద్రహిల్స్, ఘట్‌కేసర్ ఆధ్వర్యంలో మార్చి 17, 18, 2025 తేదీల్లో 'జ్ఞానపీఠ పురస్కార గ్రహీతల సాహిత్య సమాలోచన' రెండు రోజుల జాతీయ సదస్సు ఘనంగా నిర్వహించడం జరిగింది. సాహితీమూర్తులైన విశ్వనాథ సత్యనారాయణ, డా.సి.నారాయణరెడ్డి, డా.రావూరి భరద్వాజ గార్లు తెలుగు సాహిత్యానికి చేసిన సేవ ఎనలేనిదని ప్రముఖులంతా కొనియాడారు. ప్రారంభసభకు అధ్యక్షులుగా ఉన్న ప్రముఖకవి, విమర్శకులు డా.నాళేశ్వరం శంకరం గారు మాట్లాడుతూ జ్ఞానపీఠ పురస్కార గ్రహీతల సాహిత్యం అజరామరమైనదని, అది విద్యార్థులంతా తప్పనిసరిగా చదవాలని సూచించారు.





ముఖ్యాతిథిగా విచ్చేసిన డా.నందిని సిధారెడ్డి గారు మాట్లాడుతూ ఎంతో కష్టపడి, అహర్నిశలు శ్రమించి, ఒక్కో మెట్టు ఎక్కుతూ జ్ఞానపీఠాన్ని అధిష్ఠించిన ముగ్గురు మహనీయులు మన తెలుగువారవడం గర్వకారణమన్నారు. గౌరవఅతిథిగా వచ్చిన

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5 (58) హైదరాబాద్ ఏప్రిల్ : 2025

ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగుశాఖాధ్యక్షులు డా. సాగి కమలాకరశర్మ గారు మాట్లాడుతూ నేటితరానికి జ్ఞానపీఠత్రయాన్ని పరిచయం చేయవలసిన ఆవశ్యకత ఎంతో ఉందని అన్నారు. సదస్సుకు కన్వీనర్‌గా ఉన్న తెలుగు అధ్యాపకురాలు డా. లక్ష్మీ అసిరెడ్డి గారు మాట్లాడుతూ జ్ఞానపీఠత్రయం తెలుగు సాహిత్యలోకానికే త్రివిక్రములని కీర్తించారు. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన డా.తూర్పు మల్లారెడ్డి గారు, విశిష్టఅతిథిగా వచ్చిన డా.శ్రీరంగాచార్యగారు విశ్వనాథ, రావూరి భరద్వాజల సాహిత్యపు విలువల్ని గురించి ప్రసంగించారు. అనంతరం 'జ్ఞానపీఠత్రయం' వ్యాస సంకలనాన్ని పెద్దలు ఆవిష్కరించారు. పుస్తకంలోని వ్యాసాల గురించి, అందులోని విశిష్టతను గురించి కొనియాడారు. ఇంకా సభలో కళాశాల ప్రిన్సిపాల్ డా. స్నేహలత గారు, తెలుగుశాఖాధ్యక్షులు యం.వేంకటేశ్వర్లు గారు, డా. శ్రీభాష్యం అనురాధ గారు, డా.సి.హెచ్.శారద గారు పాల్గొన్నారు.

విశ్వనాథ సత్యనాయణ గారి సమావేశానికి సభాధ్యక్షులుగా హాజరైన డా.ఎస్.రఘు గారు మాట్లాడుతూ విశ్వనాథవారి కవితా వైశిష్ట్యాన్ని కొనియాడారు. ఈ సమావేశంలో 'రామాయణ కల్పవృక్షం' గురించి డా. మద్దిరాల సత్యనారాయణరెడ్డి, 'ఏకవీర నవల' గురించి డా. గంజి శశిధర్, 'విశ్వనాథ నవలల్లో స్త్రీ' అనే అంశం గురించి డా.శ్రీభాష్యం అనురాధ గారు, 'చెలియలి కట్ట' గురించి జతనం కవిత గారు, 'కిన్నెరసాని పాటలు- భావ సౌందర్యం గురించి డా.లక్ష్మీ అసిరెడ్డి గారు, 'విశ్వనాథ కథలు-సామాజిక దృక్పథం' గురించి డా.మామిడాల రమేశ్ బాబుగారు, 'విశ్వనాథ వేయిపడగలు నవల ఔన్నత్యం' గురించి సి.బాలమణి గారు, 'కోకిలమ్మ పెళ్ళి' గురించి డా.యం. రమాదేవి గారు పత్రసమర్పణ చేశారు.

రెండవరోజు జరిగిన సి.నారాయణరెడ్డి సమావేశానికి సభాధ్యక్షులుగా హాజరైన డా.తిరునగరి శరత్ చంద్ర గారు మాట్లాడుతూ సినారె కవితాశక్తిని, సినిమాపాటల విశిష్టతను వివరించారు. ఈ సమావేశంలో 'విశ్వంభర సామాజిక చైతన్యం' అనే అంశంపై డా.వేల్పుల కుమారస్వామి గారు, 'మంటలూ-మానవుడు' అంశంపై డా.కసప నరేందర్ గారు, 'సినారె విదేశీయానం' గురించి డా.స్వప్న భువాకర్ గారు, 'సినారె సినిమాపాటలు' గురించి డా.సిద్దుల జ్యోతి గారు, సినారె కవిత్వంలో మానవీయత' గురించి డా.పద్మజ లంకెలపల్లి గారు, సినారె గజళ్ళు గురించి తోకల అనిల్ కుమార్ గారు, సినారె సినీగీతాలాపనతో డా.నలిగంటి శరత్ బాబు గారు అలరించారు.

తదుపరి జరిగిన డా.రావూరి భరద్వాజ సమావేశానికి సభాధ్యక్షులుగా హాజరైన డా.మద్దిరాల సత్యనారాయణరెడ్డి గారు డా.రావూరి భరద్వాజ ప్రతిభా వైశిష్ట్యాన్ని గురించి చాటి చెప్పారు. ఈ సమావేశంలో 'రావూరి భరద్వాజ సాహిత్య ప్రస్థానం' గురించి దాసోజు పద్మావతి గారు, 'రావూరి భరద్వాజ సాహిత్యం యదార్థత కాల్పనికతల సమన్వయం' గురించి డా.వి.వింధ్యవాసినీదేవి గారు, 'జీవనసమరం శ్రమైక జీవన సౌందర్యం' గురించి డా.ఎం.దేవేంద్ర గారు, 'పాకుడురాళ్ళు నవల-పరిశీలన' గురించి పెద్దపల్లి తేజస్వి గారు, 'పాకుడురాళ్ళు నవల పాత్రల స్వభావం-జీవన చిత్రణ' గురించి డా. కడివెండి మమత గారు, 'జీవనసమరం ఒక విశ్లేషణ' గురించి డా.జి. పద్మమ్మ గారు, 'ఉడతమ్మ ఉపదేశం' గురించి పుర జ్యోతి పత్రసమర్పణలు చేశారు.

జ్ఞానపీఠ పురస్కార గ్రహీతల సాహిత్యంపై ఇదివరకు కనివినీ ఎరుగని రీతిలో అత్యద్భుతమైన సదస్సు జరిగిందని ఆచార్యులు, కవులు, పరిశోధకులు ప్రశంసించడం జరిగింది. జ్ఞానపీఠత్రయంపై మరిన్ని పరిశోధనలు జరగాలని అందుకు ఈ సదస్సు ఎంతగానో ఉపకరిస్తుందని పెద్దలంతా అన్నారు. 'జ్ఞానపీఠత్రయం' పుస్తకంలో వ్యాసాలు రాసినవారే కాకుండా మరికొంతమంది పరిశోధకులు కూడా ఈ సదస్సులో పత్రసమర్పణ చేశారు. ఆ పత్రాలన్నింటిని కలిపి రెండవభాగంగా ప్రచురిస్తామని సంపాదకులు అన్నారు.

❖ ❖ ❖ ❖ ❖


# శిలాక్షరం

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)**




ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.

**సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి**

**సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య**

**వెల : 300/-**

**సంప్రదించండి.**
**మూసీ మాసపత్రిక**
**ఫోన్ : 934 7971177**

# మూసీ

**సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక**

**మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి**

**వెంటనే శాశ్వత చందాదారులు కండి.**

**సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక**

**యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక**

**శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-**

**సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక  సంపుటి -28 : సంచిక - 5  59  హైదరాబాద్  ఏప్రిల్ : 2025

# నేటి రాజకీయ వ్యవస్థకు నిలువుటద్దం – ఏడుకోలల బాయి

**డా. తండు కృష్ణ కౌండిన్య**, తెలుగు సహాయాచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రామన్నపేట. ఫోన్ : 9704 731 346




శతకమంటే నూరు పద్యాల రచన. పాల్కురికి సోమనాథుని మొదలుకొని ఇప్పటివరకు అనేకమంది కవులు వందలాది శతకాలను రాసి శతక సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. మానవీయ విలువల్ని పెంపొందించడానికి, భక్తిని ప్రబోధించడానికి, భగవంతుని అధిక్షేపించడానికి, మనిషి మనిషిగా జీవించడానికి శతకం తోడ్పడుతుంది. ఆధునిక కాలంలో కూడా పలువురు కవులు వైవిధ్యభరితమైన అంశాలతో కూడిన శతకాలు రాసి శతక సాహిత్యంలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు. భ్రష్టు పట్టిన నేటి రాజకీయ వ్యవస్థను తూర్పారబడుతూ ఓటు ఒక వజ్రాయుధంలాంటిదని, నాయకుల కుతంత్రాలను పసిగడుతూ నిజమైన నికార్సైన నాయకుల్ని ఎన్నుకోవలసిన అవసరం ఉందని, అప్పుడే ప్రస్తుతమున్న రాజకీయ వ్యవస్థ సమూలంగా ప్రక్షాళన అవుతుందని తెలియజేస్తూ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి రాసిన ఎన్నికల శతకమే **"ఏడుకోలల బాయి". "ఈ శతకం ఒట్టి శతకం కాదు. ఎన్నికల జీవిత చరిత్ర ఇది. మన దేశంలో జరిగే ఎన్నికల జీవన విధాన చరిత్రను చిత్రించిన రచన ఇది. పేరుకే శతకం కానీ ఇదొక శతసహస్ర వేదనలను, దురాగతాలను, దుష్కృత్యాలను, దుర్మార్గాలను మనదాకా మోసుకు తెచ్చిన శకటం"** అంటూ ప్రముఖకవి సీతారాం ఈ పుస్తకానికి రాసిన ముందుమాటలో ప్రస్తావించడం నూటికి నూరుపాళ్ళు అక్షర సత్యం. ఈ శతకంలోని పద్యాలన్నీ 2023 ఎన్నికల సందర్భంగా 29 అక్టోబర్ నుండి 25 నవంబర్ 2023 దాకా 'పంచ్ తంత్ర' శీర్షికన నవతెలంగాణ పత్రికలో ప్రచురించబడ్డాయి. కొన్ని పద్యాలు ఆంధ్రప్రభ దినపత్రికలో 'ఎలక్షన్ పద్యాలు'గా ప్రచురించబడ్డాయి. 2024 పార్లమెంట్ ఎన్నికలకు కొద్ది రోజుల ముందు నుండి మరికొన్ని పద్యాలు రాశారు. అవి 'నేటినిజం' డైలీలో సీరియల్ గా వచ్చాయి. ఆ తర్వాత మూసీ, విశాలాక్షి, అక్షరాంజలి, పాలపిట్ట, పెన్షనర్స్ వాయిస్ తదితర మాసపత్రికల్లో కూడా ప్రచురించబడ్డాయి. ఎన్నికలను ఏడుకోలల బాయితో పోలుస్తూ **"ఎన్నికల్ అంటేనే ఏడు కోలల బాయి/ తరుగదు దిగుతుంటె దస్కు భూమి"** అని ఎన్నికల స్వభావాన్ని పెద్ద ఊబిగా చిత్రించారు. ఇందులోని పద్యాలన్నీ నేటి రాజకీయ నాయకుల నైజాన్ని, స్వార్థపరత్వాన్ని, పదవి ఎక్కడం కోసం ఎంతకైనా తెగించే స్వభావాన్ని చిత్రించడమే కాకుండా భవిష్యత్తులో ఎటువంటి సమాజాన్ని కావాలని కోరుకుంటున్నారో ఆ దిశగా ప్రజలను, వారి ఆలోచనలను మరలించడానికి తగు ప్రయత్నం చేశారు. ఈ సమాజానికి వాస్తవాలను చాటిచెప్పడమనే లక్ష్యాన్ని నిర్దేశించారు. కేవలం గెలుపే పరమావధిగా ఎన్ని రకాలుగా పనులు చేస్తున్నారో అన్నిటినీ ఈ శతకం దుయ్యబట్టింది.

నరసింహారెడ్డి ఈ శతకంలో తిక్కలోడు, ఒర్లుబోతు, మాయమాటలు హామీల మర్మమెరుగని ఒక దోస్తు పాత్రను సృష్టించారు. అతని పేరే ఎంకన్న. ఆ దోస్తును సాకుగా చేసుకొని **"ఓట్లు ఎట్లా వేస్తావు వెర్రి ఎంకన్నా! ఒక మాటన్న వినవారా"** అను మందలింపుతో ఎన్నికల గుట్టును రట్టు చేశారు. ఇక్కడ ఎంకన్నను సంబోధించడమంటే సమాజాన్ని సంబోధించడమే, సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరినీ ఉద్దేశించి చెప్పడమే. ప్రతిమనిషిలోని వెర్రి ఎంకన్నకు చెబుతున్న పాఠంగా తోస్తుంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచిపోయినా ప్రజాపాలన లేకుండా పోయిందని, అట్టడుగు వర్గాల క్షేమాన్ని పాలకులు మరచిపోయారని, ఐదేళ్లకొకసారి వచ్చే నేతలు తమ లాభమే తప్ప ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోవడంలేదని దుయ్యబట్టారు. ఇలాంటి వారి మాయమాటల హామీల మర్మాన్ని తెలుసుకోకుండా ఓటు ఎట్లా వేస్తావని ప్రశ్నించారు. మాయమర్మమెరుగని ప్రతి ఒక్కరూ తాను ఉద్దేశించి చెప్పిన ఎంకన్నలాంటివాడే. ఒక దోస్తుగా సంబోధిస్తూనే ఒర్లుబోతు, తిక్కలోడ అనేటువంటి అచ్చమైన తెలంగాణ ప్రజలు నిత్యం వ్యవహరించే పలుకుబడుల భాషాపదాలను వాడడం వల్ల సామాన్య పాఠకులకు కూడా అర్థమయ్యే సహజశైలిలో ఈ శతక పద్యాలు ఉన్నాయి. ప్రాచీన కవులలో సీసపద్యాలు రాయడంలో దిట్ట శ్రీనాథుడైతే ఆధునిక కాలంలో సీసపద్యాలు రాసి మెప్పించిన శతక కవుల్లో కాసుల పురుషోత్తమ కవి, ధర్మపురి శేషప్ప సుప్రసిద్ధులు. అచ్చమైన ప్రజల భాషలో పద్యాలను రాసి వాటికి సహజమైన తెలంగాణ మట్టివాసనల్ని అద్ది, అలవోకగా పదాలను ప్రయోగించడమే కాకుండా అద్భుతమైన కవితాధార కలిగి ఎక్కడ కూడా తడబాటు లేకుండా పదాలను ప్రయోగించిన విధానం నరసింహారెడ్డికి పద్యరచన పై ఉన్నటువంటి పట్టును తెలియజేస్తుంది. గణాల కోసం పదాలను ప్రయోగించే వెతుకులాట గాని, తడబాటుగాని ఎక్కడా కనబడదు. మచ్చుకు –**"ఇంత గొంగడిబొచ్చు ఇంత అంగడి చిచ్చు/ ఇంత చిల్లంకొల్లమింత లొల్లి/ ఇంతలా**

**బరిబాత ఇంత విచ్చలవిడి/ ఇంత దౌడలవొంపులింత తూట/ లింత మాటలకోటలింత పాపపు ఊట/ ఇంత కూల్చుడు గూటమింత ఆట/ ఇంత తార్పుడు మాటలింత బలుపు పల్కు/ లింత కప్పల దూకుడింత కంపు''** అంటూ రాజకీయాలలో ఇంతటి రంకుతనము పూర్వకాలంలో ఎప్పుడూ లేదంటూ తన అసహ్యతను ప్రకటించారు. ఎన్నికల సమయాన ఎన్నెన్ని వంకర మాటలు, ఎన్ని వంకర బుద్ధులు, ఎన్ని మాయమాటలు, ఎన్ని అబద్ధాలు – రాజకీయాలు ఒక పెంటగా మారిపోయినాయని, రాజకీయ నాయకుల హామీలన్నీ నీటి మీద గీతలాగానే మారిపోయాయని అంటూ **"తుప్పుమని ఉమ్ముటయె ఇక తప్పదేమొ"** అంటూ ఈసడించుకున్నారు.

ఎన్నికలవేళ నాయకులు ఎన్నడూ వెళ్ళనటువంటి గడపలకు కూడా వెళతారని, ఎప్పుడూ ఆడని మాటలు మాట్లాడుతారని, ఏనాడు చేయని చేష్టలు కూడా చేసి నటరత్నాలుగా రాణించే విధానాన్ని బట్ట బయలు చేశారు. ఇంటింటికి బైకులు ఇస్తానని, ఇంటికో టివి పంచిపెడతానని, సెల్ ఫోన్లు ఇప్పిస్తానని, ఏసీలు పెట్టిస్తానని చేసే వాగ్దానాలకు లెక్కేలేదు. ఏనాడు కూడా ప్రేమ చూపించనివారు ఎన్నికలప్పుడు చూపించే కపటప్రేమ ఇంతంత కాదు. మటన్ బిర్యానీలతో, తీరైన చేపలతో, రొయ్యలతో, పీతలతో, రకరకాల వంటలతో, పసందైన మందుతో విందు ఏర్పాటు చేస్తారని అటువంటి వాటికి లొంగకుండా ఓటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒక పార్టీవారు చేసే వాగ్దానాలకు మించి మరొక పార్టీ నాయకులు వాగ్దానాలు చేస్తుంటారని ఎవరి మాయలో పడకుండా, ఎవరి ప్రలోభాలకు లొంగకుండా వారి ఆటలను, కుట్రలను,మోసాలను పసిగట్టి చాలా తెలివిగా వ్యవహరించి సరైన వాడికే ఓటు వేయాలని ప్రబోధించారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత గోడ మీది పిల్లిలా ఎప్పుడు ఏ పార్టీ కండువా కప్పుకుంటాడో తెలియని స్థితి. ఒక పార్టీ ద్వారా ఎన్నికైనటువంటి నాయకులు ప్రతిపక్షపార్టీలో ఉంటే ఎలాంటి ప్రయోజనం ఉండదని భావించి అధికార పార్టీలోకి ఏ విధంగా చేరుతుంటారో ఆ విషయాలను పూసగుచ్చినట్లు ఏకరువు పెట్టారు. రాజకీయం ఒక క్రూరజంతువులాంటిదని, అడవి జంతువులను తలపించేలా నాయకుల ప్రవర్తన ఉంటుందని, అటువంటి వారిని చూసి గర్వించాల్సిన అవసరం లేదని తెలియ జేశారు. నీతిగల నేతలు ఒక్కడు కూడా లేడంటూ కాటు వేయని నాగుపామును చూడనట్లే దోచుకొనని నాయకుని చూడలేని పరిస్థితి దాపురించిందని బాధపడ్డారు. ఏ రోటికాడి పాట ఆ రోటికాడ పాడుతూ పచ్చి అవకాశవాదుల్లా ఉంటూ దొంగే దొంగ అన్నట్లుగా వ్యవహరిస్తూ ఉంటారని, నేతిబీరకాయలో నెయ్యి ఏ విధంగా ఉండదో నీతివంతమైన రాజకీయాలు చేస్తామన్న వీరి మాటల్లో కూడా ఆ నీతి అసలే ఉండదని నేటి రాజకీయ నాయకుల నైజాన్ని బయటపెట్టారు. రాజకీయంలో ఉన్న రాబడి మరెక్కడా లేదని, వార్డు మెంబర్ అయినా సరే అందినంత దోచుకోవచ్చని భావించి, కనీసం వార్డ్ మెంబర్ కావడం కోసమైనా ప్రయత్నిస్తున్నారని తెలియజేశారు. డబ్బు లేకుంటే రాజకీయాలే దండుగనే పరిస్థితి దాపురించిందని అధిక్షేపించారు. ఎంతసేపటికి ఓట్లు వేసుకొనుటవరకే గుర్తుంటుంది కాని ఇచ్చిన హామీలను మాత్రం పూర్తిగా మరచిపోతుంటారని అటువంటి నయవంచకుల ఆటలను సాగనియ్యవద్దని అన్నారు. ఇంటింటికి నౌకరు ఇప్పిస్తానని, ఊరూరికి రైలు వచ్చేటట్లు చేస్తానని, పుణ్య తీర్థాలకు పుణ్యానికి ప్రయాణం చేయిస్తానని రకరకాల హామీలు ఇచ్చి పదవి ఎక్కిన తర్వాత వాటిని పట్టించుకోరని, అటువంటి వారి గుట్టును తెలుసుకొని బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని సూచించారు.

ఏనుగు నరసింహారెడ్డి చమత్కారవంతమైన శైలిలో రాసిన పద్యాలో మచ్చుకు ఒకటి – **"కల్లు తాగిన వాడేపో కంసుడంటె/ బీరు తాగినవాడెపో భీముడంటె/ తాగనోడెవ్వడున్నడీ ధరణి మీద/ ఏమి తాగనివాడెపో ఎదవ కొడుకు"** అంటూ తాగనివాడు వెధవ అని భావించే తిక్కసమాజం నైజాన్ని విప్పి చెప్పారు. సాధారణంగా శతకాల్లో ఏకపద, అర్ధపాద, ఏకపాద, ద్విపాద మకుటాలు ఉంటాయి. కానీ ఈ శతకంలో సీసపద్యం చివర తేటగీతి ఉంటూ ఆపైన మరొక తేటగీతి పద్యాన్ని పూర్తి మకుటంగా ప్రయోగించడం ఒక వినూత్న ప్రయోగం. ప్రతిపద్యంలో సహజమైన తెలంగాణ మట్టిపరిమళాలతో కూడిన భాషాపదాలను ప్రయోగించి ఆ పద్యాలకు మరింత వన్నె తెచ్చారు. అన్యభాషా పదాలను కూడా అలవోకగా ప్రయోగించే నేర్పరితనం ఈ పద్యాల్లో కనబడుతుంది. మెక్డోనాల్డ్, బ్లాక్ డాగ్, స్క్రాచ్, బ్రాండ్, రూల్స్, కార్నర్ మీటింగ్, స్ట్రెయిట్, ప్రెస్ మీట్, కోవర్టు, కోపరేషన్.. ఇలాంటి పదాలను అలవోకగా ప్రయోగించి ఆ పద్యాలకు సహజత్వాన్ని అద్దారు. పార్టీ, ప్రాంతం, వర్గం అనే భేదం లేకుండా ప్రతి రాజకీయ నాయకుని నైజం ఒకే తీరుగా ఉంటుందని చెప్పారు – **"నిజము రాజకీయాలలో నిలువలేదు/ మంచి నేతల చుట్టార మనగలేదు/ పరువు అను మాటకసలైన పసయె లేదు/ అన్ని నిర్వచనమ్ములనదియె మార్చె"** అంటూ ప్రతి రాజకీయ నాయకుని నైజం ఒకే విధంగా ఉందని, ఈ రాజకీయ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసినప్పుడే నూతన సమాజం పరిఢవిల్లుతుందని అన్నారు. కుళ్ళు కుతంత్రాలతో భ్రష్టుపట్టిపోయిన రాజకీయ వ్యవస్థకు సీసం(పద్యం)తో గట్టి వాత పెట్టారు. ఈ శతకం ద్వారా రాజకీయ వ్యవస్థలో ఏమాత్రం మార్పు వచ్చినా నరసింహారెడ్డి శ్రమ ఫలిస్తుందని భావిస్తూ శతక సాహిత్యంలో ఒక మంచి శతకంగా సుస్థిర స్థానాన్ని సంపాదించుకుంటుందని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు. గుడిపాటి అన్నట్లుగా **"శతకంగా, కవిత్వంగా, ఎన్నికల నిఘంటువుగా ఏడుకోలల బాయి ప్రజల నోళ్ళలో నిలిచిపోతుంది".**

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5 

# స్వ'కృతి'






**నిఘంటువులలో దృశ్యాలు - భాషాశాస్త్ర అధ్యయనం**
కొలుపుల ప్రశాంత్
వెల : 250/-
**ప్రతులకు :** రచయిత, ఇం.నెం. 215, టెలికాం నగర్, గచ్చిబౌలి, హైదరాబాద్ - 500 032.
ఫోన్ : 934 6117105



**ఆంధ్ర వైభవము (పద్య కావ్యము)**
అన్నమరాజు ప్రభాకర రావు
వెల : 130/-
**ప్రతులకు :** శ్రీమతి అన్నమరాజు త్రిపుర
ఇం.నెం. 5-2-146 (ప్లాట్ నెం. 16)
రోడ్ నెం. 1, గాంధీనగర్, వనస్థలిపురం,
హైదరాబాద్ - 500 070
ఫోన్ : 9440 258 292



**శ్రీ శూద్ర గంగ (వచన రూప కావ్యం)**
డా. సుద్దాల అశోక్ తేజ
వెల : 100/-
**ప్రతులకు :** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో లభించును.




**రవీంద్రనాథ్ టాగోర్ - గీతాంజలి**
తెలుగు స్వేచ్ఛానువాదం
రంగనాథ్ దేశిరాజు
వెల : 100 /-
**ప్రతులకు :** భారతీ దేశిరాజు
ఫోన్ : 98481 28845




**యాత్రోక్తులు**
డా. ఎన్. ఆర్. వెంకటేశం
వెల : 150 /-
**ప్రతులకు :** ఎన్. విక్రాంత్, 3-11-91, స్ట్రీట్ నెం.3, ఆర్‌టిసి కాలనీ, ఎల్.బి.నగర్, హైదరాబాద్ -74
ఫోన్ : 934 650 2342

## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా
**సంపాదకుడు, మూసీ మాసపత్రిక,**
**ఇం.నెం. 2-2-1109/బికె-ఎల్.ఐ.జి.10,**
**బతుకమ్మకుంట, బాగ్‌అంబర్‌పేట,**
**హైదరాబాద్-500013.**
**చందాలకు ఆన్‌లైన్ అకౌంట్**
**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.**
**అకౌంట్ నెం. 52019740642**
**IFS Code : SBIN0020083**
**editormusi@gmail.com**




**జ్ఞానపీఠ త్రయం**
సంపాదకులు : డా. లక్ష్మి అసిరెడ్డి
సహ సంపాదకులు : డా. తిరునగరి శరత్‌చంద్ర
వెల : 250 /-
**ప్రతులకు :** సంపాదకులు, ఇం.నెం. 5-2-41, ఎ.పి.హెచ్.బి. కాలనీ, భువనగిరి, యాదాద్రి భువనగిరి జిల్లా - 508 116.
ఫోన్ : 994 884 6486




**పిట్ట గూళ్ళు (పిల్లల కథలు)**
మేరెడ్డి యాదగిరి రెడ్డి
వెల : 100 /-
**ప్రతులకు :** రచయిత, జి.10, లక్ష్మీనివాస్ అపార్ట్‌మెంట్, యం.ఎల్. జి. రోడ్డు, నల్గొండ
ఫోన్ : 99494 15796




**సహృదయ సుందరం**
(డా. కె.వి. సుందరాచార్యుల వారి 90వ జన్మదిన అభినందన సంచిక)
వెల : 100/-
**ప్రతులకు :** కె.వి. లక్ష్మణ స్వామి,
ఇం.నెం. 16-1-24/160, ఎస్.ఆర్.టి. శ్రీ రామాలయం దగ్గర, సైదరాబాద్ హౌసింగ్ బోర్డ్ కాలనీ, హైదరాబాద్ - 500 059
ఫోన్ : 9490 67511

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5  హైదరాబాద్ ఏప్రిల్ : 2025

# సునీతా విలియమ్స్



డా. ఎన్. గోపి

ఫోన్ : 939 102 8496







నేనిప్పుడు
భూగోళం భాషలో మాట్లాడుతున్నాను
ధైర్యం, సహనం
మొక్కవోని అనర్ఘ స్థైర్యం
మనకు తెలిసిన మాటలన్నీ
నీముందు పొల్లులే
వాటి అర్థాలు కూడా డొల్లలే.

మా ఊహకందని
ఒకానొక అగాథ శూన్యావరణం
మానవ జీవిత శరీర కణజాలాన్ని
అదుపు చేసుకునే
ఒక అమోఘ విచిత్ర విన్యాసం
అంతరిక్షంలోని
కొలతలన్నింటి పైనా
నీ అనుగుణ నైపుణ్య ధిక్కారం.

నీ గుండె
అగణిత స్పందనల కన్న గొప్పది
అక్కడి నుండి కనిపించే
ఇక్కడి నీలిబంతి సుందరవదనం
ప్రస్తుతం నీకో అనుభూతి,
నీ అపురూప సాహసం
మాకో అతీత అనిర్వచనీయ మనోజ్ఞ గీతి.

ఇక్కడ నీకు తెలియందేముంది
యుద్ధాలు, అగ్రపెత్తనాలు
మానవత్వ హననాలు
నువ్వొచ్చేసరికి
మరికొన్ని అసహజమరణాలు

రక్త సిక్త కవిత్వ చరణాలు
నువ్వులేని తొమ్మిది నెలల్లో
గ్లోబునిండా అంతులేని
వ్యాపార విషవీచికల విషమవిహారం.

ఇవాళ నీకు
నీ డాగ్స్ వైపు మనసు గుంజింది
భూమ్యాకర్షణ శక్తికన్నా
సెంటిమెంట్ బలీయమైందని నిరూపించావు.
సునీతా....
నువ్వు మా మధ్యకు రాక తప్పదు
నీ పవిత్రమైన మనశ్శరీరాలు
భావితరాలకు నిస్పందేహాస్పదాలు
నీస్ఫూర్తి
మన దేశమనే చిన్న శకలానికే కాదు
యావత్ విశాల విహాయసానికే కాదు
గ్రహాలనే నిత్య చలనశీల విగ్రహాలకే కాదు
అఖిల ప్రాణికోటి అనే స్పెసీలన్నింటికీ
ఎనలేని ఉజ్వల కీర్తి నీది.
మనిషి అనే స్పెసీకి
రెంచు చేతులున్నాయి కాబట్టి
వాటితో నీకు నా శతకోటి నమస్కారాలు.

**(వ్యోమగామి సునితా విలియమ్స్ సాంకేతిక కారణాల వల్ల 9 నెలలుగా రోదసిలో చిక్కుబడిన సందర్భంగా)**

Regd No. R.N.37723/80
P.R.No.HSE-824/2023-2025
Date of Publication 1st of Every Month
Date of Posting 5th / 6th of Every Month




From :
**The Manager, MUSI Telugu Monthly Magazie**
# 2-2-1109/BK - LIG - 10, Batukammakunta, Bagh Amberpet, Hyderabad- 500 013.
Cell : 9347971177, Email : editormusi@gmail.com

Printed, Published and Owned by : B.Manohari, Printed at Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
Published at H.No.2-2-1109/BK, LIG - 10, Batukammakunta, Bagh Amberpet, Hyderabad - 500 013. Telangana
Editor : Dr.Sagi Kamalakara Sharma